

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi,Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-2-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 361 పేజీలు: 10+4 వెల: 8.00



ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ 2లో

మహారాష్ట్ర డిసిఎంగా సునేత్ర పవార్ 5లో


నేడే కేంద్రబడ్జెట్

## మధ్య తరగతిపై పన్నీటి జల్లు!



పన్ను ఊరటపై వేతన జీవుల ఆశలు

కార్పొరేట్, పారిశ్రామిక రంగాలకు మరిన్ని రాయితీలు

పార్లమెంటుకు పద్దులు సమర్పించనున్న ఆర్థికమంత్రి సీతారామన్

**న్యూఢిల్లీ,జనవరి 31:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈమార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని >>2

# సుపరిపాలనే లక్ష్యం

**కుప్పం, జనవరి 31 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యమని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడురోజుల కుప్పం పర్యటనలో భాగంగా శనివారం శాంతిపురం మండలం తులసినాయనపల్లి వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదిక బహిరంగసభలో ప్రజలనుద్దేశించి సిఎం ప్రసంగించారు. అంతకు ముందు పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బెగ్గిలపల్లిలో పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రజలు సైకిల్‌కు ఓట్లే శారని రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. ఆరోగ్య, స ంపద, ఆనందకర సమాజమే ధ్యేయ ంగా పనిచేస్తున్నామన్నారు. పేదలముఖాల్లో ఆనందమే నిజమైన సమాజం అని సిఎం పేర్కొన్నారు. పేదలకు సాయం చేసేందుకే సూపర్‌సిక్స్ పథకాలుఅమలు చేస్తున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్స్ సేవు గేమ్‌ఛేంజర్‌గా మారాయన్నారు. దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రమంతా సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తామన్నారు. అవకాశాలు అందిపుచ్చుకోవడం తన జీన్స్‌లోనే ఉందన్నారు. తాను కొత్త ఆవిష్కరణలు చేస్తుంటానని దాని ఫలితాలు అందరికీ దక్కాలని కోరుకుంటానని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు వస్తాయని తద్వారా మహిళలు అధికంగా ఎమ్మెల్యేలు, ఎంపిలు అయ్యేఅవకాశం ఉందన్నారు.

ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతుల భూముల పాస్‌పుస్తకాలు, సర్వేరాళ్లపై జగన్ బొమ్మలను 700కోట్లు ఖర్చుతో వేయించుకున్నారన్నారు. రైతుల భూములకు ఎసరు పెట్టే ల్యా ండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారన్నారు. ప్రభుత్వ భూముల్ని 22ఎ జాబితాలో పెట్టారన్నారు. ప్రతినెలా9వతేది తానే స్వయ ంగా రెవెన్యూ వ్యవహారాలు పరిశీలిస్తున్నానని పేర్కొన్నారు. రూపాయి అవినీతి లేకుండా తాను ప్రక్షాళన చేస్తున్నట్లు పేర్కొన్నారు.ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దుచేయడంతోపాటు రైతుల భూములకు సంబంధించి బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ విధానాలు తెచ్చామని తద్వారా రైతుల భూరికార్డులు పకడ్బందీగా ఉంటాయన్నారు. >>2



శనివారం గుడుపల్లె మండలం బెగ్గిలపల్లిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన గత ప్రభుత్వం

రూపాయి అవినీతి లేకుండా ప్రక్షాళన

రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్రణాళిక

కుప్పం ప్రజావేదిక సభలో సిఎం చంద్రబాబు



2లో

కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో సైకిల్ తొక్కుతున్న సిఎం చంద్రబాబు

మూడు కి.మీ.లు సైకిల్ తొక్కిన సిఎం చంద్రబాబు



# అమెరికాలో మరోసారి షట్‌డౌన్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా ప్రభుత్వం మరోసారి షట్‌డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రిలో ముగిసింది. దాంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. మినియాపొలిస్‌లో ఇటీవల ఇద్దరు ఆందోళనకారులు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారుల కాల్పుల్లో మరణించడంతో సెనెట్ డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చట్టాన్ని అమలుచేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతిస్తారు. సరిహద్దు భద్రతా దళాలకు మద్దతుగా నిలుస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే, అమెరికా పౌరులను చంపే ఐసిఇ అధికారులను ఉపేక్షించబోరు' అని తీవ్రంగా స్పందించారు. దానిని సంస్కరించకపోతే నిధుల విడుదల బిల్లుకు అవసరమైన ఓట్లు వేయబోమంటూ వారు హెచ్చరించారు. దీంతో హోంలాండ్ భద్రత, ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి. అయితే ఇది పాక్షికమేనని వచ్చే వారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని చట్టసభ సభ్యులు పేర్కొన్నారు. గతేడాది అక్టోబరు 1న కూడా అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలో సుదీర్ఘకాలం (43 రోజులు) పాటు కొనసాగింది. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. 1981 నుంచి యుఎస్ ప్రభుత్వం 16 సార్లు మూతపడింది. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.

ఆర్థికబిల్లు ఆమోదం పొందేవరకూ అత్యధిక సిబ్బందికి జీతంలేని విధులే..

అత్యవసర సర్వీసుల వరకే పరిమితం



మీడియాతో మాట్లాడుతున్న అంబటి

గుంటూరులో హైటెన్షన్

# అంబటి అరెస్టు



సిఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో రాంబాబు అరెస్టు

అంబటి ఇంటివద్ద తీవ్ర ఉద్రిక్తత

నివాసం వద్ద తోపులాటలో పలువురికి గాయాలు

సిఎంపై వ్యాఖ్యలు చేయలేదు, టిడిపి కార్యకర్తలను దూషించడం తప్పేనని ఒప్పుకొన్న అంబటి

**విజయవాడ.జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైకాంగ్రెస్ పార్టీనేత అంబటి రాంబాబును పోలీసులు శనివారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేసారు. సీఎం చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి ఇచ్చిన ఫిర్యాదుపై గుంటూరు పరిధిలోని నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తాను అరెస్ట్‌కు భయపడేది లేదని,సీఎంను తాను అనుచితంగా మాట్లాడలేదని స్పష్టం చేసారు. టీడీపీ అధినేత,సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీసాయి.సీఎంపై అంబటి చేసిన వ్యాఖలకు క్షమాపణ చెప్పాలని టీడీపీ కార్యకర్తలు డిమాండ్ చేస్తూ ఆయన ఇంటి మీదకు దూసుకుని వెళ్ళడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది, ఈ పరిస్థితుల నడుమ అంబటి వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలకు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఇక పరిస్థితుల నేపథ్యం గమనిస్తే తిరుమల నెయ్యి కల్తీపై గుంటూరులో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కాసేపు ఉద్రిక్తతకు కారణమైంది. గోరంట్లలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద "మహాపాపం "పేరుతో టీడీపీ నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని తొలగించాలని లేకుంటే తామే తొలగిస్తామని వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు నిన్న ప్రకటించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం గోరంట్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అంబటి ఫ్లెక్సీ వద్దకు వస్తామని ప్రకటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీ వద్దకు భారీగా చేరుకున్నారు.గొడవ జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబును ఫ్లెక్సీ వద్దకు రావొద్దని కోరారు. అయితే ఆలయంలో పూజల తర్వాత రాంబాబు ఆ మార్గంలో వెళ్తుండగా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. రాంబాబు వాహనం దిగేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. ఆగ్రహంతో ఊగిపోయిన అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంబటి రాంబాబును పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు. చంద్రబాబుపై అంబటి రాంబాబు వ్యాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు ఖండించారు. బరితెగించి మాట్లాడిన అంబటి రాంబాబు చంద్రబాబుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబటి రాంబాబుపై గుంటూరు జిల్లా ఎస్పీకి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. అంబటి ఇంటిపై టీడీపీ శ్రేణులు రాళ్లు రువ్వారు. కిటికీ అద్దాలు, పూలకుండీలు ధ్వంసం చేశారు. టీడీపీ మహిళా కార్యకర్తలు కోడిగుడ్లు విసిరి నిరసన తెలుపుతున్నారు. అంబటి వెంటనే క్షమాపణలు చెప్పాలని మహిళా కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. నవభారతనగర్‌లోని అంబటి ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. అంబటి ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. టీడీపీ మహిళలను వెనక్కి వెళ్లాలని పోలీసులు కోరారు. ఇంచుమించు శనివారం ఉదయం నుంచి సాగుతున్న ఈ నాటకీయ రాజకీయ పరిణామాలకు అంబటి అరెస్ట్‌తో తెరపడినట్లయింది. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయలేదు,,టీడీపీ కార్యకర్తలను బూతులు తిట్టకుండా ఉండాల్సింది. తనపైకి దూసుకుని వచ్చారన్న ఆవేశంతో టీడీపీ కార్యకర్తల్ని తాను తిట్టి ఉండాల్సింది కాదని వైసీపీ నేత అంబటి రాంబాబు అన్నారు.ఆమేరకు ఆయన >>2

'లడ్డూ కల్తీ'లో వైసిపికి

# క్లీన్ చిట్ రాలేదు

ఆర్థిక మంత్రి పయ్యావుల

**విజయవాడ.జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** టీటీడీ లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీకి ఎలాంటి క్లీన్ చిట్ రాలేదని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వైసీపీ తమకు క్లీన్ చిట్ వచ్చినట్లు చేసుకుంటున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దేవదేవుడి విషయంలో పాపం చేసి సంబరాలు చేసుకోవడానికి ఆ పార్టీ నేతలకు సిగ్గుండాలని విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 201419 మధ్య టీడీపీ ప్రభుత్వం స్వామివారి లడ్డూ పవిత్రతను కాపాడేందుకు అనేక పకడ్బందీ నిబంధనలు పెట్టిందని, కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ నిబంధనలను సడలించి కల్తీకి బీజం వేసిందని అన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2022లో సీఎఫ్‌టీఆర్ఐ(సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) నెయ్యి పేరిట సరఫరా అయిన పదార్థాల్లో జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారించిందని ఆ నివేదికను నాటి వైసీపీ ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పాటు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రి విమర్శించారు. దేవుడి ప్రసాదానికి ముడిసరకు పంపిణీని ఆర్థిక అంశంగా మాత్రమే గత పాలకులు చూశారన్నారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు హవాలా మార్గంలో వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉందన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ల్యాబ్ అయిన ఎన్‌డీడీబీ(నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారణ చేసిన అంశాన్నే సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారని ఇదే విషయం సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) అనుబంధ ఛార్జ్ షీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని మంత్రి వివరించారు.వైసీపీ చెబుతున్నట్లుగా క్లీన్ చిట్ ఎక్కడ వచ్చిందో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. చేసినతప్పుకు క్షమాపణలు కోరాల్సింది >>2



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత

## రమేష్ దారుణ హత్య

ట్రాక్టర్‌తో ఢీకొట్టి, రాళ్లతో దాడి చేసిన దుండగులు

**కర్నూలు, జనవరి 31, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందిమడుగుల రమేష్ శుక్రవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్‌తో ఢీకొట్టి అనంతరం రాళ్లతో దాడి చేయడంతో ఆయన మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనలో పదిమందికి పైగా దుండగులు పాల్గొని ఉండవచ్చని రమేష్ అనుచరులు ఆరోపిస్తున్నారు. ఈ హత్యకు నిరసనగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కర్నూలు నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద దళిత సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రమేష్ మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా చేయడంతో సుమారు రెండు గంటలపాటు >>2

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు

## 730 మంది పునర్నియామకం

ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 730 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల(పురుష) పునర్ నియామకానికి అనుమతి ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో భాగంగా వీరిని ఒప్పంద ప్రాతిపదికన విధుల్లోకి తీసుకోవాలని తెలిపింది. మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యఆరోగ్యశాఖపై సమీక్ష చేసిన సమయంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీహెచ్ఏలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ మేరకు తాజాగా వీరందరిని మళ్లీ విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూడు నెలల క్రితం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమించిన 1200మంది హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. హైకోర్టు 2013లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టేయగా.. మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీం కోర్టులో సవాలు చేయగా.. వారందరికి ఊరట లభించింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో అప్పటి ప్రభుత్వం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే కొంతమంది అభ్యర్థులు హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించారు. అప్పటి ప్రభుత్వం టెన్త్ క్లాస్, డిప్లొమో ఉన్నవారు అర్హులని ఇచ్చిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం ఇంటర్ అర్హతతో అపాయింట్ అయిన 1200మందిని కోర్టు ఉత్తర్వులతో టెర్మినేట్ చేశారు. ఆ తర్వాత 2013లో వీరందరిని కారుణ్య నియామకాల నిబంధనల కింద విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 2013లో ఈ జీవోను హైకోర్టులో కొందరు సవాల్ చేయగా హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టి జీవోను రద్దు చేసింది. ఆ తర్వాత అర్హులైన వారు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమకు >>2

# 'కల్తీ' నెయ్యిలో బోలేబాబా డెయిరీ కీలకం

సిబిఐ సిట్ కీలక నివేదికల దుమారం! రసాయనాలు కలిపిన నెయ్యినే సరఫరా



**తిరుపతి,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** 2019-24 మధ్యకాలంలో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు నెయ్యి సరఫరా టెండర్ల నిబంధనలు మార్చి తీసుకున్న నిర్ణయం ఇప్పుడు సిబిఐ సిట్ ఇచ్చిన కీలక నివేదికలు పెద్ద దుమారం రేపుతూన్నాయి.నివేదికలు మార్చి స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేయాల్సిన సంస్థలు పలు రకాల రసాయనాలు కలిపి నెయ్యి కల్తీచేసి లడ్డూల తయారీకి టిటిడికి పంపారనేది సిట్ అధికారులు క్లైమాక్స్‌లో ఏసిబి కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో రెండురోజులుగా సిట్ నివేదికలు ప్రభుత్వానికి అందడంతో కల్తీనెయ్యి బాగోతంలో కర్త,కర్మ,క్రియ ఎవరనేది ఆధారాలతో తేల్చేసినా సూత్రధారులు ఎవరనేది వెల్లడించకపోవడం వెనుక పెద్ద ట్విస్ట్ ఉందని ప్రస్తుత టిటిడి బోర్డు పెద్దలు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సభ్యులు తిరుపతిలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించడం పెద్ద హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే సమయంలో గత టిటిడి ఛైర్మన్,వైసిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆయన ఇంట్లో నిందారోపణ ప్రాయశ్చిత్త పరిహార హోమం చేపట్టడంతో మరింత వేడెక్కించింది. తప్పులుచేసి అబద్దాలతో హోమాలు చేయడం దేనికి నిదర్శనమని తాజా బోర్డు సభ్యులు విరుచుకుపడ్డారు. ఇప్పటికే నెయ్యికల్తీ జరిగిందనేది సిబిఐ సిట్ సమగ్రంగా ఆధారాలతో కోర్టుకు సమర్పించిన రిపోర్టులో పేర్కొనడం సంచలనం కలిగిస్తోంది. ఈ కల్తీనెయ్యికి ఉత్తరాఖండ్ బోలేబాబాడెయిరీ యాజమాన్యం కీలకమని కూడా సిబిఐ సిట్ అధికారులు నిర్ధారించారు. 2022లోనే నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్న ఈ డెయిరీని టిటిడి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారని, అయితే ఆ తరువాత మాల్‌గంగ డెయిరీని బోలేబాబా తెరపైకి తీసుకు వచ్చిందని, ఈ డెయిరీకి కమీషన్లు ఇచ్చి సుగంధ ఆయిల్స్, పామోలిన్‌తోబాటు మరికొన్ని రసాయ నాలు కలిపి తయారుచేసిన కల్తీనెయ్యిని పరోక్షం గా బోలేబాబా డెయిరీనే టిటిడికి పంపిందని సిట్ తేల్చేసింది. కల్తీ నెయ్యి విషయంలో 2020-24వరకు జరిగిన విషయాలపై మాజీ ఇఒ సమగ్రంగా ఆధారాలతో సిట్‌కు వాంగ్మూలం ఇవ్వడం కూడా జరిగింది. గత ఐదేళ్ళలో 250 కోట్ల రూపాయలకుపైగా విలువైన 68.17లక్షల కిలోల కల్తీనెయ్యి సరఫరా చేసినట్లు సిబిఐ సిట్ బృందం నివేదికల్లో పేర్కొంది. అదే సమయంలో గత ఏడాది >>2



శనివారం కుప్పంలో గిన్నిస్‌బుక్ రికార్డు సర్టిఫికెట్ అందుకుంటున్న సీఎం చంద్రబాబు

## 24గంటల్లో 5555 రాయితీ ఇ సైకిళ్లు పంపిణీ

**కుప్పం, జనవరి 31 ప్రభాతవార్త:** పర్యావరణ హితమైన ఇ-సైకిళ్ల పంపిణీకి సంబంధించి సిఎం చంద్రబాబునాయుడు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను శనివారం అందుకున్నారు. సిఎం ఆదేశాలతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా కేవలం 24గంటల్లోనే రాయితీతో కూడిన 5555 ఇ-సైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ స్వర్ణకుప్పం -స్వచ్ఛకుప్పం లక్ష్యాల్లో భాగంగా ఇ - సైకిళ్లను మహిళా సాధికారతలో ప్రపంచానికే రోల్‌మోడల్‌గా నిలిచేలా చర్యలు చేపట్టామన్నారు. ఇ-సైకిళ్ల వాడకంతో ప్రతికుటుంబానికి నెలకు వెయ్యికి పైబడి ఆదా కావడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సైతం ఏర్పడుతుందన్నారు. స్వచ్ఛమైన గాలి కుప్పం సొంతమని బయటి ప్రాంతాల ప్రజలకు ఇక్కడకు వచ్చి సెటిల్ కావడం జరుగుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా కుప్పంలో ప్రతి పంచాయతీకి ఇ - ఆటోలు ఇదివరకేఅందించామన్నారు. తాము ప్రజలకు అందించింది సూపర్ సైకిల్ అన్నారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటుచేయిస్తామని సిఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, గిన్నిస్ బుక్ ప్రతినిధులు, మోటరాడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

## మూడు కి.మీ.లు సైకిల్ తొక్కిన సిఎం చంద్రబాబు

**శాంతిపురం, జనవరి 31 ప్రభాతవార్త :** అసాధారణ భద్రత కేటగిరీ అయిన జడ్‌ప్లస్ కేటగిరీలో ఉన్న సిఎం చంద్రబాబునాయుడు శనివారం మూడు కిలోమీటర్ల దూరం మేర ఇ-సైకిల్‌ను ఎంతో ఉత్సాహంతో తొకా్కరు. భద్రత సిబ్బంది కొంతమంది మా త్రమే వెంట రాగా సిఎం చంద్రబాబు ఎంతో హుషారుగా సైకిల్‌ను తొక్కడం విశేషం. స్థానిక కడపల్లి వద్ద ఉన్న తమ సొంత నివాస గృహంవద్ద రాయితీ ఇ-సైకిళ్లను పలువురులబ్ధిదారులకు సిఎం పంపిణీ చేశారు. అనంతరం అక్కడ నుంచి ప్రజావేదిక బహిరంగ సభ అయిన తులసినాయనపల్లి గ్రామ సమీపం వరకు సిఎం చంద్రబాబునాయుడు కుప్పం -పలమనేరు జాతీయ రహదారిలో సైకిల్ తొక్కుతూ ముందుకుసాగారు.

## పదవీ విరమణ వయసు పెంపు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం: హైకోర్టు ధర్మాసనం

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62కు పెంచే విషయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పదవీ విరమణ వయసు పెంపు వ్యవహారం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. విరమణ వయసు పెంచాలంటే సర్వీసు నిబంధనలు అందుకు అనుగుణంగా సవరించాలని గుర్తుచేసింది. పదవీ విరమణ వయసు పెంపునకు కార్పొరేషన్లు, సొసైటీల పాలకమండళ్లు తీర్మానాలు చేసినా వాటిని ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు నిరాకరిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు చెప్పింది. పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగి డి.మాధవరావు, ఏపీ కోపరేటివ్ ఆయిల్ గ్రోయిర్స్ ఫెడరేషన్ ఉద్యోగి వి.విల్సన్‌రాజు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. వీటిని కొట్టేస్తే గతేడాది నవంబర్ 18న న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాలు చేస్తే విల్సన్‌రాజు, మాధవరావు ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం పిటిషనర్లు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు కాదని గుర్తుచేసింది. అప్పీళ్లను కొట్టేసింది.

## 730 మంది పునర్నియామకం

>> న్యాయం చేయాలని కోరారు. అయితే 2013లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలు చేస్తామని ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. అర్హులైన వారిని విధుల్లోకి తీసుకుంటామని చెప్పడంతో.. ఇరువురి వాదనలు విని సుప్రీం కోర్టు ఈ పిటిషన్లపై విచారణను ముగించింది. వీరందరిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నియామకాల ప్రక్రియ కాబట్టి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఈ ఉత్తర్వులను అమలు చేయాలని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం వీరిని విధుల్లోకి తీసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒప్పంద ప్రాతిపదికన వీరందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు.

## 'కల్తీ' నెయ్యిలో బోలేబాబా డెయిరీ కీలకం

>> నవంబర్‌లోనే తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేశారనే ఆధారాల్లో అవస రమైన రసాయనాలు సరఫరాచేసి కల్తీచేసిన కీలకనిందితుడు ఢిల్లీకి చెందిన అజయ్‌కుమార్ సుగంధ్‌న సిబిఐ సిట్ అధికారులు కటకటాల్లోకి పంపారు.నాలుగేళ్ళు ఢిల్లీనుండి ఉత్తరాఖండ్‌కు బోలేబాబా డెయిరీకి మోనోగ్రీజారాయిడ్స్, అసి టిక్ యాసిడ్ వంటి రసాయనాలను డ్రమ్ముల్లో పంపాడనేది ఆధారాలు రాబట్టింది. 90శాతం కల్తీనెయ్యిలో పలు రకాల రసాయనాలు కలిపా డనేది సంచలనం.ఇప్పటికే ఈ కేసులో ప్రధాన సూత్రధారిలో మాజీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను సిట్ కటాకటాల్లోకి పంపింది. 2020 నుండి 2024వరకు గతంలో వైసిపి ప్రభుత్వంలోని గత టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ నిబంధనలు ఉల్లంఘించిందనేది సిట్ వెల్లడించిన సంచలన నివేదికలు. ఇప్పటికే కల్తీనెయ్యి ఉదంతంలో 36మందిని నిందితులుగా చేర్చి ఎఫ్ఐఆర్ చేశారు. వారిలో 12మంది టిటిడి అధికారులు,ఉద్యోగులు నిందితులుగా ఉన్నట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సంచలనం కలిగించింది. మార్కెటింగ్ విభాగంలో కొనుగోళ్ళ జిఎం సుబ్రమణ్యంను తొలిఅరెస్ట్ చేసిన విషయం విదితమే. ఇంకా మాజీ జిఎంలు, సీనియర్ ,జూనియర్ అసిస్టెంట్‌లు కల్తీ నెయ్యి వ్యవహారంలో కర్త,కర్మ,క్రియగా ఉన్నారనేది తేల్చారు. ఇంకా నిందితులుగా ఇఇ, మాజీ జిఎం పేరూరు జగదీశ్వర్‌రెడ్డి, పి.వెంకటరామసుబ్రమణ్యం, పి.మురళీకృష్ణ తోబాటు ఇలా వరుసగా టిటిడి ఎస్వీగోశాల మాజీ డైరెక్టర్ డాక్టర్ హరినాథరెడ్డి, డెయిరీ టెక్నాలజీ నిపుణులు డాక్టర్ ఎం.మహేందర్, డాక్టర్ వి.వెంకటసుబ్రమణియన్, ఎం.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బత్తులసురేంద్రనాథ్, డాక్టర్ కె.జయరాజారావులు నిందితులుగా సిట్ పేర్కొంది. ఈ కీలక నివేదికలు వెల్లడైనా రాజకీయంగా దుమారం రేగలేదు. ఇప్పుడు కల్తీనెయ్యిలో సూత్రధారుల చెంతకు సిట్ రానుందనే సమాచారంతో రాజకీయ వేడిపుట్టిస్తోంది. ఇప్పటికే నిబంధనలు మార్చడంలో కీలమని 2019లోనూ ,ప్రస్తుతం టిటిడి ఇఒగా కొనసాగుతున్న అనిల్‌కుమార్‌సింఘాల్, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డి, టిటిడిలో ఆర్థికంగా కీలకమైన ఎఫ్ఎసిఎఒ బాలాజీ తీరును సిబిఐ తప్పుపట్టి వీరిపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన సింఘాల్ 2019లోనే అప్పటి బోర్డు నిర్ణయాలను, పనితీరును సమీక్షించుకుని అధికారులకు కీలక ఆదేశాలివ్వడంలో విఫలమయ్యారనేది ఇప్పుడు సంచలనం. నిబంధనలు మార్చడంలో అసలు విషయాలను దాచిపెట్టారనేది ఇప్పుడు ముగ్గురు కీలక అధికారులవైపు సిబిఐ దృష్టి పెట్టింది. తదనంతరం ఎలాంటి పరిణామాలు జరగనున్నాయనేది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠగా మారింది.

## రమేష్ దారుణ హత్య

>> ట్రాఫిక్ స్తంభించిపోయింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు భారీగా చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ లేదా జిల్లా ఎస్పీ స్వయంగా అక్కడికి వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అయితే కలెక్టర్, జిల్లా ఎస్పీ ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో నిరసనకారులు మూడు గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. అదే సమయంలో పత్తికొండ పోలీసులపై వివిధ ఆరోపణలతో నినాదాలు చేస్తూ, పోలీసులు దళితుల పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దళితులపై రోజు రోజుకీ దాడులు పెరుగుతున్నాయని దళిత సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా రమేష్ కీలక పాత్ర పోషించారని పేర్కొంటూ, ఈ ఘాటుకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలంటూ ఎంఆర్‌పీఎస్ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయం ముందుకు దూసుకెళ్లి ఆందోళనను కొనసాగించారు.

## సుపరిపాలనే లక్ష్యం

>> ప్రతినెలా 1 వతేది అంటే తనకు కష్టాల్లో ఉన్న పేదలు గుర్తుకువస్తారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. వారికి ప్రతినెలా1న లేదా అంతకంటేముందే పెన్షన్లు పంపిణీకి పేదల సేవలో కార్యక్రమం పెట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేనిరీతిలో ఏపిలోనే పెన్షన్లను అందించడం ఓ రికార్డ్ అని సిఎం పేర్కొన్నారు. 13శాతం జనాభాకు పెన్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. 18నెలలకాల లో 58654కోట్లు పెన్షన్లకు ఖర్చుచేశామన్నారు. నెలకు 2730కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అదే ప్రతినెలా కర్ణాటకలో 392కోట్లు, తమిళనాడులో 315కోట్లు మాత్రం పంపిణీ చేస్తున్నారన్నారు. పెన్షన పంపిణీ పేదల పట్ల ఎన్డీయే కూటమికి ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఆదాయం పెరగాలని అది పేదలకు అందాలనేది తమ ఆశయమన్నారు.దేశంలోనేఅన్ని రంగాల్లో రాష్ట్రం అగ్రస్థా నంలో ఉండాలనేది తన అకాంక్ష అని సిఎం పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఎడారిగాఉండేదని ఆ ప్రాంతానికి కృష్ణాజలాలు ఇవ్వడంతో ప్రస్తుతం ఉద్యానవన పంటల కేంద్రంగా మారిందన్నారు. సీమ జిల్లాల్లోని హంద్రీ-నీవా, గాలేరు-నగరి, సోమశిల ప్రాజెక్టులను పూర్తి చేసి అన్ని జలాశయాలు నింపుతామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఇరవై లక్షల ఎకరాలకు తోడు మరో 20లక్షల ఎకరాలకు నీళ్లను అందిస్తామని సిఎం ప్రకటించారు. అనంతరం పలువురు పారిశ్రామికవేత్తలతో ఎంఒయులు కుదుర్చుకున్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్త లతో సమావేశమయ్యారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్‌డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, జిల్లాటిడిపిఅధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఒక రోజు ముందే పింఛన్ల పంపిణి

### తొలిరోజే సుమారు 90% మందికి అందజేత

**విజయవాడ,జనవరి 31,ప్రభాతవార్త ప్రతినిధి:** లబ్దిదారుల ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తున్న గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది గుడిపల్లి మండలం బెగ్గిలపల్లె లో జరిగిన పెన్షన్లు పంపిణీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ వేగవంతంగా జరుగుతోంది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయా లని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ ఈ రోజు ఉదయం నుంచి లబ్దిదారుల ఇళ్ల వద్దనే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పంపిణి చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కుప్పం నియోజకవర్గ పరిధిలోని గుడిపల్లి మండలం బెగ్గిలపల్లె లో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్దిదారులకు నేరుగా పెన్షన్లు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 62,94,844 పింఛన్ లబ్దిదారులకు పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉంది.శనివారం ఉదయం 10.30 గంటల సమయానికి 38,18,798 (60.67శాతం) మందికి పంపిణీ జరిగింది. సాయంత్రానికి అందిన సమాచారాన్ని అనుసరించి 88 శాతానికి పైగా పెన్షన్లు పంపిణీ జరిగింది.

## అమరావతిలో 70. 011 ఎకరాల్లో బీఐటీఎస్ ఏర్పాటు

**విజయవాడ,జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(బీఐటీఎస్) అందుబాటులోకి రానున్నది.క బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస(బీఐటీఎస్) అమరావతిలో 70.011 ఎకరాల్లో ప్రాంగణాన్ని ఏర్పాటు చేయబోతోంది. బిట్స్ సంస్థ ప్రతినిధులు ఈ విషయాన్ని మీడియాకు వివరించారుబిట్స్‌కు తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించింది. ఈ మేరకు ఏపీసీఆర్డీఏతో బిట్స్ ప్రతినిధులు భూ విక్రయ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.మందడం సబ్ రిజిస్ట్రార్ సి.హెచ్. రాంబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ ఎస్టేట్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ వీ.డేవిడ్ రాజు, బిట్స్ పిలానీ ప్రతినిధిగా డిప్యూటీ రిజిస్ట్రార్ వీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు మీడియాకు వివరించారు.బిట్స్ అమరావతి క్యాంప్‌సను మూడు దశల్లో అభివృద్ధి చేస్తాం. మొదటి దశలోనే సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడితో క్యాంపస్ పనులు ప్రారంభిస్తున్నాం. ఆధునిక మౌలిక వసతులతో కూడిన స్మార్ట్ భవనాలు, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, ఆధునిక బోధన పద్ధతులు, పర్యావరణహిత నిర్మాణాలతో ఈ క్యాంప్‌సను కొత్తతరం విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 2027 నుంచి అమరావతి క్యాంప్‌సలో విద్యార్థులకు ప్రవేశాలు లభించేలా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తాం. దశలవారీగా 10,000 మంది విద్యార్థులు అమరావతి బిట్స్‌లో విద్యను అభ్యసించేలా ప్రణాళికాయుతంగా కార్యకలాపాలు నిర్వహిస్తాం. ఈ క్యాంపస్ ద్వారా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని వారు తెలిపారు.ఇక బిట్స్ అమరావతి క్యాంపస్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సాంకేతికతతో తీర్చిదిద్దనున్నారు. ఈ క్యాంపస్ నిర్మాణాన్ని మొత్తం మూడు దశల్లో పూర్తి చేయనున్నారు. ఒక్కో దశలో అధునాతన మౌలిక వసతులను జోడిస్తూ క్యాంపస్‌ను విస్తరిస్తారు. కృత్రిమ మేధ సాయంతో పనిచేసే స్మార్ట్ భవనాలు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో, పర్యావరణానికి హాని కలగకుండా నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ప్రపంచ స్థాయి బోధనా పద్ధతులను అందిస్తూ స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అమరావతి క్యాంపస్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. దశలవారీగా 10,000 మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం, బిట్స్ పిలానీ సంస్థ లక్ష్యం ప్రకారం.. 2027 నాటికి నిర్మాణ పనుల మొదటి దశను పూర్తి చేసి, 2027 విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. బిట్స్ పిలానీ వంటి దిగ్గజ సంస్థ రాకతో అమరావతి ప్రాంతంలో గణనీయమైన మార్పులు రానున్నాయి. నిర్మాణ రంగం నుంచి విద్యా రంగం వరకు వేలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.



అంబటి కార్యాలయానికి నిప్పు పెట్టిన దృశ్యం

## గుంటూరులో హైటెన్షన్: అంబటి అరెస్టు

>> మీడియా వ్యాఖ్యానిస్తూ ఇంత పెద్ద వయస్సులో తాను అలా మాట్లాడటం తప్పేనని, ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత అంబటిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో తనపై వ్యక్తమవుతున్న విమర్శలపై తాజాగా అంబటి స్పందించారు. తాను అలా మాట్లాడకుండా ఉండాల్సిందని అంబటి వ్యాఖ్యానించారు నేను చంద్రబాబును బూతులు తిట్టలేదు. చంద్రబాబును తిట్టాల్సిన అవసరం లేదు. రాజకీయ విమర్శ చేస్తాను. కార్యకర్తలను మాత్రం తిట్టకుండా ఉండాల్సింది. నన్ను చంపే ప్రయత్నం చేశారు. కర్రలు పట్టుకొని తిరిగిన వాళ్లను, నన్ను తిట్టే వాళ్ళని పోలీసులు ఆపగలిగారా. అరెస్టు చేస్తామని బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదు. అరెస్టుకు సిద్ధంగా ఉన్నాను. వాళ్ళు నన్ను తిట్టారు. నేను వాళ్లను తిట్టానుఖ అని అంబటి పేర్కొన్నారు. బూతులు మాట్లాడానన్న మనో వేదన నాలో ఉంది. అరెస్టుకు భయపడి నేను ఇలా మాట్లాడటం లేదు. ముందస్తు బెయిల్ కూడా తీసుకోను. చంద్రబాబు సంగతి తేలుస్తాను. లాయర్ గా ఉన్నాను. నాకు చట్టం తెలుసు నాకు. చంద్రబాబు, లోకేష్ అరెస్టు చేయమన్నారు.. పోలీసులు చేస్తున్నారుఖ అని అంబటి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తండ్రిపై మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు చేసిన అసభ్య వ్యాఖ్యలపై తెలుగుదేశం ఆగ్రహించింది. అంబటి రాంబాబు బేషరతుగా చంద్రబాబుకు క్షమాపణలు చెప్పాలంటూ అతని ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు ధర్నాకు దిగారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గుంటూరులో ఉన్న నవభారతనగర్‌లోని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తండ్రిపై అంబటి అసభ్య వ్యాఖ్యలు చేశారు. మురికి వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు, ప్రజలు ఆగ్రహించారు. అంబటి రాంబాబు ఇంటిని ముట్టడించారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. టీడీపీ శ్రేణులు ఇంటిపై రాళ్లు రువ్వారు. ఇంట్లోని కిటికీ అద్దాలు, పూలకుండీలు ధ్వంసం చేశారు. ఇంటివద్ద ఉన్న అంబటి వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఆందోళన దిగారు. చంద్రబాబుపై అసభ్య వ్యాఖ్యలు చేసిన చేతులు జోడించి క్షమాపణలు చెప్పాలని మాధవి డిమాండ్ చేశారు.

సీఎం చంద్రబాబుపై అసభ్య వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే టీడీపీ నేతల ఫిర్యాదుతో నల్లపాడు పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా అంబటి రాంబాబుపై పల్నాడు జిల్లా నకరికల్లు పీఎస్‌లో కేసు నమోదైంది. అంబటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి కోరారు.

ఈ నేపథ్యంలో నవభారతనగర్‌లోని అంబటి ఇంటి వద్ద ఇంటివద్ద పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబును వెంటనే అరెస్టు చేయాలని, ఆయన్ను తమకు అప్పగించాలని లేదా చంద్రబాబుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని టీడీపీ శ్రేణులు, ప్రజలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రాష్ట్ర మంత్రులు.. అంబటి వ్యాఖ్యలు సభ్య సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోంమంత్రి వంగలపూడిఅనిత ,బిసి సంక్షేమ శాఖా మంత్రి సవిత,మంత్రులు పి,నారాయణ,కందుల దుర్గేష్, వాసంసెట్టి సుభాష్‌లు మాట్లాడుతూ అంబటి రాంబాబు వ్యాఖ్యలు అత్యంత నీచమైనవని అన్నారు. సీఎం చంద్రబాబు లాంటి నిబద్ధత కలిగిన నాయకుడిపై ఇష్టానుసారంగా మాట్లాడటం సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలు.. రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, ఇది డైవర్షన్ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెడుతుంటే. వైసీపీ నేతలు అనవసర వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని తెలిపారు. పోలీసులపై కూడా అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ప్రజల భద్రతతో ఎలాంటి రాజీ ఉండదని తేల్చి చెప్పారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వాటిని దాటి మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టమైన సంకేతం ఇచ్చారు.

## క్లీన్ చిట్ రాలేదు

>> పోయి, తప్పే జరగనట్లు ప్రజలను మోసం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేస్తారా అంటూ ఫైర్ అయ్యారు. జరుగుతున్న విపరీత ప్రచారాలు చూసి తట్టుకోలేకే వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నామే తప్ప.. తిరుమల శ్రీవారి విషయంలో రాజకీయం చేసే ఉద్దేశం తమకు లేదని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.లడ్డూ నాణ్యత ఎప్పటికీ తగ్గకూడదనే ఉద్దేశ్యంతో నిబంధనలు అన్నింటిని ప్రక్షాళం చేయాలంటే ఓ కమిటీని ఏర్పాటు చేసి, వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా నిబంధనలను ఏర్పాటు చేశాం. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఆ నిబంధనలను అన్నింటినీ మార్చేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఇక్కడే ఈ ఆక్రమాలు అన్నింటికి పునాది పడింది. తిరుమలలో ప్రక్షాళన కొనసాగాల్సిందే. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా చాలా అంశాలు బయటకు రావాల్సి ఉంది . దేవుడి ప్రసాదానికి ముడిసరుకు పంపిణీ ఆర్థిక అంశంగా మాత్రమే గత పాలకులు చూశారన్నారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు హవాలా మార్గంలో వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉందని అన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని ఎన్.డీ.డీ.బీ నివేదిక స్పష్టం చేసిందని ఇదే అంశం సిట్ అనుబంధ ఛార్జ్‌షీట్ 35వ పేజీలోనూ ఉందని మంత్రి కేశవ్ చెప్పారు. వైఎస్సార్సీపీ చెప్తున్నట్లుగా క్లీన్ చిట్ ఎక్కడ వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. చేసిన తప్పునకు క్షమాపణలు కోరాల్సింది పోయి తప్పే జరగనట్లు ప్రజల్ని మోసాగించాలనుకోవటం దుర్మార్గమన్నారు.

## మధ్య తరగతిపై పన్నీటి జల్లు!

>> మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26, వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4 కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆదాయపు పన్ను వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిని రూ. 13 లక్షలకు పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75,000గా ఉంది. దీనిని మరో రూ.25000 పెంచి రూ. 1 లక్షకు చేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో జీతం తీసుకునే ఉద్యోగులకు రూ. 13 లక్షల వరకు ఎలాంటి ట్యాక్స్ ఉండదు. ప్రస్తుతం టాక్స్ రిబేట్తో కలిపి రూ. 12.75 లక్షల వరకు పన్ను లేదు. రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ. 6,000 పెట్టుబడి సాయం అందిస్తోంది కేంద్రం. దీన్ని 50 శాతం పెంపుతో రూ.9,000 వరకు చేయవచ్చని అంచనా. 2019లో ప్రారంభమైన ఈ స్కీమ్ ద్వారా మూడు విడతల్లో రూ. 2,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పుడు రూ.9 వేలకు చేస్తే ప్రతి విడతలో రైతులకు రూ.3వేల చొప్పున సాయం అందనుంది. 300కి పైగా కొత్త అమృత్‌భారత్, వందే భారత్ రైళ్ల రిజర్వేషన్‌లో వెయిటింగ్ లిస్ట్ తగ్గించడం, రైల్వే ట్రాక్‌లు మెరుగుపరచడం, కొత్త రైళ్ల పెంచడం వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశాలుఉన్నాయి. 300కి పైగా కొత్త అమృత్ భారత్, వందే భారత్ రైళ్ల ప్రకటిస్తారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత బడ్జెట్‌లో రైల్వేకు రూ. 2.65 లక్షల కోట్లు కేటాయించారు. ఈసారి బడ్జెట్ మరింత పెంచవచ్చని సమాచారం. 2030 నాటికి వెయిటింగ్ లిస్ట్ లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పీఎం సూర్యా ఘర్ యోజన ద్వారా ప్రస్తుతం 2 కిలోవాట్ వరకు రూ. 30,000 చొప్పున రూ. 60,000 సబ్సిడీ ఇస్తున్నారు. దీన్ని కిలోవాట్‌కు రూ. 40,000కు పెంచాలని డిమాండ్ ఉంది. అంటే కుటుంబానికి అదనంగా మరో రూ. 20,000 వరకు సబ్సిడీ లభిస్తుంది. 2026 మార్చి నాటికి 40 లక్షల ఇళ్ళు, 2027 నాటికి 1 కోటి ఇళ్లకు సౌర విద్యుత్తు పలకను అమర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 19.45 లక్షల సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేశారు. 7.7 లక్షల ఇళ్లకు విద్యుత్ బిల్లు జీరో అయింది. ప్రస్తుతం 70 ఏళ్ల వయసు దాటిన వారికి మాత్రమే అదనంగా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స ఉంది. దీన్ని 60 ఏళ్లకు తగ్గించవచ్చని సమాచారం. సంవత్సరానికి రూ. 5 లక్షల ఉచిత చికిత్స పరిమితిని పెంచడం సహా క్యాన్సర్, హార్ట్ సర్జరీల వంటి పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలను సైతం కవర్ చేసేలా రూల్స్ మార్చవచ్చని సమాచారం. ప్రస్తుతం దేశంలో 60 ఏళ్ల దాటిన వారిలో 82 శాతం మందికి ఎలాంటి ఆరోగ్య బీమా లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆయుష్మాన్ భారత్ వయసును 60కితగ్గించే అవకాశం ఉంది. అలాగే బంగారం, వెండి ధరల పెరుగుదలపైనా ఆర్థికమంత్రి తన బడ్జెట్‌ప్రసంగంలో కీలకప్రకటనచేస్తారన్న అంచనా ఉంది. పెట్రోలు, డీజిల్‌పై సంఉకాలురూ.3 ఉంచి రూ.4వరకూ పెరుగుతాయన్న ఆందోళన ఉంది. అదే జరిగితేరవాణారంగంపై ప్రభావం పడి రవాణా వ్యయాలుపెరుగుతాయి దీనివల్లకూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య మధ్యతరగతికి పెనుభారం కాకతప్పదు. జిఎస్టీ రేట్లను కూడా కొన్ని మారుస్తారన్న ప్రచారం ఉంది. 18శాతం శ్లాబ్‌నుంచి అధికవినియోగం ఉత్పత్తులను ఐదుశాతం శ్లాబ్‌కు మార్చే అవకాశం ఉందని అంచనా. అదే జరిగితే సబ్బులు, డిటర్జెంట్లు వంటి వాటిధరలు తగ్గుతాయి. వంట నూనెలపై దిగుమతి సుంకం తగ్గించి దేశీయంగా ఉత్పత్తినిపెంచేందుకు ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చని అంచనాలున్నాయి. ఎలక్ట్రానిక్స్, లగ్జరీ కార్లు, సిగరెట్లు,మత్తు ఉత్ప్రేరకపానీయాలు వంటి వాటిపై ధరలు పెరుగుతాయన్న అంచనాలున్నాయి.కార్పొరేట్‌రంగానికి ఊతంఇచ్చే విధంగా పన్నువసూళ్లలో రాయితీలు, కొన్ని మినహాయింపులతోపాటు విదేశీపెట్టుబడులను ఆకర్షించే కొత్త విధానాలను నిర్మలమ్మ తన బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనా. ఇప్పటికే కొన్ని ప్రభుత్వసంస్థల్లో నూరుశాతం విదేశీ పెట్టుబడులు అనుమతులిచ్చిన కేంద్రం కొన్ని సంస్థల్లో ప్రభుత్వ వాటాను తగ్గించి ప్రైవేటుభాగస్వాములను పెంచేందుకు కృషిచేస్తోంది.దీనివల్ల ఖజానా మెరుగుపడటంతోపాటు ఆర్థిక లోటు కూడా తగ్గుతుందన్న అంచనాలు ఎక్కువ ఉన్నాయి. ఈకోణంనుంచి చూస్తేపెట్టుబడులకు కొత్తబడ్జెట్‌రెడ్‌కార్పెట్ వేస్తుందని స్పష్టంగా తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

01-02-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రవణ కార్తె
పౌర్ణమి రా.3.40
పుష్యమి రా.12.00
వర్జ్యం : మ.12.11-1.43
దు.సా.4.29-5.15
శుభసమయం : సా.6.00-7.00,సా.6.15-7.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఉమ్మడిగా తీసుకునే నిర్ణయాలకు మీరు బాధ్యత వహించవలసి వస్తుంది. ప్రచారంలో ఉన్న నిందలను పట్టించుకోరు.

**వృషభం:** అద్భుతాలు జరిగి సమస్యల నుండి బయట పడగలిగితే బావుండని భావిస్తారు. పోటీ పరీక్షలలో విజయం.

**మిథునం:** కుటుంబ పురోభివృద్ధిపైన దృష్టిని కేంద్రీకరిస్తారు. బంధువులతో అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి.

**కర్కాటకం:** సన్నిహితాలతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వస్త్ర లాభం.

**సింహం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయి.

**కన్య :** ముఖ్యవ్యవహారాలలో ఆచితూచి అడుగు వేయండి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది.వాహన సౌలభ్యం.

**తుల :** ఉపకరించే ఒక వర్గం అందుబాటులో లేని కారణం చేత ఈ రోజు ఇబ్బంది పడతారు.సోదరుల కలయిక.

**వృశ్చికం:** కీలక నిర్ణలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. సాహసకార్యాలు చేస్తారు.ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**ధనుస్సు:** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం చెప్పదగినది. ఆరోగ్య సమస్యల నుండి బయట పడతారు.

**మకరం:** ప్రయాణాలు, రహస్య చర్చలు చోటు చేసుకుంటాయి. వృద్ధుల బరువు బాధ్యతల పట్ల అప్రమత్తత. ధనలాభం.

**కుంభం:** సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. సంగీత, సాహిత్యాలపై దృష్టి సారిస్తారు. సన్నిహితులు కలయిక.

**మీనం :** బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. మీ పరిధులకు మించి శ్రమిస్తారు. వాహన సౌలభ్యం కలదు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దీర్ఘకాలిక సమస్యగా ఉన్న 22(ఎ) భూములపై పరిష్కారానికి త్వరలో విధాన ప్రకటన

## - రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



**విజయవాడ.జనవరి31,ప్రభాతవార్త ప్రతినిధి:** దీర్ఘకాలిక సమస్యగా ఉన్న 22(ఎ) భూములపై పూర్తిస్థాయి పరిష్కారానికి త్వరలో విధాన ప్రకటన చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఇందుకోసం ఒక విధానాన్ని రూపొందించాలని ఉన్నతాధికారులకు సూచించారు. మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్, సిసిఎల్ఎ జయలక్ష్మీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు విధానాన్ని రూపొందిస్తే ఆ తర్వాత ప్రభుత్వ స్థాయిలో చర్చించి త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ సమస్యపై మంత్రి వర్గ ఉప సంఘంలో చర్చలు జరిగాయన్నారు. జిల్లాల్లో జరుగుతున్న రెవెన్యూ క్లినిక్స్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని, వీటిని మరింత సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా ఏ నెలలో ఉత్పన్నమైన రెవెన్యూ సమస్యలను ఆ నెలలోనే పరిష్కరించేలా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని అనగాని గుర్తు చేశారు. భూముల రీ సర్వే2.0లో గతంలో జరిగిన తప్పులు ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ జరగకూడదన్నారు. రీ సర్వే కాలపరిమితిని 140 రోజులకు పెంచుతూ కొత్తఎస్ఓపిని విడుదల చేశామని, దాని ప్రకారం రైతులకు నమ్మకం కలిగేలా రీ సర్వే నిర్వహించాలన్నారు. రీ సర్వేలో రైతులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. ఒక వేళ సంబంధిత రైతులు అందుబాటులో లేకుంటే సర్వేను వాయిదా వేసి వారు వచ్చిన తర్వాతే నిర్వహించాలని మంత్రి సూచించారు. ఫిబ్రవరి 2నుంచి 9వరకు పట్టా దారు పాస్‌పుస్తకాలు పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కొత్త పట్టాదారుపాస్‌పుస్తకాలు ఇచ్చే ముందు భూమి రికార్డుల వివరాలను రైతులకు, భూయజమానులకు చూపించి వారి అనుమతి తోనూ పాస్ పుస్తకం ముద్రణకు వెళ్ళాలన్నారు. ఒక్కసారి పుస్తకం ముద్రించిన తర్వాత అందులో ఒక్క తప్పు కూడా ఉండడానికి వీల్లేదన్నారు. రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణ తీసుకురావాల్సిన అవసరాన్ని మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# నేడు త్రిశూల స్నానానికి విస్తృత ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నెల నెల ఉత్సవాల్లో మహాశివరాత్రికి ముందు వచ్చే పెద్ద ఉత్సవం త్రిశూల స్నానం. ఆదివారం జరిగే త్రిశూల స్నానానికి ఆలయాధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ఇంజనీరింగ్ శాఖకు చెందిన శ్రీనివాసులు రెడ్డి వారి సహచరులు యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాట్లు చేపట్టారు. చక్కటి పందిళ్ళు ఏర్పాటు చేసారు. ఆకట్టుకునే రీతిలో పూలసొబగులను తీర్చిదిద్దుతున్నారు.

**చక్కటి ఏర్పాట్లు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవానికి వేలాది మంది మహిళా భక్తులు వస్తారు. కాబట్టి ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని ఇఓ డి.బాపిరెడ్డి,స్థానిక శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. శివరాత్రి ఉత్సవాలకు ముందు నిర్వహించే ఉత్సవం ఏటి ఉత్సవం, సద్యోముక్తి వ్రతం. ఈ ఉత్సవం ఆదివారం కాబట్టి భారీ ఎత్తున భక్తులు హాజరు తారనే అంచనాలతో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఉత్సవంతో పట్టణ వాసులకు శివరాత్రి సంకేతాలు వెళతాయి. ఈ ఏడాది శాసనసభ్యుని సూచనలతో ధర్మకర్తల మండలి, అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న మహాశివరాత్రి కాబట్టి అధికారులు ముందు జాగ్రత్తగా చక చకా పనులు నిర్వహిస్తున్నారు. అంతా సజావుగా చక చకా పనులు సాగిపోతున్నాయి. ధర్మకర్తల మండలి అధికారుల సంయుక్త బాధ్యత కాబట్టి ఎవరి కోసం ఎదురుచూడక కార్యక్రమాలు సాగుతున్నాయి. సద్యోముక్తి వ్రతానికి అ సారి విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు 15 రోజులుగా చేస్తున్నారు. ప్రత్యేక చలమను ఏర్పాటు చేశారు.

**సద్యోముక్తి ఉత్సవం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో మహాశివరాత్రికి ముందు వచ్చే పెద్ద ఉత్సవం 'త్రిశూల స్నానం' ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లే. సాధారణంగా ఈ ఉత్సవాన్ని సువర్ణ ముఖి నదిలో నిర్వహించటం ఆనవాయితి. ఈ ఉత్సవాల్ని ఆ రోజు నదిలో సద్యోముక్తి ప్రాధాన్యతను వివరిస్తారు. త్రిశూలాన్ని పవిత్ర సువర్ణముఖి నది జలాల్లో స్నానమాచరింప జేస్తారు. ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఇందుకు ఏర్పాట్లు చేయుటకు ఇఓ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. ఉత్సవం అనంతరం గ్రామంలో పంచమూర్తుల్ని ఊరేగిస్తారు.



స్వర్ణముఖి నదిలో చలము ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూ 7.8 శాతం వృద్ధి రేటు నమోదు చేయడం ప్రశంసనీయం

## - ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు సంస్థ చైర్మన్ లంక దినకరన్



**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటైన భారత్ ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూ 7.8 వృద్ధి రేటు నమోదు చేయడాన్ని అందరూ గుర్తించాల్సిన అవసరం ఉందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ( వికసిత్ భారత్ స్వర్ణ ఆంధ్రప్రదేశ్ ) సంస్థ రాష్ట్ర చైర్మన్ లంక దినకరన్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా దినకరన్ ఒక ప్రకటన విడుదల చేసారు. అనేక అంశాలపై కీలక వ్యాఖ్యలు చేస్తూ ప్రధాని నరేంద్రమోది నేతృత్వంలో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2026- 27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 9వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. నారిశక్తి, స్వదేశీ, ఆత్మనిర్భర భారత్, సమ్మిళిత వృద్ధి ద్వారా వికసిత్ భారత్ ‘కు బాటలు వేసే విధంగా ఈ బడ్జెట్ ఉండబోతోంది” . దేశ ఆర్థిక వృద్ధి రేటు 7.8 ఉండబోతుందని ఆర్థిక నిపుణులు, అంతర్జాతీయ సంస్థలు తెలియజేయడం ఆనందకరం. వృద్ధి రేటు పై వాస్తవ దూరమైన వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అంతర్జాతీయ సంస్థల అంచనాలను దృష్టిలో పెట్టుకోవలసిన అవసరం ఉంది. డాలర్ తో పోల్చినపుడు రూపాయి విలువ పడిపోతోందని దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి, ప్రపంచంలోని ఇతర కరెన్సీల విలువలను డాలర్ తో పోల్చి గమనిస్తే వాస్తవాలు అర్థమవుతాయి. గృహ పొదుపు అప్పు నిష్పత్తి గణనీయంగా తగ్గిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నది. గతంలో పొదుపు నగదు బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉండేవి, వాటి నుండి వచ్చే ఆదాయం తక్కువగా ఉండేది. మోది సర్కార్ నేతృత్వంలో సంస్కరణలు, ఆర్థిక ప్రగతి నేపథ్యంలో బంగారం, రియల్ ఎస్టేట్, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల ద్వారా ప్రజల ఆదాయం గతంలో కంటే అధికంగా ఉంది. అప్పు జిడిపి నిష్పత్తి 80 గా చాలా ఎక్కువ ఉందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం పైన చర్చించాల్సిన అవసరం ఉంది. కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఆదాయం గణనీయంగా తగ్గినా ప్రజలకు ఉచిత వ్యాక్సినేషన్ ఇచ్చి ప్రజల అవసరాలకు మరియు వివిధ మౌలిక సదుపాయాలు కోసం నిధులు ఖర్ చేసినందున అప్పు జిడిపి నిష్పత్తి 88.5 ఉండగా, నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియంత్రణ చర్యలు వల్ల 80 కి తగ్గింది. రాబోయే 5 సంవత్సరాలలో అప్పు జిడిపి నిష్పత్తిని 60 కి తగ్గించేందుకు కేంద్రం సంస్కరణాత్మక చర్యలు చేపడుతోంది. 2014లో విదేశీ అప్పు జిడిపి నిష్పత్తి 23.7 ఉండగా, 202425 సంవత్సరంలో 18.7 నియంత్రించడం జరిగినది. దేశంలో ప్రస్తుతం 700 బిలియన్ డాలర్ విదేశీ మారక ద్రవ్యం ఉండడంవల్ల ‘బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ కూడా చక్కగా జరగుతోంది. డీడాలరైజేషన్ చేసి బంగారు నిల్వలు పెంచే చర్యలు కేంద్రం చేపడుతోంది. 2014 ముందు ప్రభుత్వం చేసిన అప్పులు కేవలం ఆహార వినియోగం మరియు ప్రభుత్వ నిర్వాణకు చేయగా, 2014 నుండి 2025 వరకు చేసిన అప్పులు ఆస్తుల కల్పన, సంక్షేమం కోసం చేయడం జరిగినది. 56 కోట్ల జనధన్ ఖాతాల నుండి రూ. 45 లక్షల కోట్లు వివిధ పథకాల ద్వారా నగదు బదిలీ జరిగి ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించాయి.

# తెలుగు భాష రాయడం, చదవడం తప్పనిసరిగా నేర్పడమే అందరి బాధ్యత

## - హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్

**విజయవాడ, జనవరి31, ప్రభాత వార్తప్రతి నిధి:** తెలుగు భాష రాయటం. చదవటం తప్పనిసరిగా నేర్పటమే అందరి బాధ్యత అని గుర్తించాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అన్నారు.అదే వేటూరికి అర్పించే నివాళి అవుతుందన్నారుజ మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో సుప్రసిద్ధ సినీ పాటల రచయిత స్వర్గీయ వేటూరి సుందర రామమూర్తి 90వ జయంతి వేడుకలు అమెరికా వేటూరి సాహిత్య అభిమాన సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వేటూరి సినీయేతర సాహిత్య సంపుటాలను వారి స్వగ్రామంలో ఆవిష్కరించే అవకాశం కలగటం తన అదృష్టం అన్నారు. ఆరుద్ర అన్నట్లు తరానికొక్క గొప్ప కవి వేటూరి అని తెలిపారు. వేటూరి పాటల్లోని భావం, అర్థం నేటి పాటల్లో లేదన్నారు. నేటి పాటల్లో మ్యూజిక్, సౌండ్ మినహా పాట అర్థం కాదన్నారు. క్లాస్, మాస్ పాటలతో అన్ని వర్గాల వారిని వేటూరి అలరించారని తెలిపారు. నేటితరం పేరెంట్స్ ఇంగ్లీష్ భాష పై మక్కువతో పిల్లలను తెలుగు భాషకు దూరం చేయటం భావ్యం కాదన్నారు. అవసరం కోసం ఆంగ్లం నేర్చుకున్నా.. మాతృ భాష తప్పనిసరిగా నేర్పాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా వేటూరి కృషితోనే సాధ్యమైందని తెలిపారు. మాతృ భాషను తిరస్కరిస్తే.. మాతృదేవీ తృణీకారం అవుతుందని వేటూరి విశ్వసించే వారని తెలిపారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం జాతీయ పురస్కారం తిప్పి పంపిన వేటూరి సుందర రామమూర్తి పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాచీన హోదా ఇచ్చిందని తెలిపారు. పీల్చే గాలి తెలుగు, తాగే నీరు తెలుగు, పలికే మాట తెలుగు, బ్రతికే బ్రతుకు తెలుగు అని గుర్తించి ప్రతి ఒక్కరూ గుర్తు ఉంచుకొని తెలుగు భాష పరిరక్షణకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. నేటి తరం పిల్లలు తెలుగులో మాట్లాడాలి, తెలుగు నేర్చుకోవాలి అని సూచించారు. మమ్మీ, డాడి అంటే గొప్ప కాదని, అమ్మ నాన్న అంటేనే గౌరవం ఉంటుందన్నారు. 1999లో పెద్ద కళ్ళేపల్లిలో సంగీత సాహిత్య వసంతోత్సవాల నిర్వహణ బాధ్యత తన భుజస్కంధాల పై వేసిన నాటి నుంచి వేటూరితో మొదలైన ప్రయాణం.. వారితో సాన్నిహిత్యం, బాంధవ్యం వారు అందించిన బాంధవ్యం తనకు ఆశీస్సులు అన్నారు.

# 323 అసిస్టెంట్ కోచ్ (రెగ్యులర్) పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

## - శాప్ చైర్మన్ రవి నాయుడు

**విజయవాడ.జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా 26 క్రీడా విభాగాలలో మొత్తం 323 అసిస్టెంట్ కోచ్ (రెగ్యులర్) పోస్టుల భర్తీకి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసినట్లు శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. ఈ నియామకాలకు రాష్ట్రంలో అర్హత కలిగిన క్రీడాకారులు కోచ్‌లు 2026 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రవి నాయుడు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను స్పోర్ట్స్ అథార్టీ వెబ్‌సైట్‌లో మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని, అర్హతలు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని అర్హత కలిగిన క్రీడాకారులు, కోచ్‌లు సద్వినియోగం చేసుకోవాలని రవి నాయుడు తెలిపారు.

# గుడివాడ బస్‌స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని శవం

**విజయవాడ.జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** గుడివాడ స్టేషన్ సెంటర్ వద్ద శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా కలవరం సృష్టించింది.. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ స్టేషన్ సమీపంలో ఉన్న డ్రైనేజీ కాలువలో సుమారు 40ఏళ్ల వయస్సు గల వ్యక్తి శవమై కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఎవ్వరైంది ఇంకా గుర్తించలేదు.

# కొండ ప్రాంత వాసులకు మేలు చేయండి

**ఎమ్మెల్యే సుజనా చౌదరి**

**విజయవాడ.జనవరి 31,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో పశ్చిమ నియోజక వర్గంలో కొండ ప్రాంత నిర్వాసితులకు ప్రత్యామ్నాయ నివాసాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి జిల్లా కలెక్టర్ ను కోరారు. గత రెండు సంవత్సరాలుగా పశ్చిమ నియోజకవర్గంలోని మల్లిఖార్జునపేట, కొత్తపేట, లంబాడీ పేట, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో కొండల పై నివసించే వారి ఇళ్లు శిధిలావస్థకు చేరాయి. వర్షాకాలంలో 38, 44, 46, 52 డివిజన్ లకు సంబంధించిన కొండ ప్రాంత నివాసితుల ఇళ్లు వర్షాలకు కూలిపోవడం, కొండ చరియలు పడటం వల్ల కొంత మంది నిర్వాసితులయ్యారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే కొండపై ఇళ్లు ఖాళీ చేసి వచ్చేస్తామని ఎమ్మెల్యే కు తెలిపారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఈ మేరకు కలెక్టర్ తో మాట్లాడి వారికి ప్రత్యామ్నాయ నివాసాలు ఏర్పాటు చేయాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ ఆయా డివిజన్లు చెందిన 36 మంది నిర్వాసితులను కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లారు. నిర్వాసితుల సమస్యను శ్రీధర్ కలెక్టర్ ముందుంచారు.

వారి సమస్యలను వివరించారు. రెండు వారాల్లోగా వారందరికీ ప్రభుత్వ పథకం ద్వారా ఇళ్లు కేటాయించే ఏర్పాట్లను చేస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

సుజనా చౌదరికి నిర్వాసితులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బేసి కంటేశ్వరుడు, సుజనా మిత్రులు దొడ్ల రాజా, సప్పా శ్రీనివాస్, నిర్వాసితులు పాల్గొన్నారు.

# మహిళా నాయకులను తీర్చిదిద్దడమే లక్ష్యం

## ఐసర్‌లో జాతీయ స్థాయి సింపోజియం

**శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త** సమాజంలో మహిళా నాయకులను తీర్చిదిద్దటమే లక్ష్యంగా శ్రీకాళహస్తికి సమీపంలోని ఐసర్‌లో జాతీయ స్థాయి సింపోజియంను నిర్వహించారు. శనివారం రెండు రోజుల శిబిరం ముగింపు సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తిరుపతిఐఐటి, ఢిల్లి ఐఐటి తిరుపతి మహిళా యూనివర్శిటి సహాకారంతో ఐసర్‌లో స్టెమ్ నిర్వహించారు. మహిళా నాయకులను తీర్చిదిద్దటానికే రెండు రోజుల జాతీయ సింపోజియంను నిర్వహించారు. ఈ సింపోజియంలో స్టెమ్ లో నాయకత్వ మార్గలను నావిగేట్ చేయటానికి ప్రారంభ కేరీర్ మహిళా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, నిపుణులను శక్తి వంతుల్ని చేయటానికి లక్ష్యంగానే సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సింపోజియంలో తిరుపతి పరిసరాల్లోని చుట్టుపక్కల ఉన్న వివిద సంస్థల నుంచి సుమారు 50 మందిఅధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు. ఈ సింపోజియంను ఐసర్‌కు చెందిన డాక్టర్ వసుధారాణి దేవనాథణ్ తిరుపతి ఐఐటికి చెందిన డాక్టర్ పూజా వ్యవహారే న్యూఢిల్లికి చెందిన డాక్టర్ శిల్పి శర్మ, తిరుపతి మహిళా యూనివర్శిటికి చెందిన ప్రోఫేసర్ ఎం.విద్యావతిల పర్యవేక్షణలో సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన సెషన్స్‌లో వ్యవస్థాపకత, ఆవిష్కరణ శిక్షణకు అంకితం చేయబడిందన్నారు. ఆలోచనలను ప్రభాతవంతమైన వెంచర్‌లుగా అనువదించటనికి నైపుణ్యాలతో సన్నధం చేస్తుందని వివరించారు. ఈ సెషన్స్‌కు డాక్టర్ శ్రేయమాలిక్, డాక్టర్ అంబరిష్ సక్సేనా, డాక్టర్ సుధీర్‌వరదరాజన్ నాయకత్వం వహించారు. వ్యవస్థలలో వ్యవస్థాపక మనస్తత్వం, అవకాశాల గుర్తింపు మరియు నాయకత్వాన్ని పెంపొందించటంప దృష్టి సారించాలని పిలుపు నిచ్చారు.



సింపోజియంలో పాల్గొన్న మహిళా నాయకులు

# ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం చేయండి

## - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ. జనవరి 31,ప్రభాత వార్త ప్రతి నిధి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి రెండున చేపట్టే ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కోరారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. ఎఐసిసి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా బండ్లపల్లి నుంచి ఈ యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యాత్రతో ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నరేంద్రమోడీ నియంతృత్వ విధానాలు, పేదలను కొట్టి పెద్దలకు పంచే కుటిల నీతిని వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తామన్నారు. ఏపీలోను పాలనలో అనేక దుర్మార్గాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు

**విజయవాడ.జనవరి 31.ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్.టి.ఆర్ జిల్లా ,విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీస్ అధికారులకు శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత ఇతర ఉన్నతాధికారులతో కలిసి పదవీ విరమణ చేసిన అధికారులను పోలీస్ మర్యాదలతో శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ సరిత మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం చట్టాలకు అనుగుణంగా ప్రజాసేవకు తమ సమయం, శక్తిని అంకితం చేసి విశిష్ట సేవలందించినందుకు అభినందించారు. పోలీస్ శాఖలో అందరూ ఒకే కుటుంబ సభ్యులమని, విధి నిర్వహణలో చూపిన చిత్తశుద్ధి, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలతో ఇప్పటివరకు 24 గంటలూ బిజీగా గడిపిన వారికి పదవీ విరమణ అనంతరం ఒక్కసారిగా ఖాళీ సమయం రావడం కష్టంగా అనిపిస్తుందని, అందువల్ల ఆధ్యాత్మికత వైపు మళ్లడమో లేదా ఏదైనా మంచి వ్యాపకం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి అందరూ ఆనందంగా జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులను కూడా ఆమె ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ తరఫున వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పదవీ విరమణ పొందిన వారు: భవానీపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.ఎస్. ప్రకాష్ రావు, నాల్గవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. నాగ సుబ్బారావు, కొత్తపేట పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస బాబ్జి, మహిళా హోం గార్డులు ఎం.వి.ఎన్. కుమారి, వి. చిన్ని, కె. శేషు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సునీత, ఏఆర్ఎ అదనపు డీసీపీ కె. కోటేశ్వరరావు, ఏఆర్ఎ ఏసీపీ ప్రేమ్ కుమార్, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, సురేష్ రెడ్డి, ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్య క్షుడు ఎం. సోమయ్య, అసోసియేషన్ సభ్యులు, సీపీఓ సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైఎస్సార్సీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**విజయవాడ.జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను నివాసంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కలిసారు. మద్యం అక్రమ కేసులో సుదీర్ఘ కాలం పాటు జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బెయిల్ పై విడుదలైన తరువాత జగన్ కార్యాలయానికి వెళ్ళి అయనను కలిసారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, తన కుమారులను, కుటుంబ సభ్యులను కేసులతో వేధిస్తున్న తీరును వైయస్ జగన్‌కు వివరించిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని భరోసానిచ్చిన వైయస్ జగన్. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేసున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం వైయస్ జగన్ లేదన్నారు. వైయస్ జగన్‌ను కలిసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్ రెడ్డిలు కలుసుకున్నారు.



వైఎస్ జగన్‌తో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారులు

# అనుమతులు తీసుకోని భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** అనుమతులు తీసుకోని భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం లో ప్రజలే నేరుగా సంబంధిత పోర్టల్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేయొచ్చని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తినా, సందేహాలున్నా సమీప స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీలను సంప్రదించొచ్చని సూచించారు. బీపీఎస్ పోర్టల్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు లైసెన్స్ కలిగిన టెక్నికల్ పర్సన్లు కొందరు ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నా రన్నా ఫిర్యాదుల నేపథ్యంలో ప్రకటన చేశారు.

# తిరుపతి లడ్డూ కల్తీ ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి :వైస్సార్సీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల

**విజయవాడ.జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు కలిపారంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ హయాంలో లడ్డూలో జంతు కొవ్వు వాడారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదా ల్యాబ్ నివేదికల నేపథ్యంలో ఒక నిర్దిష్ట ప్రకటన చేయాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వు లేదని ల్యాబ్ నివేదికలు స్పష్టంగా తేల్చి చెప్పాయని సజ్జల అన్నారు. ఈ అంశంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని, దీనిని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, ఇంత బాధ్యతా రహితమైన ప్రకటన చేసినందుకు ఆయనను నిలదీయాలని పేర్కొన్నారు. రెండు జాతీయ ప్రయోగశాలల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా సిట్ ఇచ్చిన రిపోర్ట్‌లో లడ్డూలో జంతు కొవ్వు లేదని తేలిందని, అయినా ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి చంద్రబాబు ప్రయత్నించారని విమర్శించారు. ఈ వ్యవహారం లో అప్పటి టీటీడీ చైర్మన్ లేదా బోర్డు సభ్యుల ప్రమేయం ఉన్నట్లు సిట్ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదని సజ్జల గుర్తుచేశారు. ఇది తమకు క్లీన్‌చిట్ లాంటిదని, ఈ ఆరోపణలు న్యాయ పరమైన పరిశీలనకు లోబడి ఉంటాయని తెలిపారు. వాస్తవాలు అంగీకరించకుండా, చంద్రబాబు, ఆయన ప్రచార యంత్రాంగం కప్పిపుచ్చుకుంటుందన్నారు.

# ఎపిఎస్ఆర్‌టిసి ఇన్‌ఛార్జిగా తిరుమల కృష్ణబాబు




**విజయ వాడ, జనవరి 31, ప్రభాత వార్త ప్రతి నిధి:** ఎపిఎస్ ఆర్‌టిసి ఇన్‌ఛార్జి ఎం.డీ మొవ్వా తిరుమల కృష్ణ బాబును నియమించారు. ఈ మేరకు జిఓఆర్‌టి నెంబరు 188ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటి వరకు ఎమ్‌డిగా పనిచేసిన ద్వారకా తిరుమలరావు ఈ నెల 31తో పదవీకాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో కృష్ణబాబును ఈ పదవిలో నియమించారు.

కృష్ణబాబు ప్రస్తుతం రోడ్డురవాణా శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గతంలో వైద్య ఆరోగ్యశాఖలోను, ఆర్టీసీలోను కీలక బాధ్యతలు నిర్వహించారు.

# ఏలూరు జిల్లా పోలవరంలో పెద్దపులి కలకలం

## పశువులపై దాడి - రెండు లేగ దూడలు మృతి

**చింతూరు(ఏలూరు) జనవరి 31 ప్రభాతవార్త** ఏలూరు జిల్లా పొలవరం, సీతానగరం, దేవిపట్నం మండలాల్లో పెద్దపులి కదలికలు గత కొన్ని రోజులుగా కలకలం సృష్టిస్తుంది. తాజాగా శనివారం పోలవరం మండలం ఇటుకలకోట గ్రామములో మడకం కనకమ్మకు చెందిన రెండు లేగ దూడలపై పులి దాడి చేసి హతమార్చింది. దాంతో విషయం అటవిశాఖ అధికారుల దృష్టికి వెళ్ళటంతో ఘటన స్థలాన్ని పోలవరం రేంజ్ అధికారి షేక్ వలీ, ఎపి ట్రైకార్ చైర్మెన్ బొరగం శ్రీనివాస్, జనసేన నాయకులు గునపర్తి చిన్న తదితరులు సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులికి ఎటువంటి హాని తలపెట్టవద్దని, అటవిశాఖ సిబ్బంది పులి కదిలికలను పర్యవేక్షిస్తున్నారని, పులికి సంబంధించిన ఎటువంటి సమాచారం అయిన తమ కార్యాలయానికి తెలియజేయాలని అటవిశాఖ అధికారులు కోరారు. అంతేగాక సీతానగరం మండలం కొండేపూడి ప్రాంతంలో పులి పాదముద్రలను అటవిశాఖ అధికారులు గుర్తించారు. దాంతో దేవిపట్నం, పొలవరం, సీతానగరం పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలం పనులకు వెళ్ళేవాళ్ళు ఒంరిగా వెళ్ళ వద్దని, ప్రజలు రాత్రి సమయాల్లో చీకటి ప్రాంతాల్లో సంచరించ వద్దని అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. పొలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నాయని సూచించారు. పులి కదలికలను పరిశీలిస్తున్నట్టు అధికారులు తెలిపారు.



పెద్దపులి దాడిలో మృతిచెందిన లేగ దూడలను పరిశీలిస్తున్న అటవిశాఖ అధికారులు

గవర్నర్, కేంద్ర-రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సమ్మక్క-సారలమ్మలను దర్శించి నిలువెత్తు బంగారం మొక్కులు సమర్పించారు. దేశం నలుమూలల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మేడారం ప్రాంగణం సందడిగా మారింది. మేడారంలో రూ. 236.2 కోట్లతో ఫ్యూచర్ మాస్టర్ ప్లాన్. గద్దెల అభివృద్ధికి రూ. 58.2 కోట్లు గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ. 6.8 కోట్లు జంపన్న వాగు అభివృద్ధి కోసం రూ.39 కోట్లు.భక్తుల అకామిడేషన్ నిమిత్తం రూ.50 కోట్లు రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5 కోట్లు మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం కేటాయించారు. వీటిలో ప్రస్తుతం ఖర్చు చేసినవి 101 కోట్లు మాత్రమే.. ప్రధాన రహదారుల విస్తరణకు ఆర్అండ్బీ శాఖకు రూ.9.95 కోట్లు. మేడారంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రధాన, అంతర్గత మార్గాల విస్తరణకు పంచాయతీరాజ్ శాఖకు రూ.51.30 కోట్లు. తాగునీటి సరఫరాలో ,డైరెక్టు పంపింగ్ ద్వారా శుద్ధ జలాలు అందజేయడానికి రూ.5 కోట్లు. జాతర పరిసరాల్లో టన్నుల కొద్దీ వ్యర్థాలు సేకరణకు వందల సంఖ్యలో యంత్రాలు, వేల సంఖ్యలో కూలీలు, పనిముట్లు, రసాయనాలు,జాతరను ఏకో ఫ్రెండ్లీ తరహాలో నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ శాఖకి రూ.11.62 కోట్లు. అగ్నిమాపక, గిరిజన సంక్షేమం, మత్స్య, సమాచార, పశు సంవర్ధక, వైద్యఆరోగ్యం, అటవీ, రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక,ఎన్పీడీసీఎల్, ఆబ్కారీ, ఆర్టీసీలకు రూ.33.01 కోట్లు. మేడారం మహా జాతరకు కేంద్రం కేటాయించిన నిధులు రూ. 3.70 కోట్లు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు. ములుగు,లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి ..80 కోట్లు. రామప్ప దేవాలయ అభివృద్ధికి ..140 కోట్లు కేటాయించారు.

# వనదేవతల చెంత భక్తజనకోటి

**జి.గంగాధర్ రెడ్డి**

మేడారం మహాజాతర ఉత్సవం ముగిసింది. అనుకున్న దాని కంటే అంచనాలను మించి భక్తులు తరలివచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచే కాకుండా పొరుగున ఉన్న నాలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జాతర ప్రధాన ఘట్టం నాలుగు రోజులు మేడారం పరిసరాలు జనాలతో నిండిపోయాయి. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించినప్పటికీ ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. కేవలం రెండు కిలోమీటర్ల ప్రయాణానికి ఆరేడు గంటల సమయం పట్టింది. వరంగల్ నుంచి మేడారానికి వాహనాలు రావడానికి ఒక సందర్భంలో 8 గంటలు పైగా పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. దీనితో భక్తులకు కొంత సౌకర్యం కలిగింది. అయితే అంచనాలకు మించి జనాలు తరలిరావడంతో అధికారులు, పోలీసులు చేతులెత్తేసిన పరిస్థితి కనిపించింది. అయితే జాతర ఆద్యాంతం పూర్తిగా గిరిజన సాంప్రదాయాల ప్రకారం కొనసాగింది. దేవతలను గద్దెమీదకు తీసుకురావడంతో పాటు నిష్క్రమించేదాకా భక్తి భావం కొనసాగింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం ఆనందంతో తిరిగి వెళ్లారు. రికార్డు స్థాయిలో భక్తులు హాజరయ్యారయ్యారని అధికారులు ప్రకటించారు. దక్షిణ భారత కుంభమేళాగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వనదేవతల నామస్మరణతో అంగరంగ వైభవంగా కొనసాగింది. వన దేవత.. మన దేవత.. జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోటి 50 లక్షలకు పైగా భక్తులు మేడారం అడవుల్లోకి వెళ్లారు. డోలు చప్పుళ్లు, కొమ్ము వాయిద్యాలు, ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, శివసత్తుల పూనకాలతో మేడారం వనం మొత్తం భక్తి పారవశ్యంలో మునిగింది. బుధవారం కన్నెపల్లి నుంచి వచ్చిన సారలమ్మ మేడారంలోని గద్దెపై కొలువుదీరడంతో జాతరకు అధికారికంగా ఉత్సాహం వచ్చింది. ఆమెతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై ప్రతిష్ఠించడంతో మేడారం జనసంద్రమైంది.కన్నెపల్లి నుంచి మేడారం వరకు నాలుగు కిలోమీటర్ల దూరం భక్తులతో నిండిపోయింది.

ఆదివాసీ పూజారులు కొమ్ముబూరలు ఊదుతూ, ప్రత్యేక డోలు వాయిద్యాలతో సారలమ్మను గద్దెలకు తీసుకువచ్చారు. మేడారం జాతరలో అత్యంత కీలక ఘట్టమైన సమ్మక్క తల్లి ఆగమనం గురువారం అర్ధరాత్రి జరిగింది. చిలుకలగుట్టనుంచి కుంకుమ భరణి రూపంలో సమ్మక్కను గిరిజన సంప్రదాయాల ప్రకారం గద్దెపైకి తీసుకొచ్చారు. ప్రభుత్వ లాంఛనాల మేరకు గాల్లోకి కాల్పులు జరిపి తల్లికి అధికారిక స్వాగతం



పలికారు. మాఘ శుద్ధ పౌర్ణమివేళ నిండు జాబిలిలా దర్శనం ఇచ్చిన సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరడంతో మేడారం మహాజాతర పరిపూర్ణత సాధించింది. రూపమే లేని వనదేవతల ఈ అపూర్వ జాతరలో వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు-కుంకుమలే వజ్రాభరణాలుగా మారాయి. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆదివాసీ సంప్రదాయాలు ఈ జాతరలో జీవంతంగా దర్శనమిస్తున్నారు. వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణం, క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దర్శనానికి కొంత సమయం పడుతున్నా భక్తులు సహనంతో తల్లుల దర్శనం చేసుకుంటున్నారు. జాతరకు పటిష్ట బందోబస్తును జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఏర్పాటు చేశారు. మొత్తం 13 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఏఐ సాంకేతికత, డ్రోన్లతో భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో అన్ని శాఖలు సమన్వయం తో ఏర్పాట్లు చేశాయి. వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమ త్తంగా సేవలందిం చారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు భక్తులకు సహాయం చేశారు. మహా జాతరలో సింగ రేణి రెస్క్యూ సేవలు ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. జాతరలో సింగ రేణి రెస్క్యూ సిబ్బంది అద్భుతమైన సేవలు అందించారు. సుమారు 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది మూడు బ్యాచులుగా విడిపోయి గద్దెల ప్రాంగణంలో భక్తులు విసిరిన కొబ్బరి చిప్పలు, బెల్లం ఉండలు తగిలిగాయాలపాలైన వారిని గద్దెల ప్రాంగణంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురైన భక్తులకు సహాయక చర్యలు అందిస్తూ వారిని ఆసుపత్రికి అంబులెన్స్ వద్దకు తరలించగలిగారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది ప్రతి మేడారం జాతరకు సేవలు అందించడం అనవాయితీగా వస్తుందని రెస్క్యూ సిబ్బంది వారు తెలిపారు. భక్తులకు వినోదం పొందేందుకు సర్కస్, జాయింట్ వీల్స్, గేమ్స్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. అమ్మవారి గద్దల నుండి జంపన్న వాగు వెళ్లే దారిలో అతి భారీ సర్కస్ విన్యాసాలు జాయింట్ వీల్స్ పిల్లల ఆటల పోటీలు నిర్వహించే తదితర స్టాల్స్ భక్తులను ప్రజలను పిల్లలను అమితంగా ఆకట్టుకున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సర్కస్ విన్యాసాలలో అమ్మవారి దర్శనం అనంతరం ఉపశమనం పొందారు. తప్పిపోయిన వారి కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. జంపన్న వాగు ప్రాంతంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిస్సింగ్ క్యాంపు ఏర్పాటుచేసి తప్పిపోయిన భక్తుల వివరాలను ఎప్పటికప్పుడు అనౌన్స్మెంట్ మైకు ద్వారా చేస్తూ 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటు సేవలు అందించారు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న (జోగిని) హిజ్రాలువనదేవతల జాతరలో హిజ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సమ్మక్క సారలమ్మల జాతర మొదలవగానే హిజ్రాలు వారి కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ సమ్మక్క తల్లిని ఆవాహన చేసుకుని కుటుంబ సభ్యులతో డప్పు చప్పుళ్ళనడుమ మట్టితో అమ్మవార్ల గద్దెలను ఏర్పాటు చేసి బంగారం (బెల్లం), మద్యం సమర్పించి కోళ్ళను, మేకలను బలి ఇస్తు అమ్మవార్లను పూజించారు. చిలకల గుట్ట నుండి సమ్మక్క రాక సందర్భంగా దారి వెంట రంగు రంగుల ముగ్గులు (పట్నాలు) వేసి అమ్మవార్లకు స్వాగతం పలుకుతారు. సమ్మక్క తల్లి గద్దెలకు చేరుకున్న తర్వాత ఒడి బియ్యం,బంగారం (బెల్లం) ,కొబ్బరి కాయలు సమర్పించారు, ఇలా మేడారం జాతరలో వన దేవతలకు పూజలు నిర్వహించడంవల్ల తాము కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు. జాతరలో నిరంతర విద్యుత్ సరఫరాలో విద్యుత్‌శాఖ ఏర్పాట్లు చేశారు.మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా తీర్చిదిద్దిన ఎన్పీడీసీఎల్ .వెలుగుల జిగేల్ మనేలా తీరిచిద్దిన మేడారంకు అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది నిత్యం 24/7 విధులు నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్లు కె. రాజు చౌహాన్, ఆశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరిండెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుండి 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచ్లో 30 మంది చొప్పున విధులు నిర్వహించారని చెప్పారు. శాశ్వత ప్రాతిపదికన జంపన వాగు ఇరువైపుల 6 టవర్లు ఏర్పాటు చేశారు. ●

---

మహారాష్ట్ర

# విలీనమా! విభేదమా?

**ఎ.వి.వి ప్రసాద్**

హఠాత్తుగా జరిగే కొన్ని సంఘటనలు కొన్ని అనూహ్య పరిణామాలకు దారితీస్తుంటాయి. మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగాఉన్న ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ గత బుధవారం విమాన ప్రమాదంలో హఠాత్తుగా మరణించడంతో తర్వాత పార్టీలోను, మహాయుతి కూటమిలోను అనేక పరిణామాలు తొంగిచూశాయి. ఎన్నెన్నో ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. పినతండ్రి, మరాఠా 'స్ట్రాంగ్ మాన్' శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయ జీవితం ఆరంభించినా, తర్వాత సొంత మార్గంలో ఎదిగి, ఎన్సీపీలో సైతం చీలిక తెచ్చి, తన వర్గమే అసలు పార్టీ అనే గుర్తింపు కూడా పొందిన నేతగా అజిత్ పవార్‌కు రాష్ట్రంలో అనితరసాధ్యమైన ఫాలోయింగ్ ఉందనే చెప్పాలి. వ్యూహారచనా నైపుణ్యం, రాజకీయ చాతుర్యం ఆయనలో కొంచెం ఎక్కువ పాళ్లలోనే కనిపిస్తాయి. 2023లో శరద్ పవార్‌తో విడిపోయి ఎన్సీపీలో చీలిక తెచ్చినా, పినతండ్రికి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తూనే వచ్చారు. అందుకే ఇటీవల స్థానిక ఎన్నికల్లో మళ్లీ కొన్ని స్థానాల్లో రెండు వర్గాలు ఒకే బాటలో నడిచే వ్యూహం రూపొందించి అద్భుత ఫలితాలు సాధించాయి. 1991 నుంచి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఆరుసార్లు డిప్యూటీ సీఎం బాధ్యతలు నిర్వహించిన అజిత్ పవార్‌కు సిఎం కావాలన్నదొక్కటే లక్ష్యం. అందుకు తగినట్లుగానే ఆయన పావులు కదుపుతూ వచ్చినా, రెండుసార్లు సిఎం పదవి దగ్గరగా వచ్చి జారిపోవడంతో, ఈసారి ఏ రాజకీయ పరిణామాలు సంభవించినా తనదే సిఎం పీఠమనే ధీమాతో ఉన్నారు. అయితే కాలం వక్రీకరించి ఆయన కనుమరుగవడంతో రాజ్యసభ సభ్యురాలైన ఆయన సతీమణి సునేత్రను డి.సిఎం పదవి వరించింది. కానీ అనేక రాజకీయ పరిణామాలు అక్కడే తెరలేస్తున్నాయి. అజిత్ హఠాన్మరణంతో ఎన్సీపీ రెండు వర్గాలు విలీనమవుతాయనే ఊహాగానాలు తొలుత మొదలయ్యాయి. అందుకు బలమైన కారణమే ఉంది. సంక్రాంతి రోజున జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్సీపీ రెండు వర్గాలు రెండు మూడు చోట్ల కలిసి పోటీ చేయడంతో, తర్వాత కాలంలో అవి పూర్తిగా విలీనం కావొచ్చనే అభిప్రాయం వినిపించింది. అజిత్ హఠాన్మరణానంతరం కూడా శరద్ నాయకత్వంలోని ఎన్సీపీతో అజిత్ వర్గం విలీనం తథ్యమనేమాటే వినిపించింది కానీ వెంట వెంటనే జరిగిన కొన్ని పరిణామాలు సునేత్ర డిసిఎం పదవి అంగీకరించడానికి దారితీశాయి. దీనితో రెండు వర్గాల విలీనం ఇప్పట్లో సాధ్యంకాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మహాయుతి ప్రభుత్వంలో అజిత్ ఎన్సీపీకి 41మంది ఎమ్మెల్యేలున్నారు.అయితే వారికి ఉన్న ఓట్ల శాతం 9.1 మాత్రమే.శరద్ ఎన్సీపీకి 10సీట్లు మాత్రమేఉన్నా, ఓట్ల శాతం 11.28ఉంది. అంటే విలీనం జరిగితే ఓట్లశాతం 20 దాటుతుంది. బిజెపి (26.7 శాతం) తర్వాత రాష్ట్రంలో అతి పెద్దపార్టీగా సమైక్య ఎన్సీపీ ఆవిర్భవిస్తుంది. అలా జరిగితే శరద్ పవార్‌కు రాష్ట్రంలోనేగాక జాతీయ స్థాయిలో మళ్లీచక్రం తిప్పే అవకాశం లభిస్తుంది. వార్ధక్యం కారణంగా రాజకీయాల్లో శరద్ మునుపటిలా క్రియాశీలక పాత్రపోషించలేక పోయినా, ఆయన వ్యూహ రచన బలమైన శక్తిగా పరిణమిస్తుంది. ఆ ప్రమాదం పసిగట్టిన బిజెపి అజిత్ సంతాప దినాలు కూడా పూర్తికాకుండానేపావులు కదిపి సునేత్రను డిప్యూటీ సీఎం పదవికి ఒప్పించగలిగింది.ఈవిషయంలో సిఎం ఫడ్నవీస్‌చొరవ తీసుకుని సునేత్రతో చర్చించి ఒప్పించినట్లు చెబుతున్నారు.అజిత్ పెద్ద కుమారుడైన పార్థ్ పవార్ శరద్‌తో సన్నిహితంగా ఉండడమేగాక విలీనం పట్ల మొగ్గు చూపారనీ,అది నచ్చని ఫడ్నవీస్ పార్థ్‌తో కూడా ఏకాంతంగా చర్చలు జరిపి రాజ్యసభకు పంపు తానని హామీఇచ్చారనీ తెలుస్తోంది. ఇటీవల అజిత్ మళ్లీ శరద్‌వైపు మొగ్గు చూపడంతో పార్థ్ కూడా అటే అడుగులు వేశారు. ఇప్పుడు అజిత్ లేకపో వడంతో ఆ వర్గాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవడానికి ఫడ్నవీస్ తక్షణమే పావులు కదిపిడిప్యూటీ సీఎం, రాజ్యసభ సీటు తాయిలాలు అందించినట్లు చెబుతున్నారు. సునేత్రతో ఫడ్నవీస్ జరిపిన ఆంతరంగిక చర్చలు శరద్‌కు తెలియవనీ, బిజెపి నేతలు ఆయనతో ఎలాంటి సంప్రదింపులుజరపలేదనీ తెలుస్తోంది. రెండువర్గాల విలీనం జరిగితే తాను కీలక పాత్ర పోషించాలని సుప్రియాసూలె భావించినట్లుగా చెబుతున్నారు. అజిత్ వర్గంలో ఆయన తర్వాత ప్రఫుల్ పటేల్,సునీల్ తత్కరే, భుజబల్,ధనుంజయ్ ముండే కీలకపాత్రలు పోషిస్తున్నారు. వీరిలో భుజబల్ ఫడ్నవీస్ తో కూడా సన్నిహితంగా ఉంటారనీ,సునేత్రను డి.సిఎంపదవికి ఒప్పించడంలో ఆయన ముఖ్య పాత్రవహించారనీ అంటున్నారు.ఫడ్నవిస్ కేబినెట్‌లో అజిత్‌గాక మరో ఎనిమిది మంది ఎన్సీపీ మంత్రులు ఉన్నారు. వారందరు కూడా సునేత్రకు మద్దతు ప్రకటించినట్లు సమాచారం. అయితే మహాయుతి కూటమిలోని షిండే శివసేనలో కొందరు అజిత్ వర్గానికి లభిస్తున్న ప్రాధాన్యతను వ్యతిరేకిస్తున్నారు. కీలకమైన శాఖలు కూడా అజిత్ మంత్రుల వద్దే ఉన్నాయనీ, వాటిలో కొన్ని తాము కోరినా ఫడ్నవీస్ తిరస్కరించారనీ వారుఆరోపిస్తున్నారు. షిండే శివసేనకు 12.3 శాతం ఓట్లతో 57 సీట్ల బలం ఉంది. ఆ పార్టీ కూడా మహాయుతిలో కీలకమే. కానీ ఫడ్నవీస్ వైఖరితో షిండే గ్రూపు ఇటీవల పక్క చూపులు చూస్తోంది.ఆ విషయం తెలియడంవల్లే అజిత్ వర్గానికి తిరిగి అదేప్రాధాన్యం కొనసాగించాలని ఫడ్నవీస్ నిర్ణయించారనీ, అందుకే సునేత్రకు తక్షణమే డి.సిఎం పదవి ఇచ్చారనీ అంటున్నారు. బిజెపి వ్యూహం పటిష్ఠంగానే ఉన్నా, దీనివల్ల ముందు ముందు కొత్త సమీకరణాలు మొదలు కావచ్చనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఈ పరిస్థితిలో శరద్‌పవార్ ఎటువంటి వ్యూహం అనుసరిస్తారోచూడాలి.ఎన్నికల రాజకీయాల్లోకి సునేత్ర ప్రవేశం2024లోనే. ఎన్సీపీ రెండువర్గాల విలీనానికి ఆమె ప్రయత్నిస్తారో, లేక అజిత్ వర్గాన్ని మరింత పటిష్టం చేయడంపైనే దృష్టి కేంద్రీకరిస్తారో చూడాలి. ●



సునేత్ర పవార్

---

బ్రిటన్

# జిన్‌పింగ్‌తో దోస్తీకి అగ్రదేశాల తహతహ!

**గన్ని మోహన్**

ప్రపంచదేశాలతో ట్రంప్ అనుసరిస్తున్న ధోరణి మిత్రదేశాలకు సైతం చిరాకు రప్పిస్తోంది. మిత్రులు, శత్రువులు అని చూడకుండా అందరిపైనా సుంకాలు అంటూ భారీ ఎత్తున విరుచుకుపడటం, వలసల కట్టడి పేరిట విదేశీపౌరులను అక్రమ నిర్బంధాలకు గురిచేయడం వారిని ఖైదీల తరహాలో చూడటం వంటి సంఘటనలు బ్రిటన్, ఫ్రాన్స్ వంటి అగ్రరాజ్యాలకుసైతం రుచించడంలేదు. అలాగే వెనిజులాపై సైనిక చర్యతోపాటు ఇరాన్‌పై యుద్ధానికి కాలుదువ్వుతున్న ట్రంప్ వైఖరికి చెక్‌పెట్టేందుకు ప్రపంచదేశాలు సిద్ధం అవుతున్నాయి. ప్రత్యేకించి నాటో మిత్రదేశాలపై విధిస్తున్న సుంకాలు ససేమిరా వాటికి మింగుడు పడటం లేదు. ఈక్రమంలోనే ఈదేశాలన్నీ చైనాకు చేరువవుతున్నాయి. గ్రీన్‌ల్యాండ్స్ విషయంలో ముందు నుంచి ట్రంప్‌తో విభేదిస్తున్న బ్రిటన్ చైనాకు దగ్గరవుతున్నట్లుకనిపిస్తోంది. బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రీమియర్ లీఖ్వియాంగ్‌లతో భేటీకావడం, చైనా బిజినెస్ ఫోరమ్‌తో సదస్సులో పాల్గొనడంవంటి సంఘటనలు ఇందుకు మద్దతిస్తున్నాయి.ఇప్పటికే ఫ్రాన్స్,కెనడా,ఫిన్‌ల్యాండ్ వంటి దేశాలు చైనాలో పర్యటించి పలు ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. తాజాగా బ్రిటన్ కూడాచైనాతో చేతులు కలపడం అమెరికాకు సుతరాము నచ్చడంలేదు. ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పుకుంటూ వస్తున్న అమెరికా మాత్రం తనవైఖరి మార్చుకోవడం లేదు.గడచిన ఎనిమిదేళ్లలో ఒక బ్రిటన్ ప్రధాన మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. అమెరికాను కాదని ప్రపంచదేశాల్లో నెగ్గు కు వస్తున్న చైనా ఇపుడు అమెరికా శత్రు దేశాలన్నింటినీ ఏకంచేస్తోంది. ఇందులో భాగంగానే బ్రిక్స్ సదస్సుల్లో కానీ, షాంఘై సహకార సంస్థ సమావేశాల్లోకానీ అమెరికాను విభేదించే దేశాలను కలుపుకుంటూవస్తోంది. ప్రపంచ వేదికపై చైనా కీలకభూమిక పోషి స్తోంతదని, విభేదాలు ఉన్నప్పటికీ సమస్యలు చర్చించడం అత్యంతముఖ్యమనే భావిస్తున్నట్లు కీర్‌స్టార్మర్ పేర్కొనడం చైనాతో సత్సంబంధాలనే కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.ఓపక్కఉక్రెయిన్ పైయుద్ధంలో చైనా రష్యాకు మద్దతిస్తున్న సంగతి తెలిసిందే.మరోపక్కయూరోపియన్ దేశాలు బ్రిటన్ సహా అన్నీకూడా ఉక్రెయిన్‌కు బాసటగా నిలిచాయి. ఈ తరుణంలో ఒక పాశ్చాత్య దేశం అధినేత చైనాలోపర్యటించి ద్వైపాక్షిక భేటీ జరపడం ప్రపంచ దేశాలనుఆలో చింపచేస్తోంది. కెనడాను తీసిపారేసినట్లు చూస్తూ అమెరికాలో ఒక రాష్ట్రంగా పరిగణిస్తామని దావోస్ సదస్సులో ట్రంప్ వెల్లడించడాన్ని కెనడా తీవ్రం గావ్యతిరేకించింది. అలాగే గ్రీన్‌ల్యాండ్ ఎప్పటికైనా మాదేనని స్వాధీనం తప్పదని చెప్పిన ట్రంప్ నిర్ణయాన్ని యూరోప్ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి.ఎట్టి పరిస్థితుల్లోను జరగనీయమని తెగేసి చెప్పాయి. బ్రిటన్ కూడా చైనాతో సత్సంబంధాలకు ఉవ్విళ్లూరుతోంది. సుమారు పదికిపైగా ఒప్పందాలు చేసుకుంది. వ్యవస్థీకృత నేరాల కట్టడి, అక్రమ వలసలపై సహకారం, ద్వైపాక్షిక సేవల భాగస్వామ్యం,యుకె నుంచి చైనాకు ఎగుమతులు,ఆరోగ్య సహకారం, జంతువులుమొక్కల మార్పిడి, అక్రమ నిర్బంధాలు వంటి వాటితోపాటు 30రోజులపాటు పర్యటించే విధంగా ఉచిత వీసాపర్యటనలు వంటి ఒప్పందాలు చేసుకున్న స్టార్మర్ సుమారు 50 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు జరిగాయని అంచనా. అంతేకాకుండా స్టార్మర్ చైనా ఆర్థిక హబ్‌గా భావించే షాంఘై నగరంలోనూ పర్యటించి అటుగా ఆసియా పర్యటనలో భాగంగా జపాన్ లో కూడా కొద్దిసమయం గడిపి ఆదేశ ప్రధాని సానైయి తకాయిచితో చర్చలు జరిపారు. చైనాయే కాకుండా బ్రిటన్‌తో పాటు మొత్తం 50 దేశాలు ఇలా30రోజుల ఉచిత పర్యటనలకు అనుమతిస్తున్నాయి. వీటిలో ఫ్రాన్స్,జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ వంటివి కూడా ఉన్నాయి. ఈ దేశాలు కూడా చైనాతో ఈఒప్పందాలు చేసుకున్నాయి. భేటీలో చైనా కూడా బ్రిటన్ విస్కీపై సుంకాలను ఐదు శాతానికి తగ్గించేందుకు ముందుకువచ్చింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి ఉద్రిక్తపరిస్థితుల్లో రెండు దేశాల మధ్య సామరస్య పూర్వక చర్చలు జరగడంమంచి పరిణామంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా పేర్కొనడం బ్రిటన్‌తో చైనా కూడా జట్టుకట్టేందుకు ఉత్సాహపడుతోందని స్పష్టం అవుతోంది.యూరోప్ నుంచి విడిపోయినతర్వాత బ్రిటన్ ఆర్థికవృద్ధికి చైనా వంటి దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు ఎంతో ఉపకరిస్తాయని బ్రిటన్ భావిస్తోంది.అంతే కాకుండా అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు,ట్రంప్‌లో పెరుగుతున్న దురాక్రమణ కాంక్షలకు చెక్‌పెట్టేందుకు చైనావంటి దేశాలతో దోస్తీ ఎంతో కలిసి వస్తుందని బ్రిటన్ ప్రధాని భావిస్తున్నారు. అందుకోసమే ద్వైపాక్షిక చర్చల పేరిట చైనాలో ఏకంగా నాలుగురోజులు పర్యటించి అమెరికాలో గుబులును మరింత పెంచారు. పనిలోపనిగా చైనాలో పెట్టుబడులను తమ దేశానికి ఆకర్షించడంతోపాటు బ్రిటన్‌ఫార్మా సంస్థలు కూడా చైనాలో పెట్టుబడులకు ముందుకు వచ్చేవిధంగా కీర్‌స్టార్మర్ కృషి చేసారు. ఇందులో భాగంగానే బ్రిటన్ అతిపెద్ద ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా 15 బిలియన్ డాలర్ల మేర చైనాలో పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. ఔషధ తయారీ, పరిశోధన అభివృద్ధిరంగాల్లోనే 2030 వరకూ పెట్టుబడులు కొనసాగిస్తామని బ్రిటన్ ప్రధానివెంట వెళ్లిన కంపెనీచీఫ్ పాస్కల్ సోరియట్ జిన్‌పింగ్ సమక్షంలో ప్రకటించడం వంటి పరిణామాలు చూస్తుంటే చైనా అటు యూరోప్, ఆసియా దేశాలు మరీముఖ్యంగా అమెరికాను వ్యతిరేకిస్తున్న రాజ్యాలకు అత్యంత మిత్రదేశంగా కనిపిస్తోంది. బ్రిటన్,ఫ్రాన్స్, కెనడలతోపాటు ఇప్పుడు మరికొన్ని దేశాలు కూడా చైనాలో హడావిడి పర్యటనలు ఏర్పాటుచేసుకుని ఆదేశ అధినేతలను కలిసి మైత్రీబంధం కొనసాగించేందుకు తహతహలాడుతున్నాయంటే అది కేవలం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్ష పోకడలేనని నిస్సందేహంగా చెప్పగలం. ●



కీర్ స్టార్మర్

---

# ఉమ్మడి పౌరస్మృతితో సమతా భారత్

**నేదునూరి కనకయ్య**

స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల నుండి నేటి వరకు ఉమ్మడి పౌరస్మృతి పై చర్చలు వాదనలు కొనసాగుతున్నాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్ల దేశంలోని సంస్థానాలు విలీనమై భారతదేశం ఒకదేశంగా అవతరించినప్పటికీ దేశంలో ఉన్న విభిన్న మతాల మధ్య చట్టాలు ఒకే రకంగా లేవు. ఉమ్మడి పౌరస్మృతిపై రాజకీయ పార్టీలు మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటైంది. ప్రజలందరిది రక్తం ఒకటే అంటున్న కమ్యూనిస్టులు సైతం దంద్వ విధానాన్ని అవలంబిస్తున్నారు. సమాజంలోని దురాచారాలను నిర్మూలించడంలో భాగంగా ఉమ్మడి పౌరస్మృతిని జాతీయ అవసరంగా భారత్ ప్రభుత్వం గుర్తించింది. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఆధునిక సాంకేతిక సమాచార రంగాల్లో వస్తున్న మార్పుల్లో భాగంగా ఆధునికత వైపు సమాజం పయనించడానికి అడ్డంకిగా ఉన్న చట్టాలను సంస్కరించవలసిన అవసరం ఉంది. సమాజానికి దురాచారంగా పరిణమించిన సతీసహగమనం బాల్య వివాహాల రద్దు చట్టాలను అమలు చేయడం జరిగింది.ప్రపంచ వ్యాప్తంగా సామాజికంగా గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందుకు అనుకూలంగా చట్టంలో మార్పులు సంస్కరణలను స్వాగతించాలి. ఉమ్మడి పౌరస్మృతి అంటే దేశమంతటికి పౌరులందరికీ ఒకేచట్టం అమలు చేయడం ఉమ్మడి పౌరస్మృతిలో ప్రజలను మతాలపరంగా చూడకుండా స్త్రీ పిల్లల హక్కుల గురించి ఆలోచించడం. ఏ మతాన్ని డామినేట్ చేయడం కాదు. ముస్లిం సమాజంలో స్త్రీలకు పిల్లలకు సమాన హక్కులు కల్పించవలసిన అవసరంఉంది. మతం ముసుగులో మహిళా హక్కులకు భంగం వాటిల్లుతుంది. వాటిని అరికట్టడమే ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం. ఇస్లాం, క్రిస్టియన్ జుడాయిజం దేశంలోకి వచ్చినప్పుడు వ్యతిరేకించలేదు. దేశంలో అన్ని మతాలు సహజీవనం చేసే సంస్కృతి నెలకొంది. విభిన్నమతాలకు సాంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగంలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం. భారతదేశం విభిన్నతకు విభిన్న సంస్కృతులకు నిలయం. పలు రాష్ట్రాలలో ప్రాంతాలలో వివిధ మతాలలో వివాహాలు విడాకులు పిల్లల దత్తత జీవన భృతికి సంబంధించిన చట్టాలు ఒకేవిధంగా లేవు. మతాన్ని బట్టి ఆచారాల ప్రకారం వేరువేరుగా ఉన్నాయి. దేశంలో అనేక మతాలు ఉన్నాయి.అనేక చట్టాలు ఉన్నాయి. హిందు వు వివాహ చట్టం హిందూవారసత్వ చట్టం క్రిస్టియన్ మ్యారేజ్ యాక్ట్ ఇండియన్ డైవర్స్ యాక్ట్ ఫార్సీ మ్యారేజ్ అండ్ డైవర్స్ యాక్ట్ అమల్లో ఉన్నాయి. ముస్లిం పర్సనల్ చట్టాలను క్రోడీకరించలేదు. మత గ్రంథాలే వారికి ఆధారం. క్రిమినల్ సివిల్ చట్టాలు వేర్వేరుగా ఉన్నాయి. దేశంలో నివసించే ప్రజలు స్త్రీ, పురుష లింగ భేదం లేకుండా పౌరు లందరికీ ఒకే చట్టం వర్తింపజేయడం ఉమ్మడి పౌరస్మృతి ఉద్దేశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు ఉమ్మడి పౌరస్మృతి డిమాండ్ కొనసాగుతూనే ఉంది.రాజ్యాంగంలో 44 ఆర్టికల్ ప్రకారం ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నట్లు దేశ ప్రజలందరికి ఎలాంటి వివక్ష లేకుండా ఒకే చట్టం వర్తించాలి. దేశంలో హిందూ వివాహచట్టం ముస్లిం వివాహ చట్టం షరియా లాంటి ముస్లిం చట్టాలు అమల్లో ఉన్నాయి. దేశ ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలి అన్నవాదనని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు. అనేక దేశాల్లో ఉమ్మడి చట్టాలు అమల్లో ఉన్నాయి. ఫ్రాన్స్ జర్మనీ, చైనా,యుకె దేశాల్లో మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.ఈజిప్ట్ మొరాకోటరీ ముస్లిం దేశాలలో అల్పసంఖ్యాకులకు వేరే చట్టాలు లేవు. కేంద్ర ప్రభుత్వం 2019లో ట్రిపుల్ తలాక్ ను నేరంగా పరిగణిస్తూ చట్టంచేసింది. వేరువేరు చట్టాలు ఉండడం వల్ల రాజ్యాంగం ముందు అందరూ సమానులే అన్న స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని అనేక తీర్పులో సుప్రీం కోర్టు ఉమ్మడి పౌరస్మృతి ప్రాధాన్యతను పేర్కొంది. ఇటీవల కాలంలో భారత దేశ లా కమిషన్ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉమ్మడి పౌరస్మృతి అవసరం గురించి నొక్కి వ్యాఖ్యానించడం గమనార్హం. ఉమ్మడి పౌరస్మృతి పట్ల రాజ్యాంగ సభలో



దీర్ఘస్థాయి చర్చలు జరిగాయి. ఇప్ప టికీ మేధావులు న్యాయ కోవిదులు సామాజిక వేత్తలు పలు సందర్భాలలో ఉమ్మడి పౌరస్మృతీ మీద చర్చలు జరు పుతున్నారు. పలు సందర్భాలలో సుప్రీమ్ కోర్టు ఉమ్మడి పౌరస్మృతి ఆవశ్యత గురించి వ్యాఖ్యానించింది. సాంఘిక న్యాయం ఉమ్మడి పౌరస్మృతి. ఉమ్మడి పౌరస్మృతి అమలు వల్ల సామాజిక సమత సాంఘిక న్యాయం స్త్రీ, పురుష సమానత్వ సాధన సాంఘిక దురాచారాల నిర్మూలన అభ్యు దయ సమాజ నిర్మాణం సామాజికంగా గుణాత్మక మార్పుల కొరకు పౌరస్మృతి అవసరాన్ని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రతిపాదించారు. రాజ్యాంగ నిర్మాణ సభలో ఉమ్మడి పౌరస్మృతి మీద సుదీర్ఘ చర్చలు జరిగాయి. అంబేద్కర్ కె ఎం మున్షి అల్లాడి కృష్ణస్వామి ఉమ్మడి పౌరస్మృతిని సమర్థించారు. మతాలు ఏకీకృత చట్టం పరిధిలోకి వస్తాయి. రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా సుప్రీమ్ కోర్ట్ తీర్పులను ప్రతిబింబించే విధంగా దేశంలోని ప్రజలను విభిన్న మతాలను ఏకీకృత చట్టపరిధిలోకి తీసుకు వచ్చే ప్రయత్నమే ఉమ్మడి పౌరస్మృతి భారతగణతంత్ర దేశంలో దేశమంతటకి వర్తించే ఒకే రాజ్యాంగం ఒకేప్రధాన మంత్రి ఒకే రాష్ట్ర పతాకం (జాతీయ పతాకం) ఉన్నట్లుగా వివిధ మతాలకు ప్రాంతాలతో సంబంధం లేని ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని మన రాజ్యాంగం నాల్గవ భాగం ఆదేశిక సూత్రాల్లో 44వ అధికరణంలో పేర్కొన్నారు.భారత దేశంలో నీ అన్ని ప్రాంతాల పౌరులందరికీ వర్తించేఏకరూప పౌరస్మృతి అవసరాన్ని పేర్కొన్నారు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం, అనే లక్ష్యంతో విభిన్న మతాలు,విభిన్న సంస్కృతులు విభిన్న ఆచారాలు, నెలకొన్న సమాజంలో పౌరులందరికీ రాజ్యాంగం ఎలాంటి వివక్ష లేకుండా ప్రాథమిక హక్కులు స్వేచ్ఛలను ప్రసాదించింది. దేశంలోని వివిధ వర్గాలకు పౌరులకు వేరు వేరు చట్టాలు వుండకూడదని దేశ ప్రధాన మంత్రి ఆక్షేపణ చేస్తూ దేశ ప్రజలందరికీ వర్తించే ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని వివిధ వేదికల మీద ప్రస్తావించడం గమనార్హం.ఉమ్మడి పౌరస్మృతి చట్టరూపంలో తేవడానికి అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. కొన్ని మత సమూహాల నుండి వ్యతిరేకత దేశ సమైక్యత సమగ్రత ఏకాత్మత సమన్యాయం లింగ సమానత్వం కుటుంబ వ్యవస్థ స్థిరత్వం కోరేవారిలో కాలయాపన చేయకుండా చట్టం చేయాలన్న వాదనలు చర్చలు జోరందుకున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణ సభలో ఉమ్మడి పౌరస్మృతి మీద చర్చ జరిగినప్పుడు బాబాసాహెబ్ అంబేద్కర్ మాట్లాడుతూమనిషి జీవితం ప్రతిఅంశాన్ని ఆక్రమించే విధంగా మతానికి విస్తృత అధికారం దాఖలుపరిచారు. మతంస్థానంలో శాసనాధికారం వుండాలి. భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన స్వేచ్ఛ ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా అసమానతలు వివక్షల నుండి విముక్తి కలిగించడానికి సామాజిక వ్యవస్థను సంస్కరించడానికి స్వేచ్ఛ అనిస్పష్టం చేశాడు. ఉమ్మడి పౌరస్మృతి అమలు వల్ల దేశంలోని వివిధ మతాలలో ఉన్నచట్టాలలోని లోపాలను తొలిగించి జాతిసమైక్యత సమగ్రతకు దోహదం చేస్తుంది.దేశంలోని క్రిమినల్ సివిల్ చట్టాలు అందరికీ వర్తిస్తాయి. దేశ ప్రజలందరికీ ఒకేచట్టం వర్తిస్తుంది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, జైన్, సిక్కు మొన్నగు మతాల్లో ఉన్న వ్యక్తిగత చట్టాలను అనుమతించరు. బహుభార్యత్వం రద్దు అవుతుంది. ప్రజల్లో జాతీయభావం పెరుగుతుంది. కులం, మతం వర్గం స్త్రీ పురుషలింగ భేదాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ సమాన హోదా వస్తుంది. ఆడ మగ సమానమే.లింగసమానత్వం సాధ్యమవుతుంది.ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగలక్ష్యం ఉమ్మడి పౌరస్మృతి అమలు ద్వారా నెరవేరుతాయి. భారత ప్రజాస్వామ్య దేశం కాబట్టి అందరికీ సమాన హక్కులు ఉంటాయి. వివిధమతాల వ్యక్తిగత చట్టాలు రద్దవుతాయి. సమ భావన ఉమ్మడి పౌరస్మృతి ప్రజలంతా ఒకటే. ప్రజలందరికి ఒకే చట్టం అన్న సమ భావన ఉమ్మడి పౌరస్మృతిద్వారా సాధ్యమౌతుంది.ఉమ్మడి పౌరస్మృతి అమలుతో దేశఐక్యత సామాజిక అభివృద్ధిగుణాత్మక మార్పులతో దేశం ప్రగతిపథంలో పయనిస్తుందని ఆశిద్దాం. ●

# మహారాష్ట్ర డిసిఎంగా సునేత్ర పవార్


## లోక్‌భవన్‌లో ప్రమాణం చేసిన అజిత్ సతీమణి



**ముంబయి, జనవరి 31:** మహారాష్ట్రలో తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా 62 ఏళ్ల సునేత్రా పవార్ ప్రమాణం చేశారు. మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సునేత్రా పవార్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందడంతో ఆయన భార్య సునేత్రా పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. వారి కుమారుడు పార్థ్ పవార్‌కు రాజ్యసభ సీటు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగాప్రమాణస్వీకార కార్యక్రమంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తోపాటు డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే, ఇతర కేబినెట్ సహచర మంత్రులు, ఎన్సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు. రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా సునేత్ర ప్రమాణ స్వీకారం జరిగింది. అయితే అజిత్‌పవార్ నిర్వహించిన శాఖలే ఆమెకు ఇస్తారా లేక ఇతర శాఖలు ఏవైనా ఇస్తారా అన్నది రెండురోజుల్లో నిర్ధారణ అవుతుందని పార్టీనేతలు చెపుతున్నారు. అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా ఆమెను నిలబెట్టడం ద్వారా పార్టీపై పట్టు సాధించాలని ఎన్సీపీ వర్గం భావిస్తోంది. అదే సమయంలో శరద్ పవార్ వర్గంతో విలీనంపై చర్చలు కూడా కొనసాగుతుండటం గమనార్హం. ఎన్సీపీ శాసన సభాపక్ష నేతగా సునేత్రా పవార్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నేత ఛగన్ భుజబల్ సునేత్రా పవార్ పేరును ప్రతిపాదించగా ఇతర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సిఫార్సు మేరకు గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సునేత్రా పవార్‌కు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ సహా మొత్తం ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ విషాద సమయంలోనే ఎన్సీపీ పగ్గాలు చేపట్టాలని సునేత్రా పవార్‌ను ఆ పార్టీ వర్గాలు ఒప్పించాయి. ఎన్సీపీలో శరద్ పవార్ ఆధిపత్యాన్ని అడ్డుకోవాలంటే అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా సునేత్రా పవార్‌ను నిలబెట్టాలని అజిత్ పవార్ ఎన్సీపీ నేతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. విడిపోయిన ఎన్సీపీ రెండు వర్గాలు తిరిగి విలీనం అవుతాయని దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని ఇప్పటికే శరద్ పవార్ తేల్చి చెప్పారు. జయంత్ పాటిల్, అజిత్ పవార్ మధ్య ఇప్పటికే డిసెంబర్, జనవరి నెలల్లో చర్చలు జరిగాయని.. ఫిబ్రవరిలో విలీన ప్రక్రియ ఉండగా ఈ విషాధం చోటు చేసుకున్నట్లు తెలిపారు. సునేత్రా పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా నియమిస్తున్నారన్న వార్తలపై స్పందించిన శరద్ పవార్ తనకు ఈ విషయం తెలియదని స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల వరకు సునేత్రా పవార్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండేవారు. ఆ ఎన్నికల్లో బారామతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి తన వదిన సుప్రియా సూలేపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆమె ఎన్సీపీ తరఫున రాజ్య సభకు ఎన్నికయ్యారు. ఇప్పటివరకు రాజ్యసభ ఎంపీగా ఉన్న సునేత్రా పవార్ అజిత్ పవార్ అకాల మరణంతో నేరుగా మహారాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టారు.

**విలీనమే అజిత్‌పవార్ చివరి కోరిక: శరద్ పవార్**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఈ రోజు ప్రమాణ స్వీకారంపై శరద్ పవార్ స్పందించారు. ఈ విషయం తనకు తెలియదని, తనతో ఎవరూ చర్చించలేదని వివరించారు. ఈ రోజు ఉదయం న్యూస్ పేపర్ల ద్వారా అజిత్ పవార్ కూటమి సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారనే విషయం మాత్రమే తనకు తెలిసిందన్నారు. ఆ పార్టీ తరఫున సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు తెలిసిందన్నారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరాలని సునేత్రా పవార్ నిర్ణయించుకున్నట్లు తమ కుటుంబానికి తెలియదని శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ రెండు కూటములు ఒక్కటవ్వాలన్నదే అజిత్ పవార్ కోరిక అని శరద్ పవార్ తెలిపారు. ఈ విషయంపై నాలుగు నెలలుగా అజిత్ పవార్, శశికాంత్ షిండే, జయంత్ పాటిల్ చర్చలు జరిపారని, రెండు వర్గాల



విలీనానికి ఫిబ్రవరి 12వ తేదీని ఫిక్స్ చేశామని కూడా చెప్పారు. అయితే, ఈలోపు దురదృష్టవశాత్తూ అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారని చెప్పారు. దీంతో విలీన చర్చలకు బ్రేక్ పడిందని వివరించారు. అజిత్ పవార్ చివరి కోరిక నెరవేరాలని తమ కుటుంబం కోరుకుంటోందని శరద్ పవార్ తెలిపారు.

# మమత ప్రభుత్వ అవినీతివల్లే ఆనంద్‌పూర్ విషాదం



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధ్వజం

**కోల్‌కత్తా,జనవరి 31:** పశ్చిమ బెంగాల్‌లోని ఆనందపూర్‌వద్ద గోదాముల్లో జరిగిన భయంకర అగ్ని ప్రమాదంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతి వల్లే ఈ విషాదం జరిగిందని, పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిందితులను జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ ఆనందపూర్‌లోని మోమో ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదం విషాదకరం. ఇది ప్రమాదం కాదు మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతి దీనికి కారణం. మోమో ఫ్యాక్టరీలో ఎవరి డబ్బు పెట్టారు యజమాని ఎవరితో విదేశీ ఫ్లైట్‌లో వెళ్లాడు ఎందుకు అరెస్ట్‌చేయలేదు అని ప్రశ్నించారు. అగ్నిప్రమాదం జరిగి 32గంటల తర్వాత మంత్రి స్థలానికి చేరుకున్నారని, కార్మికులు అరుస్తుంటే ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉందని ఆయన మండిపడ్డారు. ఈ అగ్నిప్రమాదం మీ పార్టీ అవినీతిని చూపిస్తోందని అమిత్‌షా ఆరోపించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పూర్తి దర్యాప్తుకు ఆదేశించి నిందితులను జైలుకుపంపాలని డిమాండ్ చేశారు. ఆనందపూర్‌లోని డెకరేటర్ గోదాములో మొదలైన మంటలు సమీపంలోని మోమో గోదాముకు వ్యాపించాయి. 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ గోదాములో ప్యాకేజింగ్ మెటీరియల్, బెవరేజెస్,ఇతర సామాన్లు నిల్వఉన్నాయి. అగ్నిప్రమాదం సమయంలో చాలా మంది కార్మికులు నిద్రపోయి ఉండటంతో వారు తప్పించుకోలేకపోయారు. మరణాల సంఖ్య 21కి చేరుకుంది. ఇంకా శవాలు శిథిలాల కింద ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.పోలీసులు 16 మంది బంధువుల నుంచి డీఎన్ఏ శాంపిల్స్ సేకరించారు. అనేకమంది కుటుంబ సభ్యులు తమ వారు ఇంకా శిథిలాల కింద ఉన్నారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, గోదాములో ఫైర్ సేఫ్టీ గైడ్‌లైన్స్ ఎలా ఉన్నాయి అనే అంశంపై కూడా దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఘటనా స్థలానికి వెళ్లి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే ఈ విషాదానికి బాధ్యులని ఆయన ఆరోపించారు.

# భారత్‌లోనే ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్ తయారీ

## భారత్-రష్యా మధ్య కొనసాగుతున్న చర్చలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్ అత్యాధునిక 5వ జనరేషన్ స్టెల్త్ ఫైటర్ జెట్ తయారీకి సిద్ధమవుతోంది. భారత్-రష్యాలు కలిసి భారత్‌లోనే ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్ ఉత్పత్తి కోసం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే పాకిస్థాన్, చైనాలకు భయం మొదలు కావల్సిందే. ఈ చర్చలు ఫలితాలను ఇస్తే, భారత్ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మరింత బలం చేకూరుతుంది. రక్షణ రంగంలో స్వావలంబన ఏర్పడుతుంది. ఇదే సమయంలో భారత్ స్వదేశీ టెక్నాలజీతో తయారు చేసుకుంటున్న 5వ తరం యుద్ధవిమానం ఎఎంసిఎకు మద్దతు లభిస్తుంది. అయితే, ఈ చర్చలపై రష్యా నుంచి బలమైన సంకేతాలు ఉన్నప్పటికీ, న్యూఢిల్లీ ఇంకా దీనిపై అధికారికంగా స్పందించలేదు.

**ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్:** ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్ రష్యా తయారీ ఫిఫ్త్ జనరేషన్ ఫైటర్ జెట్. ఇది ఎగుమతి వేరియంట్. శత్రుదేశాల



రాడార్‌లకు చిక్కకుండా దాడి చేసే సామర్థ్యం ఉంది. సూపర్ క్రూయిజ్ ఎబిలిటీ, అధునాతన ఏవియానిక్స్, సెన్సార్‌ఫ్యూర్,లాంగ్ రేంజ్ ఎయిర్‌టు ఎయిర్, ఎయిర్ టూ గ్రౌండ్ ఆయుధాలతో దాడి చేసే సామర్థ్యం కలిగి ఉంది. దీంతో పాటు చైనీస్, అమెరికన 5వతరం యుద్ధ విమానాలతో పోలిస్తే తక్కువ నిర్మాణ ఖర్చు దీని ప్రత్యేకత.

**ఉమ్మడి తయారీ:** సుఖోయ్ ఎస్‌యు-57 భారత్‌లో సంయుక్తంగా తయారు చేసే అంశంపై భారత్-రష్యా మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని రష్యా ఏరోస్పేస్ రంగానికి చెందిన ఉన్నతాధికారులు తెలిపారు. రష్యా యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యుఎసి) కూడా ఈ విషయాన్ని వెల్లడించింది. ఎగుమతి వేరియంట్‌ను భారత్‌లో లైసెన్స్ ఆధారంగా తయారుచేయడం ఒక ఛాయిస్ అని యుఎసి సిఇఒ వాదిమ్ బడేఖా తెలిపారు. ఎస్‌యు-57 యుద్ధవిమానాలను ప్రస్తుతం ఇండియాలో ఎస్‌యు-30 ఎంకెలు తయారుచేస్తున్న ఫెసిలిటీల్లోనే ఉత్పత్తి చేసే అవకాశం పరిశీలనలో ఉంది. తయారీలో భారత పరిశ్రమల భాగస్వామ్యం, స్వదేశీ వ్యవస్థల వినియోగం కీలకంగా ఉండే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, రష్యా ప్రభుత్వ ఆయుధ ఎగుమతిదారు రోసోబోరోనెక్స్‌పోర్ట్ కూడా భారత్‌కు ఎస్‌యు-57 యుద్ధ విమానాల సరఫరాతో పాటు దేశీయంగా ఉత్పత్తి చేసే ప్రతిపాదన చేసినట్లు రష్యన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. భారత్ స్వతహాగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎఎంసిఎ) ప్రోగ్రామ్‌కు సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా పేర్కొంది. ఎఎంసిఎ 2030 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ మధ్యకాలంలో వైమానిక బలోపేతానికి 5వ తరం యుద్ధ విమానాలు చాలా కీలకంగా మారాయి.

## సత్వర న్యాయానికి న్యాయమూర్తుల కొరత

### ప్రతి పదిలక్షల జనాభాకు కేవలం 22 మందే జడ్జిలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత న్యాయ వ్యవస్థ తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. దేశంలో ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మంది న్యాయమూర్తులు ఉన్నారు. న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఉండాల్సిన సంఖ్య కన్నా ఇది తక్కువ. సకాలంలో న్యాయం జరగాలంటే జనాభాకు తగినంత మంది జడ్జీలు లేరని ఇప్పటికే పలు పర్యాయాలు న్యాయమూర్తుల నుంచే నివేదికలు వచ్చాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, 2026 నాటికి ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని లెక్కించినట్లు కేంద్రం తెలిపింది. అధికారిక వివరాల ప్రకారం, సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులకు గానూ ప్రస్తుతం 33 మంది మాత్రమే ఉన్నారు. హైకోర్టుల్లో 1122 మంది న్యాయమూర్తులు ఉండాలి, కానీ ప్రస్తుతం 814 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అత్యధిక కేసులు జిల్లా, దిగువ కోర్టుల్లోనే ఉన్నాయి. ఈ కోర్టుల్లో 20,833 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు. అయినా పెండింగ్ కేసులు తగ్గించడానికి ఈ సంఖ్య సరిపోవడం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రధాన కోర్టుల్లో గణనీయంగా న్యాయమూర్తుల కొరత ఉంది. లా కమిషన్ ఆఫ్ ఇండియా తన 120వ నివేదికలో ప్రతీ 10 లక్షల మందికి 50 మంది న్యాయమూర్తులు ఉండాలని సూచించింది. ఈ సంఖ్యలో సగం కూడా ప్రస్తుతం లేరు. కోర్టులపై ఉన్న ఒత్తిడి జైళ్లలో కనిపిస్తోంది. నేషనల్ క్రైమ్ బ్యూరో ప్రకారం, 2023 నాటికి 3,89,910 మంది అండర్ ట్రయల్ ఖైదీలు జైళ్లలో ఉన్నారు. సత్వర న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. కోర్టుల మౌలిక సదుపాయాలను మెరుగుపరడచంతో పాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సహకారంతో పాటు పారదర్శకతను మెరుగుపరచడానికి ఈకోర్టులు మిషన్ మోడ్ ప్రాజెక్ట్ ద్వారా టెక్నాలజీని తీసుకువస్తోంది.

# పన్నేతర ఆదాయంలో 40%వరకూ వడ్డీలకే..

## అప్పల ఊబినుంచి బయటకురాలేని రాష్ట్రాలు ఎక్కువే

**ముంబయి,జనవరి 31:** భారత ఆర్థికవ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటిసంస్థలు ప్రశంసలు కురిపిస్తుంటే దేశంలోని అనేక రాష్ట్రాలు తీవ్రమైన అప్పులఊబిలో చిక్కుకుంటున్నాయి. భారత రిజర్వుబ్యాంకు (ఆర్బీఐ) విడుదల చేసిన 2025 ఆర్థిక సంవత్సర గణాంకాలు ఈ ఆందోళనకర నిజాలను వెలుగులోకి తీసుకొచ్చాయి. సెంట్రల్ బ్యాంకు డేటా ప్రకారం, దేశంలోని కొన్ని పెద్ద రాష్ట్రాలు తమ పన్ను మరియు పన్నేతర ఆదాయంలో 40 శాతం వరకు కేవలం రుణాలపై వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేస్తున్నాయి. దీనివల్ల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాలకు సరిపడా నిధులు కేటాయించలేని పరిస్థితి ఏర్పడుతోంది.




అప్పుల భారంతో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న రాష్ట్రాల జాబితాలో పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో నిలిచింది. 2025 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం సుమారు రూ.1.09 లక్షల కోట్ల ఆదాయం పొందగా, అందులో రూ.45 వేల కోట్లకు పైగా వడ్డీ చెల్లింపులకే వెచ్చించాల్సి వచ్చింది. అంటే మొత్తం ఆదాయంలో దాదాపు 42 శాతం వడ్డీకే వెళ్లిపోయింది. ఇక, రెండో స్థానంలో ఉన్న పంజాబ్ తన ఆదాయంలో 34 శాతం వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసింది. రూ.70 వేలుకోట్ల ఆదాయంలో సుమారు రూ.24 వేల కోట్లు వడ్డీగా చెల్లించింది. ఆ తర్వాత బీహార్ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రం సంపాదించిన రూ.62వేల కోట్ల ఆదాయంలో సుమారు రూ.21వేల కోట్లు వడ్డీ చెల్లింపులకు వెళ్లాయి.ఇది మొత్తం ఆదాయంలో 33 శాతం. నాలుగో స్థానంలో ఉన్న కేరళ 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.1.03 లక్షల కోట్ల ఆదాయం పొందగా, దాదాపు 28 శాతం అంటే సుమారు రూ.29 వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసింది. ఆ తర్వాత ఐదో స్థానంలో ఉన్న తమిళనాడు, అధిక పన్ను ఆదాయం ఉన్న రాష్ట్రాల్లో ఒకటైనా, అప్పుల భారంతోనే కొనసాగుతోంది. రాష్ట్రం తన ఆదాయంలో సుమారు 28 శాతం లేదా రూ.62 వేల కోట్లు వడ్డీగా చెల్లించింది. టాప్ 10 అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాల జాబితాలో హర్యానా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి.హర్యానా తన రూ.94 వేల కోట్ల ఆదాయంలో దాదాపు 27శాతం అంటే రూ.25వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసింది. రాజస్థాన్ రూ.1.48 లక్షలకోట్ల ఆదాయంలో సుమారు రూ.38వేల కోట్లు వడ్డీగా చెల్లించి ఏడవ స్థానం లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా తీవ్ర అప్పుల ఒత్తిడిని ఎదుర్కొంటోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం సుమారు రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం పొందగా, అందులోదాదాపు రూ.29వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే వెచ్చించింది. ఇక మధ్యప్రదేశ్ తొమ్మిదో స్థానంలో నిలిచింది.2025లో రూ.1.23లక్షలకోట్ల ఆదాయం పొందగా, అందులో సుమారు రూ.27వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే వెళ్లాయి. పదో స్థానంలో ఉన్న కర్ణాటక రూ.2.03 ట్రిలియన్ల ఆదాయం పొందినా, దాదాపు 19శాతం అంటే రూ.39వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసిందని ఆర్బీఐ గణాంకాలు స్పష్టంచేసాయి. రాష్ట్రాల ఆదా యంలో ఇంత పెద్ద మొత్తంలో వడ్డీ చెల్లింపులు జరగడం వల్ల కొత్తరహదారులు, పాఠశాలలు, ఆసు పత్రులు, సంక్షేమపథకాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడుతోంది. ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ వనరుల విస్తరణ మరియు ఖర్చుల నియంత్రణ లేకపోతే ఈ అప్పుల భారం భవిష్యత్తులో మరింత తీవ్రంఅవుతుందని రాష్ట్రాల పాలకులుగుర్తించాలని ఆర్బీఐ హెచ్చరిస్తోంది.

## సౌదీ, ఇజ్రాయెల్‌కు భారీ ఆయుధ విక్రయాలు

# 15.6 బిలియన్ డాలర్లతో అమెరికా ఒప్పందం

**వాషింగ్టన్,జనవరి 31:** ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దేశాలకు అమెరికా సుమారు 15.6 బిలియన్ల విలువైన భారీ ఆయుధాల విక్రయాలకు ఆమోదం తెలిపింది. ఇరాన్ నుండి ఎదురవుతున్న ముప్పును అడ్డుకోవడం, ప్రాంతీయ భద్రతను పటిష్టం చేయడం ఈ ఒప్పందాల ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. ఈ మేరకు ఇజ్రాయెల్‌కు 6.7 బిలియన్లు, సౌదీకి 9 బిలియన్ల పిఎసి-3 క్షిపణి నిరోధకాలను విక్రయించేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. ఈ విక్రయాలు ప్రాంతీయ భద్రతలో కీలకమైన మార్పులకు దారితీయనున్నాయి. ఇజ్రాయెల్ కోసం నాలుగు విదేశీ సైనిక విక్రయ ఒప్పందాలు జరిగాయి. 3.8 బిలియన్ల 30 ఎహెచ్-64ని అపాచీ హెలికాప్టర్లు, 1.98 బిలియన్ల 3,250 జాయింట్ లైట్ టాక్టికల్ వాహనాలు, 740 మిలియన్ల నామెర్ ఆర్మర్డ్ పర్సనల్ క్యారియర్ పవర్ ప్యాక్‌లు, 150 మిలియన్ల అంచనాతో తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లు. అలాగే సౌదీఅరేబియాకు 9బిలియన్ల 730 పిఎసి-3 క్షిపణి నిరోధకాలు,అనుబంధ పరికరాలు విక్రయించనున్నారు. ఈనెలలో లాక్ హీడ్, పెంటగాన్ 2030 చివరినాటికి పిఎసి-3 ఉత్పత్తిని సంవత్సరానికి మూడురెట్లు పెంచే ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ విస్తరణ సౌదీ ఒప్పం దానికి మరింత ఊతమిస్తుంది. ప్రతిపాదిత ఒప్పందం సౌదీ అరేబియా ప్రస్తుత, భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుంది.



## అమెరికాను కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ ఫైళ్లు

### తాజాగా మరికొందరి పేర్లు బహిర్గతం

**వాషింగ్టన్,జనవరి 31:** అమెరికాను కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్ లో తాజాగా మరికొందరి పేర్లు బయటపడ్డాయి. డిపార్ట్ మెంట్ ఆఫ్ జస్టిస్ 2 వేల వీడియోలు, 1.8 లక్షల ఫొటోలు సహా మొత్తం 30లక్షలకు పైగా డాక్యుమెంట్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులోని ఓ ఈ-మెయిల్ లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2009లో అమేలియా సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన ఓ పార్టీలో ఆ సినిమా దర్శకురాలు, న్యూయార్క్ ప్రస్తుత మేయర్ జొహ్రాన్ మందానీ తల్లి మీరా నాయర్ కూడా పాల్గొన్నారని ఓ ఈ-మెయిల్ వెల్లడించింది. ఈ పార్టీని ట్రాఫికింగ్ కేసులో దోషిగా తేలిన గిస్లెయిన్ మాక్స్ వెల్ తన నివాసంలో ఏర్పాటు చేసినట్లు వెల్లడైంది. ఈ పార్టీకి హాజరైన పెగ్గీ సీగల్ 2009 అక్టోబర్ 21న జెఫ్రీ ఎప్ స్టీన్ కు ఓ ఈ-మెయిల్ పంపారు. మాక్స్ వెల్ నివాసంలో జరిగిన పార్టీ నుంచి ఇప్పుడే బయటకు వచ్చాను. అమేలియా సినిమా రిలీజ్ సందర్భంగా మాక్స్ వెల్ తన ఇంట్లో ఈ పార్టీ ఏర్పాటు చేశారు. మాజీ ప్రెసిడెంట్ బిల్ క్లింటన్, అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్, జియాన్ పిగొని, డైరెక్టర్ మీరా నాయర్ తదితరులు ఈ పార్టీకి హాజరయ్యారు. సినిమా పెద్దగా ఆకట్టుకునేలా లేదని అతిథులు అభిప్రాయపడ్డారు. మహిళలను మాత్రం ఈ సినిమా చాలా ఆకట్టుకుంది అంటూ పెగ్గీ సీగల్ పలు వివరాలను ఇందులో పేర్కొన్నాడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, బ్రిటిష్ బిలియనీర్ రిచర్డ్ బ్రాన్సన్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో పాటు పలువురు ప్రముఖుల పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. అయితే, ఈ ఫైల్స్‌లో పేర్లు ఉన్నంత మాత్రాన వీరిపై ఎలాంటి నేరారోపణలు మోపలేదని అధికారులు స్పష్టం చేశారు.రష్యన్ అమ్మాయిలతో గడిపిన తర్వాత ఎదురైన పరిణామాలను ఎదుర్కోవడానికి, వివాహిత మహిళలతో అక్రమ సంబంధాలు కొనసాగించడానికి తాను బిల్‌గేట్స్‌కు సహాయం చేసానని, గేట్స్‌కు ఎస్‌టిడిలు సంక్రమించాయని ఎప్‌స్టీన్ అందులో పేర్కొన్నాడు. బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ ఆండ్రూ, బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు విందుకు రావాలని, 'ప్రైవేట్ టైమ్' గడుపుదామని ఎప్‌స్టీన్‌ను ఆహ్వానించినట్లు ఈమెయిల్స్ ద్వారా తెలిసింది. ట్రంప్ కేబినెట్‌లో వాణిజ్య కార్యదర్శిగా ఉన్న హోవార్డ్ లుట్నిక్, నిర్మాత స్టీవ్ టిష్ వంటి ప్రముఖులు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఈ పత్రాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం మీద ఈ కొత్త ఫైల్స్, ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌లో ఉన్న శక్తిమంతమైన వ్యక్తుల సంబంధాలపై మరోసారి ప్రపంచవ్యాప్తంగా చర్చను రేకెత్తించాయి.

# ఆర్థికవ్యవస్థలకు తీవ్రనష్టంచేస్తున్న ఉచితాలు

## ఆర్థిక సర్వే హెచ్చరికలు



**న్యూఢిల్లీ,జనవరి 31:** ఓట్ల వేటలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని ఆర్థిక సర్వే 2025-26 హెచ్చరికలు చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ నివేదికలో నిబంధనలు లేని నగదు బదిలీ పథకాల కోసం రాష్ట్రాలు చేస్తున్న ఖర్చు గత మూడేళ్లలో ఐదు రెట్లు పెరిగి, ఈ ఏడాది రూ. 1.7 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ భారీ వ్యయం వల్ల రాష్ట్రాల ఆదాయంలో దాదాపు 62 శాతం కేవలం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, ఉచితాలకే సరిపోతోంది. ఫలితంగా రోడ్లు, రైల్వేలు, ఆసుపత్రులు, విద్యా సంస్థల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించాల్సిన మూలధన వ్యయం దారుణంగా తగ్గిపోతోందని సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా అప్పులు చేసి మరీ వినియోగం కోసం ఖర్చు చేయడం వల్ల దీర్ఘకాలంలో రాష్ట్రాలు దివాలా తీసే ప్రమాదం ఉందని, కేవలం నగదును చేతిలో పెట్టడం వల్ల పేదరికం తగ్గడం లేదని నివేదిక స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు బ్రెజిల్‌లో విజయవంతమైన బోల్సా ఫ్యామిలియా తరహా విధానాన్ని అనుసరించాలని ఆర్థిక సర్వే సూచించింది. కేవలం ఉచితంగా డబ్బులు ఇవ్వకుండా, దానికి కొన్ని నిబంధనలను జోడించాలని పేర్కొంది. ఉదాహరణకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందే కుటుంబాలు తమ పిల్లలను ఖచ్చితంగా బడికి పంపడం, సకాలంలో టీకాలు వేయించడం వంటి సామాజిక బాధ్యతలను నెరవేర్చాలి. అంతేకాకుండా, ప్రతి పథకానికి ఒక సన్‌సెట్ క్లాజ్(ముగింపు గడువు) ఉండాలని, ప్రజలు ఎప్పటికీ ప్రభుత్వంపైనే ఆధారపడకుండా వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపించేలా పథకాల రూపకల్పన ఉండాలని సర్వే ప్రతిపాదించింది. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు రాష్ట్రాలు పోటీ పడి మరీ ఇస్తున్న నగదు బదిలీలు, వారు తిరిగి ఉపాధి రంగంలోకి రాకుండా అడ్డుకుంటున్నాయని, ఇది దేశ ఉత్పాదకతపై ప్రభావం చూపుతోందని నివేదిక పేర్కొంది. సంక్షేమం అనేది ఒక భద్రతా వలయంగా ఉండాలి తప్ప, అది అభివృద్ధికి ఆటంకం కాకూడదని ఆర్థిక సర్వే గట్టిగా నొక్కి చెప్పింది.

# సంక్షిప్తంగా..

## కాఫీ షాపులపై దాడులకు ఎర్రకోట ఉగ్ర ముఠా కుట్రలు



**న్యూఢిల్లీ, జనవరి 31:** ఢిల్లీలో పేలుడు కేసును దర్యాప్తు చేసే కొద్దీ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ పన్నిన అనేక కుట్రలు బయట పడుతున్నాయి. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని విషయా లను దర్యాప్తు అధికారులు తాజాగా వెల్లడించారు. ఈ దాడికి పాల్పడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ ప్రఖ్యాత కాఫీ చైన్లను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో వెల్లడయిందన్నారు. భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఉన్న ఓ ప్రఖ్యాత కాఫీ చైన్‌లలో ఉగ్రదాడులకు నింది తులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. తాము అదుపులోకి తీసుకున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ నాలుగేళ్లుగా చురుగ్గా ఉందని అధికారులు తెలిపారు. నాటి నుంచి వారు ఉగ్రదాడులకు కుట్ర పన్నుతూ భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను తయారుచేస్తున్నారన్నారు. విదేశీ ఆయుధాలను కూడా నిందితులు కొనుగోలు చేశారన్నారు.

## అప్పులు అడగడం సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని



**ఇస్లామాబాద్, జనవరి 31:** పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీని నుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫే అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో కలిసి నేను రహస్యంగా మిత్రదేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాము. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్దదెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండ్ చేసినా సరే అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు.

## బిఎల్ఎ దాడిలో 10 మంది పాక్ అధికారులు మృతి



**ఇస్లామాబాద్, జనవరి 31:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) భారీ ఎత్తు న దాడులు చేసింది. 12 ప్రాంతాల్లో దాడులకు పాల్పడింది. ఈ దాడు ల్లో 10 మంది పాకిస్థాన్ భద్రతా అధికారులు మరణించగా, 37మంది బిఎల్ఎ యోధులు మరణించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కాల్పులతోపాటు ఆత్మాహుతిబాంబుదాడులు జరిగినట్లు తెలుస్తోంది. క్వెట్టా, పస్ని, మస్తుంగ్, నోష్కి, గ్వాదర్ జిల్లాల్లో ఈదాడులు జరిగినట్లు పాక్ సీనియర్ భద్రతా అధికారి వెల్లడించారు. అయితే, ఇప్పటివరకు ఈ దాడుల్లో ఎంతమంది సాధారణ ప్రజలు మరణించారనే వివరాలు వెలువడలేదు. భద్రతా సిబ్బంది వేగంగా స్పందించడంతో దాడులు తీవ్రతను తగ్గించినట్లు అధికారులు చెప్పారు.

## జాయింట్ వెంచర్‌కు పాక్ రూజ్‌వెల్ట్ హోటల్

**కరాచి,జనవరి 31:** పాకిస్థాన్ తమకు విదేశాల్లో ఉన్న అత్యంత విలువైన ఆస్తులలో ఒకటైన న్యూయార్క్‌లోని చారిత్రక రూజ్‌వెల్ట్ హోటల్‌ను పూర్తిగా విక్రయించకుండా, దానిని రీడెవలప్‌మెంట్ చేసేందుకు సిద్ధమైంది. జాయింట్ వెంచర్ పద్ధతిలో భాగస్వామిని చేర్చుకుని, ఈ ఆస్తి విలువను కనీసం 1 బిలియన్ డాలర్లకు పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నిర్దేశించిన ప్రైవేటీకరణ కార్యక్రమంలో భాగంగా పాక్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 1924లో ప్రారంభమైన రూజ్‌వెల్ట్ హోటల్, ఒకప్పుడు న్యూయార్క్ నగరానికే తలమానికంగా నిలిచింది. 1000కి పైగా గదులతో, గ్రాండ్ డేమ్ ఆఫ్ మాడిసన్ అవెన్యూగా పేరుగాంచింది. వాల్ స్ట్రీట్, మేడ్ ఇన్ మాన్‌హాటన్ వంటి ఎన్నో హాలీవుడ్ చిత్రాలకు ఇది వేదికైంది.

## లంచంతీసుకుంటూ పట్టుబడటంతో రోడ్డుపై అరుపులు,కేకలు

**బెంగళూరు,జనవరి 31:** బెంగళూరులోని కేపీ అగ్రహార పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు ఒక చీటింగ్ కేసులో మహమ్మద్ అక్బర్ అనే వ్యక్తికి బెయిల్ వచ్చేలా సాయం చేస్తానని, కేసు నుంచి పేరు తొలగిస్తానని రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. ఇప్పటికే రూ.లక్ష వసూలు చేసిన ఆయన మిగిలిన రూ.4లక్షలను చామరాజ్‌పేటలోని సీఏఆర్‌గ్రౌండ్స్ వద్ద తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు మెరుపు దాడిచేసి పట్టుకోగానే గోవిందరాజు షాక్‌కు గురయ్యారు. తప్పించుకునే మార్గం లేక నడిరోడ్డుపైనే గట్టిగా అరుస్తూ, తనను వదిలేయాలంటూ అధికారులతో పెనుగులాడారు. యూనిఫాంలో ఉండి ఆయన చేసిన ఈ రభస అంతా అక్కడ ఉన్నవారు వీడియో తీశారు.



పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న కెఆర్ సూర్యనారాయణ

## ఉద్యోగుల బకాయిలు రూ.35వేల కోట్లు చెల్లింపునకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి

**ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

**విజయవాడ, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలున్న రు.35వేల కోట్లను చెల్లించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఏపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కెఆర్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. అలా ఇవ్వలేని పక్షంలో బాకీకి భూమి ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో వున్న 4 డిఎలు ఇవ్వాలన్నారు. మధ్యంతర భృతి, వేతన సవరణ కమీషన్, సిపిఎస్, జిపిఎస్‌పై ఆమోదకరమైన పరిష్కారం తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పయ్యావుల కేశవ్‌కు అసోసియేషన్ నేతలతో కలిసి శనివారం సమర్పించారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలన్నారు.



## ఉభయదేవేరులతో గోవిందరాజస్వామి తెప్పపై విహారం

**తిరుపతి,జనవరి 31పభాతవార్తప్రతినిధి:** గోవింద రాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్స వాల్లో ఆరవరోజు శనివారం సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి భకు _లను కటాక్షించారు. సాయంత్రం 6.30 గంటలకు తెప్పపై ఏడుచుట్లు విహరించి భక్తులకు అభయ మిచ్చారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## అంబటి వ్యాఖ్యలపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

**- క్షమాపణ చెప్పకపోతే తెలుగు మహిళలు ఊరుకోరు**

**అనంతపురం, జనవరి 31 ప్రభాతవార్త బ్యూరో** ముఖ్యమంత్రి చంద్రబాబుని వ్యక్తిగతంగా విమర్శించిన అంబటి రాంబాబుని ఎవరూ ఒక మనిషిలా చూడటం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్యం చేశారు. అంబటి వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ..సభ్యత, సంస్కారం అన్నవి ఏ కోశానా రాంబాబుకు లేనట్టు కనిపిస్తున్నా యన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజంగా ఉంటాయన్నారు. గతంలో కూడా వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని, కూటమి నాయకులను ఇష్టానుసారం దూషించారన్నారు. ఆరోజే జగన్ వీటిని ఖండించి ఉంటే.. రాంబాబు లాంటి వారు ఇంత బరితెగించి మాట్లాడి ఉండే వారు కాదన్నారు. ఆయన వ్యాఖ్యలు కనీసం కుటుంబ సభ్యులైనా హర్షిస్తారా అని నిలదీశారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని.. లేదంటే రాష్ట్రంలో తెలుగు మహిళలు ఊరుకునేది లేదు.

# అవ్వాతాతల చెంతకు మంత్రి నారాయణ

**- ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేసిన మంత్రి - పండుగలా పెన్షన్ల పంపిణీ**



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త -** వైద్యం నెల్లూరు నగరంలోని 16వ డివిజన్ గుర్రాల మడుగు సంగంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఒక జాతరను తలపించింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ శనివారం తెల్లవారుజాము నుంచే డివిజన్‌లో పర్యటించి, ఇంటింటికి వెళ్లి అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు స్వయంగా పెన్షన్ నగదును అందజేశారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ఒక రోజు ముందే పంపిణీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. డివిజన్‌కు చేరుకున్న మంత్రి నారాయణకు స్థానికమహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి స్వయంగా తమ ఇంటి గడప వద్దకు వచ్చి పెన్షన్ అందించడంతో లబ్ధిదారులు ఆనందానికి హద్దులు లేవు. ఒక్క 16వ డివిజన్‌లోనే 497 మందికి రూ.21,42,500 నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల మందికి సుమారు రూ.34 వేల కోట్ల భారీ వ్యయంతో పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి దేశంలో మరెక్కడా లేని విధంగా పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల అప్పులు పెట్టినా, చంద్రబాబు అపార అనుభవంతో 90శాతం ఎన్నికల హామీలను నెరవేర్చామని పేర్కొన్నారు. మహిళలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.20వేల సాయం, యువనేత లోకేష్ ఆధ్వర్యంలో 67 లక్షల మందికి తల్లికి వందనం అమలు చేస్తున్నామని వివరించారు. నెల్లూరులో రూ.50 కోట్లతో డ్రైనేజీసమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని, నగరాన్ని గ్రీన్ సిటీగా మార్చి, దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మంత్రి నారాయణ పనితీరును ప్రశంసించారు. మంత్రి క్రమశిక్షణకు మారు పేరు. చెప్పిన సమయానికి వచ్చి పెన్షన్లు పంపిణీ చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. అడగగానే స్పందించే గొప్ప నాయకుడు మనకు ఎమ్మెల్యేగా ఉండటం నెల్లూరు వాసుల అదృష్టం. స్కూళ్లు, పార్కులు, కాలువల ఆధునీకరణకు ఆయన పెద్దపీట వేస్తున్నారు అని అన్నారు.

## సిఎంపై 'అంబటి' వ్యాఖ్యలు గర్హనీయం

**- తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి - ఆయన వ్యాఖ్యలు వెనక్కితీసుకుని క్షమాపణ చెప్పే దాకా విశ్రమించం - రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

**గుంటూరు, జనవరి 31, ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసం ~వు మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు ఉండాలి కానీ వ్యక్తిత్వ హననం కాదన్నారు. శనివారం అంబటి రాంబాబు సిఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని దూషించడం కాదని, రాష్ట్రం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న దశాబ్దాల చరిత్ర గల దార్శనికుడిని అవమానించడమే అని అన్నారు. ఆయన వాడిన పదజాలాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. రాజకీయాల్లో స్థాయిని మరిచి, సంస్కారాన్ని వదిలేసి మాట్లాడటం మీకు అలవాటుగా మారిందని,. కానీ ఈరోజు చంద్రబాబు పై చేసిన వ్యాఖ్యలు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయన్నారు. మా నాయకుడిని దూషించడం అంటే.. తెలుగు బిడ్డల గౌరవాన్ని కించపరచడమే అని వ్యాఖ్యానించారు. అంబటి నోరు అదుపులో పెట్టుకోండి అని హెచ్చరించారు. చేసిన తప్పును తెలుసుకొని.. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పే వరకు మేం విశ్రమించం అని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



**తిరుపతి, జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో చీఫ్ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో అంతర్జాతీయ స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు.ఆ విభాగం ఎస్పీ పి. శ్రీనివాస్ ఆధ్వర్యం లో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అంతర్జాతీయ స్మగ్లర్ల పైన ప్రత్యేక నిఘా ఉంచారు. పాత కేసులలో పరారీ లో వున్న స్మగ్లర్ల ను అరెస్ట్ చేయడం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది. మహమ్మద్ ముజామిల్ లైసెన్స్ పేరుతో ఎర్రచందనం దుంగలను చైనా కు ఎగుమతి చేస్తూ, లైసెన్స్ ముసుగు లో శేషాచల అడవులలో అక్రమం గా తరలించిన ఎర్రచందనము దుంగలను అక్రమ రవాణా చేస్తున్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా లో పలు కేసులలో ముద్దాయిగా ఉండి, పరారీ లో ఉన్న అంతర్జాతీయ ఎర్ర చందనము స్మగ్లర్‌ని అరెస్ట్ చేశారు. ఈ అక్రమ రవాణా లో మహమ్మద్ ముజామిల్ కి సహకరిస్తున్న చైనాకు చెందిన ప్రతినిధి మైఖేల్ పాత్ర పైన పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చీఫ్ సుబ్బరాయుడు తెలిపారు. అంతర్జాతీయ స్మగ్లర్ ను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన అడిషనల్ యస్పీ కులశేఖర్ బృందాన్ని అభినందించారు. గత జనవరి నుండి ట్రయల్ జరిగిన 31 కేసులలో 27 కేసులలో శిక్ష పడి 87 కేసులలో ముద్దాయిల పై నేరం రుజువవడంతో న్యాయస్థానం శిక్ష వేసారన్నారు.

## వేంకటేశ్వర స్వామి కోర్టులో వైసిపి నేతలకు శిక్ష తప్పదు: కాంగ్రెస్ నేత చిట్టిబాబు



**తిరుపతి, జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** అధికారంలో ఉన్న ఐదేళ్ళలో చేసింది పాపపు పనులు ,చెప్పేది పరిశుద్ధ మాటలని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు తీవ్ర స్థాయిలో తప్పుపట్టారు. చేసిన పాపాలకు తిరుమల కొండపై కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి కోర్టులో శిక్ష తప్పదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కొండపైన చిన్న తప్పు కూడా చేయడానికి భక్తులు ఎవరు సాహసించరన్నారు. అయితే ఐదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర స్వామి వద్ద క్షమించరాని పాపాలను చేసిందని ఆరోపించారు. పిలిస్తే పలికే దైవమైన స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూలను అసలు నెయ్యే కానీ రసాయనాలతో తయారుచేసిన నెయ్యితో లడ్డూలను స్వామివారికి నివేదించడం, భక్తులకు పంచడం తిరుమల చరిత్రలో క్షమించరాని అత్యంత ఘోరమైన పాపమన్నారు. ఇందుకోసం కోట్లను కూడబెట్టుకోవడానికి దుర్మార్గపు చర్యలకు అప్పటి టీటీడీ ఛైర్మన్లు కొందరు సిబ్బంది బరితెగించారని మండిపడ్డారు. ఇప్పుడు తాము ఉత్తములని, పరిశుద్ధులని, పవిత్రులమని, అమాయకులమని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ శ్రీవారి భక్తులను, ప్రజలను నమ్మించడానికి నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవాచేశారు.సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ చేసిన సిబిఐ సిట్ తన చార్జి షీట్లో 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగించారని స్పష్టంగా పేర్కొందని, కల్తీ నెయ్యిలతోనే దాదాపు 20 కోట్ల లడ్డూలను తయారు చేశారని అయితే ఈ నెయ్యిలో ఆవు కొవ్వు లేదని తాము ఎలాంటి పాపం చేయలేదని వైసిపి నేతలు చెప్పడం వారి బరితెగింపునకు అబద్ధాల మాటలకు పరాకాష్ట అన్నారు. రసాయనాలతో తయారుచేసిన నెయ్యిని శ్రీవారి ప్రసాదాలకు వాడామనే విషయం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. తాను ఛైర్మన్ గా ఉన్నప్పుడు నిల్వచేసిన లడ్డూలు బూజు పడుతున్నాయని భక్తులు, మీడియా స్పష్టం చేస్తే వారిపై ఎదురుదాడి దిగింది నిజం కాదా అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులకు కఠిన శిక్షలు విధించాలని, దోచుకున్న సొమ్మంతా స్వాధీనం చేసుకోవాలని గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు.

## అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు 90 శాతం పూర్తి !

**విజయవాడ.జనవరి 31,ప్రభాత వార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నిర్దిష్ట వ్యవధిలో స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి పరిధిలోని నవులూరు వద్ద నిర్మిస్తున్న ఈ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు తుది దశకు చేరుకున్నాయి. స్టేడియం నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయిందని ఏపీ మున్సిపల్ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు స్టేడియం నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. "రాజధాని అమరావతిలో నవులూరు వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో దీనిని సిద్ధం చేస్తున్నాం" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ స్టేడియంను మొత్తం 24 ఎకరాల విస్తీర్ణంలో 34 వేల సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. విజయవాడకు 13 కిలోమీటర్లు, గుంటూరుకు 16 కిలోమీటర్ల దూరంలో వ్యూహాత్మకంగా ఇది నిర్మితమవుతోంది. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి, స్టేడియంను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

## అమరావతిలో ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిలో ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఉద్దండరాయునిపాలెం- వెలగపూడి పరిధిలో రూ.100 కోట్ల వ్యవయంతో ఈ కార్యాలయాన్ని నిర్మించనుంది. ఈ మేరకు కంపెనీ చీఫ్ రీజినల్ మేనేజర్ వి.రాజా, సీఆర్‌డీఏ అధికారుల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఇన్సూరెన్స్ ఉత్పత్తుల అభివృద్ధికి ఏఐ స్పెషలిస్ట్ అధికారులను కూడా నియమించనున్నామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. గ్రామీణ, పట్టణ, కార్పొరేట్ రంగాలతో పాటు సాధారణ ప్రజలకు అవసరమైన అన్ని రకాల నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అమరావతి ప్రాంతీయ కార్యాలయం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. అమరావతిలో టెక్నికల్, ఫైనాన్స్, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో 200 నుంచి 225 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

## పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా దామోదరనాయుడి నియామకం చెల్లదు..

**జిఒను రద్దు చేసిన హైకోర్టు**

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా టి. దామోదరనాయుడిని పునర్నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం గతేడాది ఆగస్టు 6న జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఆయన నియామకం నిబంధనలకు విరుద్ధంగా ఉందని స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ఈ మేరకు తీర్పు ఇచ్చారు. దాంతో ఆ దిశలో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన దామోదరనాయుడిని తిరిగి నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గతేడాది ఆగస్టు 6న జీవో 295 జారీచేశారని, దానిని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఏపీ పశుసంవర్ధక ఆఫీసర్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, ఏపీ పశువైద్యుల అసిస్టెంట్ సర్జెన్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి. జయప్రకాశ్, పశుసంవర్ధకశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పాముల సత్యకుమారి ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారు. వారి తరపున న్యాయవాదులు పి.దుర్గాప్రసాద్, జీవీఎస్ కిశోర్‌కుమార్ వాదనలు వినిపించారు. దామోదరనాయుడిని డైరెక్టర్‌గా రెగ్యులర్ పోస్టులో నియమించడం వల్ల సీనియార్టీ ప్రకారం డైరెక్టర్ పోస్టుకు అర్హత ఉన్న అధికారులకు అన్యాయం జరుగు తుందన్నారు. ఆయన నియామకం నిబంధ నలకు విరుద్ధమన్నారు. ఇటీవల జరిగిన విచార ణలో ఈ వ్యాజ్యాలపై వాదనలు పూర్తి .

# తిరుమల సమాచారం

## పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రికి రూ.90లక్షలు విలువైన వైద్యపరికరాలు



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని పద్మావతిచిన్నపిల్లల హృదయాలయానికి అవసరమైన అత్యాధునిక వైద్యపరికరాలను ఓ దాత భూరీమొత్తంలో విరాళాల రూపంలో అందించారు. సుమారు 90లక్షలు రూపాయలు విలువైన ఈ వైద్యపరికరాలను శనివారం తిరుపతి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ద్వారా ఆస్పత్రికి అందజేశారు. ముంబైకి చెందిన ఆల్కెమ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధురిమసింగ్ 90లక్షలు రూపాయలు విలువైన హైఎండ్‌వెంటిలేటర్లు నాలుగు, పేషెంట్‌మానిటర్లు,హ్యూమిడిఫయర్లు, హెచ్‌ఎఫ్‌ఎన్‌సి నాలుగు పరికరాలు ఉన్నాయి. చిన్నపిల్లల హృదయ చికిత్సలకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి అవసరమైన పరికరాలను విరాళంగా అందించడం అభినందనీయం. ఈ సందర్భంగా దాత మధురిమసింగ్‌ను టిటిడి జెఇఒ డాక్టర్ శరత్, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాధరెడ్డి, ఆర్ఎంఒ డాక్టర్ భరత్, ఆల్కెమ్ ఫౌండేషన ప్రతినిధులు శ్రీవారి మెమోంటోతో సత్కరించారు.

## బంగారు, వెండి ధరల వ్యత్యాసాల ఎఫెక్ట్ !

**తిరుమలలో బంగారు,వెండి డాలర్లు అమ్మకాలు తాత్కాలిక నిలుపుదల నష్టాల నివారణకు అమ్మకాల్లో మార్పులపై టిటిడి కసరత్తు**

**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులు ఎంతో పవిత్రంగా, భక్తితో కొనుగోలుచేసి ధరించే బంగారు,వెండి డాలర్ల విక్రయాలను మార్కెట్‌లో వాటి ధరల హెచ్చుతగ్గుల (వ్యత్యాసాల)ప్రభావంతో తిరుమలలో వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదలచేసింది. జనవరి 28వతేదీ నుండి ఫిబ్రవరి 3వతేదీ వరకు పూర్తిగా ఈ కౌంటర్లను టిటిడి మూసివేసింది. బహిరంగ మార్కెట్‌లో గత కొంతకాలంగా బంగారు,వెండి ధరలు అనూహ్యంగా పెరిగినా, తగ్గినా ఆ ప్రభావం శ్రీవారి భక్తులపై పడకుండా టిటిడి అధికారులు వారానికి ఒక్కరోజుమాత్రమే ఈ ధరల్లో మార్పు చేసి భక్తులకు విక్రయిస్తున్నారు. తిరుమలలో భక్తులకు 5,10గ్రాముల బంగారు డాలర్లుతోబాటు 5,10,50గ్రాముల వెండి డాలర్లను అమ్మకాలు చేస్తున్నారు. గత కొన్నేళ్ళుగా బంగారు 2గ్రాముల డాలర్లు అమ్మకాలను టిటిడి పూర్తిగా నిలుపుదలచేసింది. ఇప్పుడు 5,10గ్రాముల బంగారుడాలర్లు మాత్రమే అమ్మకాలు చేస్తుంది. ఇదీ కూడా ఫిబ్రవరి 3వతేదీవరకు పూర్తిగా నిలిపివేసింది. బయట మార్కెట్ ధరకంటే తిరుమలలో తక్కువ ధరకే శ్రీవారి డాలర్లు అందుబాటులో ఉండటంతో భారీగా అమ్మకాలు జరిగాయి. ఈ విషయాన్ని టిటిడి అధికారులు గుర్తించారు.దీంతో టిటిడిపై భారం పడింది. ఈ నష్టాన్ని అధిగమించేందుకు టిటిడి అధికారులుకీలక నిర్ణయం తీసుకుని ఆలయం ముందున్న కౌంటర్‌ను తాత్కాలికంగా మూసివేసింది. అంతేగాక ఇకపై శ్రీవారి దర్శనం చేసుకున్నట్లు టిక్కెట్ కలిగిన భక్తులకే స్వామివారి బంగారు,వెండి డాలర్లు విక్రయించాలని కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌లో బంగారు ధరలు రోజుకురోజుకూ పెరుగుతుండటంతో పెద్దమొత్తంలో డాలర్లు కొనుగోలును కూడా రద్దుచేయాలని నిర్ణయించారు.

## హిందూ ధర్మానికి పెద్దపీట!

**'గోవిందకోటి' రాస్తే విఐపి బ్రేక్ దర్శనంపై మరింత అవగాహన**






**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మానికి మరింత పెద్దపీట వేయడంలో భాగంగా చిన్నతనంనుండే యువ తలో అవగాహన కల్పించడంతోబాటు భక్తిభావం పెం పొందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం చొరవ తీసు కుం టోంది. ఇందులో భాగంగా రామకోటి తరహాలో యువత "గోవింద కోటి"రాస్తే ఆ భక్తుడితోబాటు ,వారి కుటుంబసభ్యులు ఐదుగురికి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తున్న విషయంపై మరింతగా విస్తృత ప్రచారం చేసేదిశగా కార్యాచరణ అమలుచేస్తున్నారు. ఈ విధానం 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి బోర్డు తీసుకున్న ఈ మంచినిర్ణయంపై భక్తుల్లో ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రస్తుత పాలకమండలి, టిటిడి అధికారులు సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. టిటిడి ప్రత్యేక పుస్తకాలు ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుత టిటిడి పాలకమండలి కూడా హిందూ సనాతన ధర్మవ్యాప్తికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న "గోవిందకోటి"రాయడం వల్ల యువతలో భక్తిభావం పెంపొందింపజేసేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. 25ఏళ్ళ లోపు యువత "గోవిందకోటి"రాస్తే వారి కుటుంబసభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించేందుకు సుముఖంగానే ఉన్నారు. 10,01,116సార్లు గోవిందనామాలు రాసిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా మంచి దృక్పథంతో ఉన్నారు.తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ప్రశస్త్యాన్ని, భక్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని, తిరుమలలో గోవింద నామం తప్ప మరేతర పదం వినిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఇప్పటికే స్పష్టంగా తెలిపారు. అదే ఆశయంతో పాలకమండలి కూడా అడుగులేస్తోంది.

## ఆర్యవైశ్యుల్లో 95 శాతం కూటమి ప్రభుత్వం, ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు

**తాడిపత్రిఅర్బన్, జనవరి 31 ప్రభాతవార్త** ఆర్యవైశ్యుల్లో 95 శాతం మంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని వారి మద్దతుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటైందని రాష్ట్ర పరిశ్రమలశాఖామంత్రి, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టిజి భరత్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 32 అడుగుల వాసవిమాత మండపాన్ని ఏర్పాటు చేసి అందులో 12 అడుగుల వాసవిమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం వాసవిమాత మండపం ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి టిజి భరత్ ముఖ్యఅతిథిగా హాజరై తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రికి నాలుగు వైపులా రహదారులు వున్నాయని రహదారుల సర్కిళ్లలో దేవుని విగ్రహాలు ఏర్పాటు చేసి టెంపుల్ సిటీగా మార్చాలన్న ఆలోచనలను అనుగుణంగా అనంతపురం రోడ్డులో ధ్యాన శివుని విగ్రహం, బుగ్గ వద్ద సత్యసాయిబాబా సింబల్ ఏర్పాటు చేశామన్నారు. కడప రోడ్డులో ఆర్యవైశ్యులు ముందుకు వచ్చి వాసవిమాత విగ్రహం, మండపం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. అత్యంత సుందరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అందరిని కలుపుకుని తాడిపత్రిని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్‌ఛైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కులాలకు అతీతంగా పనిచేసే వారికే తాడిపత్రిలో పట్టం కడతామన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన భూమా నాగరాగిణి విద్యావంతురాలని గుర్తించి ఆమెను మార్కెట్‌యార్డుఛైర్‌పర్సన్‌గా నియమించడం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులు తమకు మద్దతు ఇవ్వకపోతే తాము ఇన్ని సంవత్సరాలు విజయం సాధించలేమని పేర్కొన్నారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ పట్టణంలోని అమ్మవారిశాల వంద సంవత్సరాల క్రితమే అద్భుతంగా నిర్మించారని చాలా బాగుందన్నారు, ఆర్యవైశ్యులు ఎన్‌డిఏకు ఇస్తున్న మద్దతును చంద్రబాబునాయుడు గుర్తించి ప్రాధాన్యత ఇచ్చారన్నారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు, (నెల్లూరు) జనవరి31ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ,పూలాంగి సేవ నిర్వహించారు.ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్చరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్,సిబ్బంది పులగల నరసింహా, వెంకటసుబ్బయ్య, పెంచల స్వామి, కోండల రావు.

# చెరకు పంట విస్తీర్ణం పెంచడానికి చర్యలు

**ప్రభుత్వం ద్వారా సహకారం అందించడానికి కృషి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, జనవరి 31 (ప్రభాతవార్త ప్రతినిధి ) :** చెరకు పండించే రైతులకు అవగాహన కలిగించి, చెరకు విస్తీర్ణాన్ని పెంచడానికి కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గతంలో చెక్కర కర్మాగారాలు పని చేసేటప్పుడు జిల్లాలో విరివిగా పండించేవారని, తిరిగి ఆ ప్రాంతాల్లో రైతులంతా చెరకు పండించేలా అవగాహన కలిగించవలసిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయ పడ్డారు. రైతుకు చెరకు సాగు వలన నష్టం జరగదు అనే భరోసా లభిస్తే ముందుకు వస్తారని, అందుకోసం చర్యలు తీసుకుంటామని అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి చెరకు సాగు, రైతుల పరిస్థితుల పై సంకిలి చెక్కర కర్మాగారం ప్రతినిధులు, చెరకు పండించే ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకిలి కర్మాగారం ఈ ఏడాది మూసివేస్తారనే వదంతులు వచ్చాయని, అది ఉత్తరాంధ్రకు భారీ నష్టమని , ఆ ఫ్యాక్టరీ కొనసాగాలంటే చెరకు ఉత్పత్తి పెరగవలసిన అవసరం ఉందని అన్నారు. రైతులకు అవగాహన కలిగించి ఈ ఏడాది 4 లక్షల టన్నుల వరకు కర్మాగారానికి వచ్చేలా కృషి చేస్తామని కర్మాగారం నుండి అందించవలసిన ఇన్పుట్స్ అందించాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టి కి చెరకు రైతుల పరిస్థితుల్ని తీసుకువెళ్ళి ప్రభుత్వం నుండి సహకారం అందేలా కృషి చేస్తానని తెలిపారు. సంకిలి కర్మాగారం ప్రతినిధులు మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో చెరకు సాగు క్రమంగా తగ్గుతూ వస్తోందని, చెరకు నిర్వహణా వ్యయం అధికంగా ఉంటోందని, చేతికి డబ్బులు వచ్చే సరికి ఏడాది పాటు ఎదురు చూడవలసి వస్తోందని, రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే మొక్క జొన్న, ఆయిల్ పామ్ వంటి పంటల వైపు మరలుతున్నారని వివరించారు. తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల్లో డి.బి.టి ద్వారా రైతులకు ప్రభుత్వం నగదు జమ చేస్తోందని,మన రాష్ట్రం లో కూడా ఆ విధంగా ప్రోత్సహిస్తే రైతులు ముందుకు వస్తారని వివరించారు. మంచి విత్తనం, సబ్సిడీ, రుణాలు, రవాణా, లేబర్ తదితర సౌకర్యాలు కల్పించవలసి ఉందని తెలిపారు. చెరకు వాతావరణ పరిస్థితుల్ని తట్టుకొని నిలిచే పంట కనుక అన్ని విధాలుగా ప్రభుత్వం నుండి రైతుకు సహకారం అందిస్తే ముందుకు వస్తారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుండి రైతుకు కొంత సహాయం అందించేవారని, దానిని నిలిపివేయడం వల్లనే రైతు ఆసక్తి చూపడం లేదని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం కలిసి చర్చించుకొని, రైతుకు సహకారం అందిస్తేనే చెరకు రైతుకు మేలు జరుగుతుందని, అప్పుడే ఫ్యాక్టరీ ని నిలబెట్టుకోగలమని అన్నారు.

# కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త -వైద్యం** భారీగా తరలివచ్చిన భక్తజనం రథయాత్రను ప్రారంభించిన విపిఆర్ దంపతులు దైవ చింతనతోనే సన్మార్గం సాధ్యం ప్రతి ఇంట్లో భగవద్గీత వినిపించాలి ఇస్కాన్ అంతర్జాతీయ స్థాయిలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తోంది దైవ చింతనతో మన చింతలన్నీ మాయం అవుతాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మ అన్నారు. శనివారం సాయంత్రం నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ సమీపం నుంచి 13వ జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరు ఇస్కాన్ ప్రతినిధి సుఖదేవ్ స్వామితో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. జగన్నాథ రథయాత్రకు వేమిరెడ్డి దంపతులు 6 లక్షల విరాళం అందించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. దేవుడిని ప్రజల వద్దకు చేర్చేలా ఈ రథయాత్రను ఇస్కాన్ సంస్థ నిర్వహిస్తోందన్నారు. గత ఏడాది రథయాత్రలో పాల్గొనలేకపోయానని, ఈ సారి అవకాశం వచ్చిందన్నారు. 1966లో ఏర్పాటు అయిన ఇస్కాన్ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నిరుపేదలకు ఉచితంగా భోజనం కూడా అందిస్తోందని చెప్పారు. భగవద్గీతను ప్రతి ఇంటికి చేర్చేలా వారు చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదివి ఆచరించాలని సూచించారు. ఈ రథయాత్రలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. ఇస్కాన్ సంస్థ చేపట్టిన 13వ జగన్నాథ రథయాత్రలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. భగవంతుడి కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. ఇస్కాన్ సంస్థ అక్షయపాత్ర ద్వారా ఎంతో మంది ఆకలి తీర్చుతోందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు టౌన్ ఎస్‌పీ దీక్ష, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, గుడి హరిరెడ్డి, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణతా అభియాన్-2ను విజయవంతం చేయాలి : కలెక్టర్ లక్ష్మీశా



సంపూర్ణతా అభియాన్ ప్రతిజ్ఞచేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

**విజయవాడ, జనవరి 31, ప్రభాతవార్త :** సంపూర్ణతా అభియాన్ మొదటి దశను విజయవంతం చేసినట్లే రెండవదశను జయప్రదం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషిచేయాలని ఎన్టిఆర్ జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని యంపిడిఓ కార్యాలయంలో శనివారం సంపూర్ణతా అభియాన్-2 కార్యక్రమాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాకులు అయిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో తొలిదశలో ఆరుసూచికల్లోనూ నూరుశాతం ప్రగతి సాధించాయని ఇప్పుడు మరో ఆరు సూచికల్లో వందశాతం లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమం ఫిబ్రవరి నుండి ఏప్రియల్ వరకు కొనసాగుతుందన్నారు. పిల్లలకు పోషకాహారం ఇవ్వటం, పిల్లల ఎదుగుదల, అంగన్వాడి కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించటం ఆవాలను అంకాల్లో నూరుశాతం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యాశాఖకు సంబంధించి అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించటం, పశువులకు నోటిపూత నివారణకు టీకాలు వేయించటంలో నూరుశాతం లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మనదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోడీ కృషిచేస్తున్నారని, ఇదే రీతిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ 2047 ఆవిష్కరించారని చెప్పారు. అభివృద్ధికి సంబంధించి లోపాలను గుర్తించి వాటిని సరిచేయటమే ఆకాంక్షిత బ్లాకుల ముఖ్యఉద్దేశ్యమని పేర్కొన్నారు. అమృత్-2 ద్వారా త్వరలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా పలు స్టాళ్ళు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో యంపిపి పాలడుగు జ్యోతి, విజయవాడ ఆర్డిఓ కావూరి చైతన్య, డిఈఓ ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సంపూర్ణతా అభియాన్‌ను విజయవంతం చేసేందుకు కృషిచేస్తామన్నారు.

# అమరజీవి, విద్యా ప్రదాత చుండూరు వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం - ఘనంగా 45వ సంస్మరణ సభ

**ఇంద్రకీలాద్రి, జనవరి 31, ప్రభాతవార్త :** ఘనంగా 45వ సంస్మరణ సభ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మహిళలకు వస్త్ర వితరధర్మదాత, విద్యా ప్రధాత, అపర కర్ణుడు శ్రీ చుండూరు వెంకట రెడ్డి (సి.వి. రెడ్డి) గారి 45వ సంస్మరణ సభ శనివారం విజయవాడలోని సి.వి. రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) అధ్యక్షత వహించగా, ఆలయ ఈవో శీనా నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో శాస్త్రోక్తంగా దేవస్థానం అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సి.వి. రెడ్డి గారి విగ్రహానికి చైర్మన్, ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆలయ చైర్మన్ ప్రసంగిస్తూ "మనిషి మరణించినా ఆయన చేసే ధర్మం బ్రతికే ఉంటుంది" అనడానికి చుండూరు వెంకట రెడ్డి గారు ఒక నిలువెత్తు నిదర్శనం. ఆయన ఒక వ్యక్తి కాదు, విజయవాడ గడ్డపై మొలిచిన ఒక సేవా వృక్షం అన్నారు. .ఆలయ ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ సి.వి. రెడ్డి తన సంపాదనను తన కుటుంబం కోసం దాచుకోకుండా, సమాజం కోసం ఖిట్రస్ట్‌ఖి రూపంలో ధారపోశారు. స్వార్థం లేని సేవ చేయడం వల్లే, ఆయన మరణించి 45 ఏళ్లు దాటినా, నేటికీ ప్రభుత్వం, దేవస్థానం ఆయనకు అధికారికంగా సంస్మరణ సభలు నిర్వహిస్తున్నారని, సివి రెడ్డి వలే విద్యార్థులు ఎదిగి దాన గుణం అలవర్చుకొని సమాజానికి మేలు చేయాలన్నారు. ఎఇఓ డా కె. గంగాధర్, ధర్మకర్తలమండలి సభ్యుడు బి. ధర్మారావు చుండూరు వెంకట రెడ్డి సేవా దృక్పథాన్ని శ్లాఘించారు. ఈ సందర్భంగా వేద పాఠశాల విద్యార్థులకు మరియు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం ఉపకార వేతనాలను , పేద మహిళలకు చీరలను ఇఓ, చైర్మన్ పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు, అతిథులకు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

- ఘనంగా ఉద్యోగుల పదవీ విరమణ:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి పై సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల వీడ్కోలు సభ శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొని రిటైర్ అవుతున్న సహచర ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. భక్తుల సేవలో తరించడం వీరి అదృష్టమని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బండారు రాంబాబు అన్నారు. పదవీ విరమణ పొందుతున్న పి. ప్రసాద్ (డ్రైవర్) మరియు ఎం. ఆదిలక్ష్మి (రికార్డ్ అసిస్టెంట్) ల సేవలను కొనియాడారు.లోకమాత కనకదుర్గమ్మ సన్నిధిలో దశాబ్దాల కాలం పాటు విధులు నిర్వహించడం వారి పూర్వజన్మ సుకృతమన్నారు.

సకల కళలకు మూలమై, వాగ్దేవిగా కొలువబడే ఆ శ్రీ కనకదుర్గమ్మ వారి ముంగిట శనివారం సాయంత్రం కూచిపూడి నృత్య వైభవం ఆవిష్కృతమైంది. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని "ధర్మపథం" కళావేదికపై సాయంత్రం విజయవాడకు చెందిన ప్రముఖ నృత్య గురువు శ్రీమతి ఎం. అనూష నాయుడు ఆధ్వర్యంలో వారి శిష్యబృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. "భామా కలాపం", గణపతి కౌత్వం, అయిగిరి నందిని, మండూక శబ్దం, తరంగం (కంచు పళ్లెం నృత్యం) కూచిపూడికే ప్రత్యేకమైన కంచు పళ్లెం అంచుపై నిలబడి, తలపై కలశాన్ని ఉంచుకుని సమతుల్యతతో విద్యార్థులు చేసిన నృత్యం భక్తులను అబ్బురపరిచింది. కార్యక్రమం అనంతరంగురువును, కళాకారులను దుశ్శాలువాలతో సత్కరించి, అమ్మవారి శేషవస్త్రం మరియు ప్రసాదాలను అందజేశారు.


చుండూరు వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఇఓ, చైర్మన్

- ఫిబ్రవరి 1న ఇంద్రకీలాద్రిపై పౌర్ణమి గిరి ప్రదక్షిణ:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2026 (ఆదివారం) మాఘ పౌర్ణమి పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఖిగిరి ప్రదక్షిణ నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 5:55 గంటలకు ఘాట్ రోడ్డు ప్రారంభంలో ఉన్న టోల్‌గేట్ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమై కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, సితార జంక్షన్, మిల్క్ ప్రాజెక్ట్, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంటుందన్నారు. భక్తులు విశేషంగా పాల్గొనిఇ శ్రీ స్వామి అమ్మవార్ల అనుగ్రహం పొందాలన్నారు.

# దత్త క్రియాయోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి

**అనంతపురం, జనవరి 31, (ప్రభాతవార్త బ్యూరో)** ఆధునిక ప్రపంచంలో ప్రజలందరూ క్షేమంగాఆరోగ్యంగా ఉండాలంటే దత్త క్రియ యోగ చేయడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి మనిషి ప్రతిరోజు ప్రతినిత్యం యోగా సాధన ద్వారా మంచి జరుగుతుందని ఆరోగ్యంగా ఉంటారని అలా జరగాలన్న లక్ష్యంతోనే దత్త పీఠం ఆధ్వర్యంలో జయలక్ష్మి పురంలో దత్త క్రియాయోగ తరగతులను నిర్వహించడం జరిగిందని దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు .తల్లికి మించిన దైవం లేదని తాను జయలక్ష్మి మాత ఆశీర్వాదం వల్లనే ఆమె అద్భుతమైన శివ భక్తురాలు కావడం వల్ల ఆ మహిమలతో తనకు ఈ శక్తి లభించిందని అమ్మవారిని స్వామీజీ గుర్తు చేసుకున్నారు .తన శక్తి అంతా తన తల్లి జయలక్ష్మి మాతాదే అని అన్నారు.రాప్తాడు మండలం బొమ్మపర్తి జయలక్ష్మి పురం గ్రామంలో దత్త పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న దత్త క్రియాయోగ తరగతులు ముగింపు సమావేశం శనివారం జరిగింది .ఈ సమావేశంలో మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీ విజయానంద తీర్థ స్వామీజీ పాల్గొన్నారు .ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రపంచ శాంతి ఆరోగ్యం కొరకు గత 40 సంవత్సరాలకు పైగా దత్త పీఠం ఆధ్వర్యంలో దత్తక్రియ యోగా తరగతులను నిర్వహించడం జరుగుతున్నదని అందులో భాగంగా ఈ ఏడాది జయలక్ష్మి పురంలో నిర్వహించడం జరుగుతుందని ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్నటువంటి అనేకమంది దత్తక్రియ యోగా తరగతుల్లో పాల్గొన్నారు అని స్వామీజీ తెలిపారు .ఇందులో ట్రైనింగ్ తీసుకున్నవారు ఆయా జిల్లాలలో ఆయా ప్రాంతాలలో నిత్యం దత్తక్రియ యోగా తరగతులు నిర్వహిస్తూ ప్రజల్ని పెద్ద ఎత్తున ఆరోగ్యవంతులు చేయడానికి యోగా తరగతులు నిర్వహించాలన్నదే దత్త పీఠం లక్ష్యమని అందుకోసమే తరగతులు నిర్వహించామని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. దత్త పీఠం ఆధ్వర్యంలో జయలక్ష్మి పురం అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గత రెండు రోజులు క్రితం దాదాపుగా 40 ఎకరాల్లో ఆయుర్వేదిక్ మొక్కలను నాటడం జరిగిందని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవులందరికీ మంచి చేయాలన్న లక్ష్యంతో ఆధ్యాత్మిక చింతన వైపు తీసుకురావాలన్న లక్ష్యంతో దత్త పీఠం పనిచేస్తుందని అన్ని వర్గాల ప్రజలు క్షేమం కోసం రైతుల క్షేమం కోసం యాగాలు పూజలు నిత్యం నిర్వహిస్తానే ఉంటామని అమ్మ జయలక్ష్మి పురం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని శ్రీ స్వామీజీ అన్నారు .దత్త క్రియా తరగతులు మూడు రోజులు ముగిసిన సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి దత్తపీఠం ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం స్వామీజీ దత్త క్రియాయోగ తరగతుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.కాగా జయలక్ష్మి మాత ఆరాధన ఉత్సవాలు రాప్తాడు మండలం బొమ్మపర్తి జయలక్ష్మి పురం లో ఆదివారం నిర్వహించిన తర్వాత దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ఇక్కడి నుంచి మైసూర్ కి వెళ్ళిపోతారని, ఆదివారం రోజు పేద ప్రజలకు అన్నదానము, వస్త్రధానము అమ్మ జయలక్ష్మి మాత పేరు మీద ప్రతి ఏడాది నిర్వహిస్తున్న విధంగానే ఈ ఏడాది నిర్వహిస్తారని నిర్వాహకులు చెబుతున్నారు.ఆదివారం ఉదయం జయలక్ష్మి మాత ఆరాధన ఉత్సవాలు, సాయంత్రం రథయాత్ర ఉంటుంది.జయలక్ష్మి మాత తిప్పోత్సవం కార్యక్రమం మొదటిసారిగా బొమ్మ పరిధిలో ప్రారంభిస్తున్నారు.



# త్వరలో కొత్త పింఛన్లు మంజూరు మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం (విజయనగరం జిల్లా), జనవరి 31 ప్రభాతవార్త : అర్హత ఉన్నవారికి కొత్త పింఛన్లను త్వరలో మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం ఆయన గజపతినగరం మండలం జిన్నాం గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతీ నెలా 1వ తేదీన పింఛన్లను పంపిణీ చేయడానికి గ్రామాలకు వెళ్లడమే కాకుండా, అక్కడి ప్రజల సమస్యలను కూడా తెలుసుకొనేందుకు దోహదపడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ప్రతీనెలా 1న పింఛన్ల పంపిణీ చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. త్వరలో కొత్త పింఛన్లను మంజూరు చేసి పేద కుటుంబాలకు ఆసరానివ్వనున్నామని తెలిపారు. సంప్రదాయ వరి పంట బదులు రెండో పంటగా ఉద్యాన పంటలు సాగు చేయాలని రైతులను మంత్రి కోరారు. దీనివల్ల రైతుకు ఆ దా య ం పె రు గు తుం ద ని అన్నారు. రైతును ఆదుకొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూత తనిస్తోందని చెప్పారు. అలాగే మహిళల ఆర్థికాభివృద్ధికి విరివిగా, అత్యంత సులువుగా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తున్నామని చెప్పారు. పనికోసం హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి మారిపోతుందన్నారు. జిల్లాలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి దూరదృష్టి వల్లే భోగాపురం విమానాశ్రయం సాకారమయ్యిందని, దీనివల్ల మన జిల్లా గణనీయమైన ప్రగతి సాధిస్తుందని మంత్రి అన్నారు. గ్రామంలోని 520 మంది పింఛన్ దారులకు రూ.22,15,500 పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62,94,844 మందికి, పింఛన్ క్రింద రూ.2724.10 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి శ్రీనివాసపాణి, మాజీ మంత్రి పడాల అరుణ, పలువురు కూటమి పార్టీల నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



# ఇహెచ్‌ఎస్ కమిటీలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు స్థానం

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీలో ఇద్దరు ఉద్యోగ సంఘాల అధ్యక్షులను ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వం స్థానం కల్పించింది.. ఈ మేరకు ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణ, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణలకు చోటు కల్పిస్తూ వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన అభ్యర్థనలు పరిశీలించిన అనంతరం వీరిని చేర్చింది. గతంలోనే ఈ కమిటీలో సభ్యులుగా ఏపీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరుకు చోటు కల్పించింది.తాజా ఉత్తర్వులో పేర్కొన్న ఆహ్వానితులు, ఈహెచ్‌ఎస్ కమిటీ సభ్యులతో సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. పథకం అమలు తీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ఉద్యోగులు, ప్రభుత్వం ద్వారా చెల్లించే సొమ్ము నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమ, ప్యాకేజీ ధరల పెంపు, విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కార్డుల మంజూరు, వార్షిక ఆరోగ్య తనిఖీలు, 25 దీర్ఘకాలిక వ్యాధులకు ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితి రూ.5 లక్షలకు పెంపు తదితర అంశాలు చర్చకు వాచ్చయి. వీటిని అమలు చేస్తే ఎంత ఖర్చవుతుందో వచ్చే సమావేశంలోగా కమిటీ ముందు ఉంచాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2017లో నిర్ణయించిన 1,850 ప్రొసీజర్ల టారిఫ్ ధరలు నేటికీ పెంచకపోవడం, బకాయిలు చెల్లించకపోవడం వల్ల పథకం అమలుకు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం పూర్తి సహకారం అందించట్లేదని పేర్కొన్నారు.

# ఫిబ్రవరి 2న బండ్లపల్లికి వైయస్ షర్మిల రాక: కాంగ్రెస్ నేతలు

**అనంతపురం, జనవరి 31 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లా సింగనమల మన్డల బండ్లపల్లి గ్రామానికి ఫిబ్రవరి రెండవ తేదీన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ ఫిబ్రవరి రెండో తేదీన అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. షర్మిల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నేతలు శనివారం అనంతపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. 2006లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని లాంఛనంగా నార్పల మండలం బండ్లపల్లి లో ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామాల్లో ఉపాధి లేక వర్షాలులేక పల్లెల నుంచి రైతులు పట్టణాలకు కూలీలుగా తరలిపోతూన్న విషయంతో పాటు దేశం లోనే అత్యల్ప వర్షాలు పడే అనంతపురం జిల్లా పరిస్థితులను పరిశీలించిన తర్వాత దేశవ్యాప్తంగా రైతులు, రైతు కూలీల వలసలు ఆపడం కోసం 2005సంవత్సరం ఆగస్టు 25వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా మన అనంతపురం జిల్లా సింగనమల మండలం బండ్లపల్లి నుంచి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభమై దాదాపు 20 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ విధంగా అయితే కాంగ్రెస్ పార్టీ స్థాపించిన పథకాలను అన్నిటికీ పేర్లు మార్చి ఆ పథకాలను తాను ప్రవేశపెట్టినట్లు ప్రచారాలు చేసుకుంటూ ఆయా పథకాలను నిర్వీరం చేస్తుందన్నారు. అందులో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి రైతులను రైతు కూలీలను మరోసారి బిచ్చగాళ్లుగా చేయుటకు బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి పథకాన్ని నామరూపాలు లేకుండా చేయడం కోసం చేస్తున్నటువంటి ఈ కార్యక్రమాన్ని జాతీయ కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి ఖండిస్తూ రాహుల్ గాంధీ మహాత్మ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చకుండా గతంలో ఏ విధంగా ఉండేదో అదే విధంగా ఉపాధి హామీ విధానాలు ఉండేలా చేయాలని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తూ చేస్తున్నటువంటి నిరసన కార్యక్రమాలలో భాగంగా ఫిబ్రవరి 2వతేదిన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లపల్లి గ్రామానికి ఎపిసిసి చీఫ్ షర్మిల వస్తున్నారు. కాబట్టి అక్కడ జరిగే కార్యక్రమాలకుజిల్లా ప్రజలు రైతులు కార్మిక కర్షకులు పార్టీలకతీతంగా ప్రజాసంఘాలకతీతంగా అందరూ పాల్గొనాలని అదేవిధంగా రైతులు అధికంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

# సముద్రంలో వృధాగా పోయే నీటినే పోలవరం లింక్ ప్రాజెక్ట్‌కు వినియోగిస్తాం: ఎపిఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు

**విజయవాడ,జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీకి చట్టబద్ధంగా రావాల్సి జలాల విషయంలో తెలంగాణా అభ్యంతరాల సరైనవి కావని ఏపీ ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు.ఏపీ, తెలంగాణ ఇరిగేషన్ అధికారులతో సీడబ్ల్యూసీ చైర్మన్ సమక్షంలో తెలుగు రాష్ట్రాల మొదటి జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసిందని ఏపీ ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సీడబ్ల్యూసీ తమ నివేదికను పీపీటీ రూపంలో కేంద్ర జల సంఘం అధికారులు ప్రెజెంటేషన్ చేశారని వెల్లడించారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల మొదటి జల వివాదల కమిటీ సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని ఏపీ ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు శనివారం మీడియాకు వెల్లడించారు ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన అజెండాను పీపీటీ రూపంలో కేంద్ర జలసంఘం అధికారులు వివరించారని తెలిపారు. తెలంగాణ అధికారులు ఎలాంటి అజెండా ఇవ్వనందున.. వారినే సీడబ్ల్యూసీ చైర్మన్ వివరించమని చెప్పారని పేర్కొన్నారు. పోలవరం లింక్ ప్రాజెక్ట్‌కు వరద జలాలతో వినియోగించుకునేలా ఎలా అనుమతులు ఇస్తారంటూ తెలంగాణ ప్రతినిధులు ప్రశ్నించారని అన్నారు. ఎగువ రాష్ట్రాలు వారి హక్కుల ప్రకారం వినియోగించుకున్న తర్వాతే.. పోలవరం నుంచి సముద్రంలో వృథాగా కలిసిపోయే మిగులు జలాలతోనే రూపొందించామని ఏపీ అధికారులు స్పష్టం చేశారని తెలిపారు. వృథాగా పోయే జలాలను ఏపీ వినియోగించుకుంటే తప్పేంటని తెలంగాణ ప్రతినిధులను సీడబ్ల్యూసీ చైర్మన్ ప్రశ్నించారని అన్నారు. ఏపీ అంగీకారం లేకుండా కాళేశ్వరం, సీతారామ సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినప్పుడు లేని వివాదం, ఇప్పుడు లింక్ ప్రాజెక్ట్ విషయంలో ఎందుకని ఏపీ అధికారులు ప్రశ్నించారని తెలిపారు. ప్రస్తుత కేటాయింపులు 66:34 నిష్పత్తికి బదులుగా 50:50 నిష్పత్తిలో కృష్ణా జలాలను ఈఏడాది నుంచే పంచాలని తెలంగాణ ప్రతినిధులు కోరారని అన్నారు. ఇది కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్, అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండటంతో సాధ్యం కాదని ఏపీ అధికారులు చెప్పారని తెలిపారు. వారం గడువు ఇస్తే తమ అజెండాను సీడబ్ల్యూసీకి నివేదిస్తామని తెలంగాణ ప్రతినిధులు చెప్పారని ఏపీ ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

# కొత్తగా 38 ప్రైవేటు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతి

## - ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి నిధుల విడుదల

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 38 ప్రైవేటు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ప్రైవేటు కళాశాలల ఏర్పాటుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రకటన విడుదల చేస్తుంది. 26 మండలాల్లో 32, రెండు పురపాలికల్లో 6 కళాశాలల ఏర్పాటుకు ప్రబుత్వం అనుమతించింది. వచ్చే విద్యా సంవత్సరం 2026-27 నుంచి వీటిని ప్రారంభించేందుకు అనుమతిస్తూ , తదుపరి చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడిట్ విద్యామండలి కార్యదర్శి ఆదేశించింది.విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు నిర్వహించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలు నిర్వహించేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లించాల్సిన వ్యయాన్ని నిర్ధారించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ఇక ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గతంలో ఇచ్చిన పరిపాలన అనుమతులను సవరించింది.

# రోతవ్యాఖ్యల అంబటిని కఠినంగా శిక్షించాలి

## : ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**గన్నవరం(కృష్ణా), జనవరి 31, ప్రభాతవార్త :** రోతవ్యాఖ్యలతో రాజకీయలను భ్రష్టుపట్టిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబును తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ రాష్ట్ర డిజిపిని కోరారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై శనివారం అంబటి చేసిన బూతు వ్యాఖ్యలను యార్లగడ్డ తీవ్రంగా ఖండించారు. సభ్యసమాజం తలదించుకునేలా అసభ్య పదజాలంతో ముఖ్యమంత్రిని దూషించటం ఏమాత్రం క్షమార్హం కాదన్నారు. అంబటి అన్నమే తింటున్నాడా లేక గడ్డి తింటున్నాడా అని అనుమానం వ్యక్తం చేసారు. పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్న ఇటువంటి నాయకుల వల్ల రాజకీయాలు అంటేనే ప్రజలకు విరక్తి కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారంలో ఉన్న ఐదేళ్ళు బూతులతో ప్రజల సహనానికి పరీక్ష పెట్టారని, దీంతో వీరి పట్ల విరక్తి చెందిన ప్రజలు కనీసం ప్రతిపక్షహోదా కూడా ఇవ్వలేదని గుర్తు చేసారు. వైసిపి నాయకులు తమనోటిని అదుపులో పెట్టుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవటంతోపాటు, తగిన మూల్యం చెల్లించక తప్పదని యార్లగడ్డ హెచ్చరించారు. రోతవ్యాఖ్యలను కట్టడి చేసేలా కఠిన చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి సంస్కారహీనులను సంఘబహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. ఇటువంటి వారి విషయంలో పోలీసులు కఠిన వైఖరి అవలంబించాలని యార్లగడ్డ సూచించారు.

# ఎన్‌టిఆర్ జిల్లాలో పింఛన్‌లకు రూ.98.42కోట్లు పంపిణీ

**విజయవాడ, జనవరి 31, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ ద్వారా ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 2,27,933మంది లబ్దిదారులకు రూ.98.42 కోట్లు పంపిణీ చేయటం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడ 64వ డివిజన్ కండ్రికలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. వృద్దులు, విభిన్నప్రతిభావంతులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం పరీక్షల తేదీలు దగ్గర పడుతుండటంతో విద్యార్దులకు ప్రస్తుతం కీలక సమయమని విద్యార్దులు జగరూకతతో ఉంటూ ఇతర వ్యాపకాలను తగ్గించి చదువుపైనే దృష్టి సారించాలని కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యాబోధనను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్దులను పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను పరిశీలించారు.

## సామాజిక న్యాయం కోసం సాగే ప్రతి పోరులో గద్దర్ ఆత్మ

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** ప్రజాగాయకుడు, ప్రజా యుద్ధ నౌకగా పేరొందిన గద్దర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన ఆలోచనలు, ఆయన పాటలు, ఆయన ఆశయాలు ఇప్పటికీ మన మధ్య సజీవంగానే ఉన్నాయని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సామాజిక న్యాయం కోసం, సమానత్వం కోసం, మానవ గౌరవం కోసం సాగే ప్రతి పోరాటంలో గద్దర్ ఆత్మ కనిపిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గద్దర్ 78వ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులర్పించారు. గద్దర్ తన పాటల ద్వారా పీడిత ప్రజల హక్కుల కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు పోరాడారని, తన విప్లవాత్మక గళంతో ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పర్చారని గుర్తు చేసుకున్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గద్దర్ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డి సమర్థపాలనకు నిదర్శనం ఆర్థిక సర్వే నివేదిక

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31,ప్రభాతవార్త:** రాష్ట్రం అన్ని రంగాల్లో దూసు కెళుతున్నదని, ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే నివేదిక స్పష్టం చేసిందని, ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన దక్షతకు అద్దం పడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్, సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అనడానికి కేంద్ర ఆర్థిక సర్వే నివేదికనే సాక్ష్యమని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుచూపుతో అనుసరిస్తున్న విధానాలుగా రాష్ట్ర భవిష్యత్‌కు బాటలు వేస్తు న్నాయని చిన్నారెడ్డి అన్నారు. ఆయన దూరదృష్టి విధానాలు రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిపేందుకు దోహదం చేస్తాయని, ప్రణాళికాబద్ధంగా రూపొందించిన కార్యాచరణ సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పడానికి కేంద్ర ఆర్థిక సర్వే నిదర్శనమని అన్నారు. రెండేళ్ల కాలంలో తీసుకువచ్చిన భూభారతి డిజటల్ ప్లాన్‌తో భూరికార్డులు పక్కాగా ఉంటున్నాయని, పట్టణాలు, గ్రామాల్లో భూ వివాదాలు తగ్గాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపేందుకు సిఎం రేవంత్‌రెడ్డి సమర్థపాలన దేశానికి దిక్సూచిగా మారుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



పోలీసులు పట్టుకున్న వెండి ఆభరణాలు

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు కిలోల వెండి ఆభరణాలు పట్టివేత

**సిరిసిల్ల బ్యూరో, జనవరి 31, ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు జంక్షన్ వద్ద రెండు కిలోలకు పైగా వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్ పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా టిఎస్ 08 ఎఎస్ 6726 అనే నంబర్ కారును పోలీస్‌లు ఆపి తనిఖీ చేయగా వెండి ఆభరణాలు లబించాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన తోగిటి సత్యనారాయణ తన కారులో లెక్కలో లేని అనుమానస్పద 2.942 కిలోల వెండి పట్టగోలుసులు తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ వెండి ఆభరణాలను ఎస్ఎస్‌టి ఇన్‌చార్జి జి ఆనంద్, ఎపిఓ సమక్షంలో స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నామని పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు లు, మద్యం, ఇతర విలువైన వస్తువులను తీసుకుని వెళుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలి గించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.



## సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోనే ప్రతిష్ఠించాలి

### లేకుంటే 11న సిఎం ఇంటిని ముట్టడిస్తాం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల హెచ్చరిక

**హైదరాబాద్,జనవరి 31,ప్రభాతవార్త:** గిరిజన బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోనే ప్రతిష్ఠించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఫిబ్రవరి 10లోపు లంబాడీ ప్రజాప్రతినిధులతో చర్చించాలని, లేనిపక్షంలో 11న సిఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తామని తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్ర మోతిలాల్ నాయక్ అధ్యక్షతన 'సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని మద్దిమడుగులో పెట్టొద్దు- హైదరాబాద్ లో ప్రతిష్టించాలి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీమంత్రి, ఎఐబిఎస్ఎస్ మాజీ జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్, సేవాలాల్ బంజారా సంఘం మహిళా అధ్యక్షురాలు సక్రిబాయి, సరితబాయి, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు అభిరామ్ నాయక్. ఏఐబిఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ నంగార బేరి లంబాడి హక్కుల పోరాట సమితి గణేష్ నాయక్ తదితర గిరిజన సంఘాల నేతలు హాజరై, మాట్లాడారు. సేవాలాల్ విగ్రహాన్ని బంజారాహిహిల్స్ లోని ఒక్క ఎకరం స్థలంలో ఏర్పాటుచేయాలని కోరారు. దేవరకొండలోని మద్దిమడుగులో ఏర్పాటు చేస్తే బంజారా జాతిని అవమానపరిచినట్టేనన్నారు. సేవాలాల్ మహారాజ్ బంజారా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో 300 సీట్లకు కేవలం 5 కేటాయించడం పట్ల షెడ్యూల్ తెగలపై ప్రభుత్వానికి నిరక్ష్యాన్లికి నిదర్శనమని మండిపడ్డారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు వెంకట్ బంజారా, ఓయు జెఎసి నేతలు సంపత్నాయక్ రవి నాయక్, సేవాలాల్ నేతలు రాంబాబునాయక్, హుస్సేన్ నాయక్, భరత్‌చౌహాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి టెండర్లలో అవకతవకలు!

### నిర్ధారణకు వచ్చిన కేంద్ర నిపుణుల బృందం

### సిబిఐ దర్యాప్తునకు బొగ్గు మంత్రిత్వ శాఖ సిఫార్సు?

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** వివాదాస్పదమైన సింగరేణి కాలరీస్‌కి చెందిన నైని కోల్ బ్లాక్ టెండర్లలో అవసకతవకలు జరిగినట్లు కేంద్ర నిపుణుల బృందం నిర్ధారణకు వచ్చినట్లు తెలియవచ్చింది. నైని బొగ్గు గని టెండర్ల విషయంలో పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో వాటిపై విచారించేందుకు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఇద్దరు సభ్యులతో కూడిన టెక్నికల్ కమిటీని నియమించింది. ఈ కేంద్ర దర్యాప్తు బృందంలో బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, ఆ శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ కేంద్ర బృందం ఇటీవల సింగరేణి ప్రాంతంలో విచారణ చేసింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై వివరాలు సేకరించింది. టెండర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించింది. బొగ్గు గనుల టెండర్లకు సంబంధించి సింగరేణి అధికారులు తీసుకున్న చర్యలు, నిబంధనలు ప్రకారం జరిగాయా లేదా వంటి వివిధ అంశాలపై తీసింది. నిర్దిష్ట కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్పనిసరి సైట్ విజిట్ క్లాజులు వంటి కొత్త షరతులు ప్రవేశపెట్టబడ్డాయనేదానిపై లోతుగా అధ్యయనం చేసింది. ఈ విచారణలో మొత్తం టెండర్ల ప్రక్రియలో కొన్ని అవకతవకలను గమనించినట్లు విశ్వాసనీయవర్గాల ద్వారా తెలిసింది. టెండర్ల కేటాయింపులో పేర్కొన్న నియమాలను పాటించడంలో వైఫల్యం చెందడంతో పాటు కొన్ని నిబంధనల ఉల్లంఘనలను ఈ బృందం కనుగొన్నట్లు సమాచారం. టెండర్ల రద్దుకు గల కారణాలను బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. సైట్ సందర్శనను తప్పనిసరి చేయాలనే చర్య టెండర్లను ప్రభావితం చేసిందనే అంశాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. సింగరేణి యాజమాన్యం స్వీయప్రకటన నిబంధనను పాటించడంలో విఫలమైందని, మరియు బిడ్డర్లు సైట్ సందర్శన ధృవీకరణ పత్రాలను పొందాలని పట్టుబట్టడం వెనుక మతలబు జరిగినట్లు సాంకేతిక బృందం పరిశీలనలో వెలుగు చూసినట్లు తెలుస్తోంది. ఈ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడం ద్వారా, అటువంటి కంపెనీలు లేదా బిడ్డర్లు మాత్రమే బిడ్‌లను దాఖలు చేయడానికి అర్హులు అవుతారని కనుగొంది. వివిధ ప్రభుత్వ సంస్థలు తమ స్వీయ ధృవీకరణ ప్రాతిపదికన టెండర్లను దాఖలు చేయడానికి అనుమతించిన అనేక ఇతర కంపెనీలు తమ బిడ్‌లను దాఖలు చేయడానికి అర్హత పొందవనే దానిపై ఈ బృందం ఒక నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడవుతోంది. ఇదే సమయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యకలాపాల కింద సంస్థ చేసిన అవాంఛిత ఖర్చులను కూడా గమనించింది. సింగరేణి బోర్డు స్వయంప్రతిపత్తి హోదా కింద అధికారాలను వినియోగించుకుంటూ ఒక ప్రైవేట్ ఈవెంట్ కోసం కోట్ల రూపాయల మేర ఖర్చుకు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం చేసింది. వీటన్నింటి దృష్ట్యా కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఈ అవకతవకలపై సీబీఐ దర్యాప్తుకు సిఫార్సు చేసే ఆవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడవుతోంది. మరోపక్క బొగ్గు గని టెండర్ల వ్యవహారంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ ఇటీవల సీరియస్ కూడా అయింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలకమండలిలో ఎందుకు చర్చించలేదన్న ఇటీవల కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ సింగరేణి యాజమాన్యాన్ని నిలదీశారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడడం తగదు

### కలుషిత ఆహారంపై విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ స్కూల్స్, హాస్టల్స్, గురుకులాల్లో తరచుగా జరుగుతున్న కలుషిత ఆహారంపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సిపిఐఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడడం తగదని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, హాస్టళ్ళల్లో ఫుడ్ పాయిజనింగ్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం కొణిజర్ల మండల పరిధిలోని బోడియాతండా ప్రభుత్వ పాఠశాలలో 38 మంది, వనపర్తి జిల్లా కొత్తకోట ప్రభుత్వ బాలికల కళాశాలలో 30 మంది విద్యార్థులు కలుషిత ఆహారం వల్ల అస్వస్థతకు గురవ్వడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ నిరక్ష ్యం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని.. ఒక విచారణ కమిషన్ ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితమే హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లి, మాదాపూర్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్‌లో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం మరవకముందే .. ప్రస్తుతం ఖమ్మం, వనపర్తి జిల్లాల్లో చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుం దన్నారు. ఇది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో నిర్వహణలోపం, పర్యవేక్షణ కొరత, పరిశుభ్రత లోపం, కలుషిత నీరు వంటి కారణాలతో పాటు, ఉప్మారవ్వ, పులిసిపోయిన పెరుగు, కుళ్ళిపోయిన కూరగాయలు, నాసిరకం పప్పులు, ముక్కిపోయిన బియ్యం పెట్టడం వల్లనే ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పదేపదే జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలపై గతంలో హ్యూమన్‌రైట్స్ కమిషన్ తీవ్రంగా స్పందించినప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఆర్థిక భారం కూడా ఈ ఘటనకు ఒక ముఖ్య కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ హాస్టల్స్‌కు చెల్లించాల్సిన బిల్లులను పూర్తిగా చెల్లించాలని, ఘటనలకు కారణమవుతున్న అధికారులపై, కాంట్రాక్టు సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పర్యవేక్షణ లోపాలను సరిదిద్ది, ఆహార భద్రత ప్రోటోకాల్స్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

# సిసి కెమెరాల మధ్య ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

### రేపటి నుంచి 21 వరకు నిర్వహణ
### 5,26,192 మంది విద్యార్థులు
### 1,440 కేంద్రాలు ఏర్పాటు
### సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పర్యవేక్షణ
### ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేపటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల నడుమ నిర్వ హించనున్నారు. గత యేడాది వరకు కొన్ని కేంద్రాల్లోనే సీసీ కెమెరాలు ఉండగా.. ఈ ఏడాది సీసీ కెమెరాలు ఉన్న కాలేజీలకు మాత్రమే పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల నడుమ కొనసాగనున్నాయి. రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది విద్యార్థులు హాజరు కానుండగా.. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1440 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష నేపథ్యంలో శనివారం ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ జయప్రద బాయి, జాయింట్ సెక్రటరీ ఎగ్జామ్స్ మోహన్‌తోపాటు సీజీజీ అధికారులతో కలిసి నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఈ నెల 2 నుంచి 21 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నట్టు కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఎంపీసీ విద్యార్థులు 2,74,007 మంది, బైపీసీ విద్యార్థులు 1,33,415 మంది హాజరు కానుండగా.. ఒకేషనల్ విద్యార్థులు 1,18,770 మంది హాజరు కానున్నారు. మొత్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది హాజరు కానున్నారని.. వారి కోసం 1440 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించ నున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు 7,559 మంది ఎగ్జామినర్లను నియమిం చారు. వారిలో 1,814 మంది ప్రభుత్వ జూని యర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లను ఎగ్జా మినర్లుగా నియమించగా.. 3856 మంది ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పనిచేసే లెక్చరర్లను ఎగ్జామినర్లుగా నియమించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక అవార్డు

### రేపు ప్రదానం చేయనున్న సిఎం రేవంత్‌రెడ్డి


**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డుకు ఎంపిక అయిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుద ర్శన్‌రెడ్డికి ఈ అవార్డును సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదానం చేయ నున్నారని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, సిపిఐ అగ్రనేత రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ ఆవార్డును 2025 సంవత్సరానికిగానూ దేశంలో అనేక చారిత్రాత్మక తీర్పులను వెల్లువరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు చాడ వెంకట రెడ్డి తెలిపారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు అవార్డుకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం భుక్తి కోసమే కాకుండా 200 ఏళ్లకు పైగా సాగిన నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు సాగిన మహోత్తర పోరాటమని తెలిపారు. ఈ పోరాటం ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత్ దేశంలో విలీనమైందన్నారు.

ఆనాటి పోరాట యోధుల త్యాగాలను భావి తరాలకు అందిం చడమే లక్ష ్యంగా రావి నారాయణరెడ్డి తెలంగాణ అమరవీరుల ట్రస్ట్‌కు అంకురార్పణ చేశారన్నారు. ఆయన మరణానంతరం ఆ అశయాలను కొనసాగించడమే లక్ష ్యంగా తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో 1999లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ స్మారకోపన్యాసాలు నిర్వహిం చడంతో పాటు రావి నారాయణరెడ్డి పేరుతో జాతీయ ఆవార్డు ఇవ్వాలని నిర్ణయం తీసుకు న్నామని చెప్పారు.

అందులో భాగంగా 2000 సంవత్సరం నుంచి దేశంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి అవార్డును ట్రస్ట్ ప్రదానం చేస్తూ వస్తుందన్నారు. ఆర్థిక రంగ నిపుణులు బందోపాధ్యాయ, సిహెచ్. హనుమంతరావు, కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా, కేంద్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి చతురానన్ మిశ్రా, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శులు ఎ.బి.బర్ధన్, సురవరం సుధాకర్‌రెడ్డి, ప్రముఖ దర్శకులు శ్యామ్ బెనగల్ లాంటి ప్రముఖులకు రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డును ప్రధానం చేశామని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమం, కరోనా సమయంలో ఈ అవార్డులను ఇవ్వలేక పోయామని.. తిరిగి 2026లో ఈ అవార్డును పునరుద్దరించామని తెలిపారు.

# దండుపాళ్యం ముఠా తరహాలో కాంగ్రెస్ నాయకుల కుంభకోణాలు

### ప్రజల దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి కొత్త నాటకాలు
### బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పడి నుండి ఆ పార్టీ నాయకులు దండుపాళ్యం ముఠా తరహాలో కుంభ కోణాలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం సిద్దిపేటలోని రంగధాం పల్లి అమరవీరుల స్తూపం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం టెలిఫోన్ ట్యాపింగ్ పేరుతో బిఆర్ఎస్‌పై వేధింపులను ధారావాహిక సీరియల్ తరహాలో రెండేళ్ల నుండి కొన సాగిస్తున్నదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించి ప్రతిపక్ష నాయకులను వేధిస్తున్నాడన్నారు. అధికారంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే అంతా అలీబాబా 40 దొంగలు, దండుపాళ్యం ముఠా తరహాలోనే కుంభకోణాలు చేస్తున్నారని, బొగ్గు స్కాం, 9 వేల ఎకరాల భూస్కామ్, ఇలా అనేక స్కామ్‌లు చేశారని, వాటి నుండి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే ఈ నాటకాలు ఆడు తున్నారని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. ప్రతీకార వాంఛతో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఎలక్షన్ అఫిడవిట్‌లో హరీశ్‌రావు అడ్రస్ సిద్దిపేటలో ఉంటే హైదరాబాద్ ఇంటి అడ్రస్‌కు నోటీస్ ఇచ్చారని, కేసీఆర్‌కు మాత్రం హైదరా బాద్‌లో నోటీస్ ఇచ్చారన్నారు.

రేవంత్‌రెడ్డి ఇంటి అడ్రస్ కొడంగల్ అయితే గతంలో అధికారులు హైదరాబాద్‌లో నోటీస్ ఇచ్చారని, అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ వివక్ష చూపలేద న్నారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలు శిక్ష వేస్తారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజుతో పాటు తదితరులు ఉన్నారు.

# పరిశుభ్రతపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి: టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** పరిశుభ్రతపై సుప్రీం కోర్టు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిందని టిఎస్ యుటిఎఫ్ పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావరవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, ఉపాధ్యక్షురాలు సిహెచ్ దుర్గాభవాని, మహిళా విభాగం కన్వీనర్ ఆర్. శారద డిమాండ్ చేశారు. నెలసరి ఆరోగ్యం ప్రాథమిక హక్కుఅని, అది జీవించే హక్కు, విద్యాహక్కులో భాగమని సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమన్నారు. ఈ తీర్పు పట్ల తమ సంఘం హర్షం ప్రకటిస్తుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల పాలకులు అవలంబిస్తున్న నిరక్ష ్య వైఖరిని సుప్రీంకోర్టు తీర్పు తేటతెల్లం చేసిందని, ముఖ్యంగా పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక బాలికలు తగిన మోతాదులో నీళ్ళుకూడ తాగడం లేదని ఫలితంగా, ఋతుస్రావం సమయంలోనే కాకుండ ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీసే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొందన్నారు.

విద్యారంగం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామనే మాటలు కేవలం ప్రకటనల వరకేనని, నేటికి అనేక పాఠశాలల్లో బాల బాలికలకు ప్రత్యేక మరుగుదోడ్లు లేకపోవడం అంటే ప్రభుత్వాలకు అధికార యంత్రాంగానికి విద్యార్థుల ఆరోగ్య, పరిశుభ్రత పట్ల శ్రద్ధ లేకపోవడమేనన్నారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఆర్టికల్ 21, 21(ఎ) ప్రకారం తీర్పునివ్వడం ద్వారా ప్రభుత్వాలను బాధ్యులను చేసిందని గుర్తు చేశారు. టియస్‌యుటిఎఫ్‌గా గత కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఉచిత సానిటరీ ప్యాడ్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికి ప్రభుత్వాలు పెద్దగా స్పందించలేదని, అదపాదడపా ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారని, ఈ తీర్పుతో ప్రభుత్వాలను బాధ్యులను చేయడం హర్షించతగ్గ విషయమన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును చిత్తశుద్ధితో అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.




ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## వచ్చే ఆర్థిక సంవత్సరం బిసిల బడ్జెట్ రూ. 25 వేల కోట్లు కేటాయించాలి

### 14 బిసి సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** వచ్చే ఆర్థిక సంవత్సరం బీసీల సంక్షేమా నికి, అభివృద్ధికి బీసీల బడ్జెట్ రూ. 25వేల కోట్లు కేటాయించాలని 14 బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం విద్యానగర్ బీసీ భవన్‌లో జరిగిన 14 బీసీ సంఘాల సమావేశానికి జాతీయ బి.సి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో యేటా 25వేల కోట్లు కేటాయి స్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు 10వేల కోట్లకు మించి కేటాయించడం లేదు, ఖర్చు పెట్టడం లేదన్నారు. సమావేశాల్లో ఈ కింది తీర్మానాలు ఆమోదించారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ 25వేల కోట్లు కేటా యించాలని, బిసి కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ. 4 వేల కోట్ల బడ్జెట్, ఎంబీసీ కార్పొరేషన్ కు 2 వేల కోట్లు, బిసి అడ్వకేట్లకు ఇచ్చే స్టైపెండ్ నెలకు రూ.1000 నుంచి 10 వేలకు పెంచాలని, అలాగే ఐ.ఐ.టీ - ఐ.ఐ.ఎం - ఎన్.ఐ.టి తదితర కోర్సులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించాలని, ఈ సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కు ఒక బి.సి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో పక్షపాతం కృష్ణ మోహన్, నీల వెంకటేష్, పగిళ్ల సతీష్, అనంతయ్య, రాజేందర్, అనురాధ గౌడ్, జి. పద్మ, వేణుమాధవ్, కిషోర్ యాదవ్ తదితరులు సంఘ నాయకులూ పాల్గొన్నారు.



బతుకమ్మకుంటలో చేపలను వదులుతున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పెట్టు సాయి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, చిత్రంలో శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

## విహెచ్ చొరవతో బతుకమ్మకుంటకు పునరుజ్జీవం

### రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి

### ఇది 35 యేళ్ల పోరాట ఫలితం..

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** బతుకమ్మకుంట సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు ప్రత్యేక చొరవతోనే పునరుద్ధరణ జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి అన్నారు. శనివారం బతుకమ్మకుంటలో వి.హనుమంతరావుతో కలిసి చేపలు వదిలే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ మత్స్యశాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వంద శాతం సబ్సిడీతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులో చేపలను వదిలే పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని, ఇది రాష్ట్రంలోని లక్షలాది మంది మత్స్యకారుల కుటుంబాలకు వరంగా మారిందన్నారు. పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ స్థానికులతో కలిసి గత 35 సంవత్సరాలుగా పోరాటం చేసి బతుకమ్మకుంటను సాధించుకున్నామని తెలిపారు. కుంట పునరుద్ధరణకు సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నగర వ్యాప్తంగా కబ్జాకు గురవుతున్న చెరువులు కుంటలను కాపాడుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోత రోహిత్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్.లక్ష్మణ్ యాదవ్, పిసిసి కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, లక్‌పతి యాదగిరిగౌడ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, దిద్ది రాంబాబు, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, సత్తిబాబుగౌడ్, నగేష్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్ కోటం అనిల్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లోనే స్ట్రీట్ ఫుడ్..

మిరపకాయ బజ్జీ, ఉల్లిపాయ పకోడీ, పానీపూరీ, భేల్‌పూరి, సమోసా, ఆలూబోండా, వడాపావ్, పావ్‌భాజీ..ఎన్నెన్ని స్ట్రీట్ ఫుడ్స్! అలా వీధుల్లో నడుస్తుంటే ఆ పరిమళాలకు నోరూరినా.. వాటి మీద దుమ్మూధూళీ పడుతుందని కొనుక్కోడానికి వెనకాడతాం. అసలవన్నీ ఇంట్లోనే చేసుకుంటే,, ఎంచక్కా తినొచ్చు కదా! మీ కోసం కొన్ని.

## కచోరీ



**కావలసినవి:** మైదాపిండి 2 కప్పులు, ఉప్పు, నూనె తగినంత, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు,స్టఫింగ్ కోసం: పెసరపప్పు అర కప్పు, కారం రెండు చెంచాలు, ఛాట్ మసాలా, ధనియాల పొడి, ఆమూర్ పౌడర్ చెంచా చొప్పున, నెయ్యి 2 చెంచాలు.

తయారీ, మైదాపిండిలో కొన్ని నీళ్లు, కాస్త ఉప్పు, నెయ్యి, నూనె వేసి బాగా కలిపి అరగంట పక్కనుంచాలి. పెసరపప్పును రెండు గంటలు నానబెట్టాలి. నీళ్ల వడకట్టేసి కొంచెం బరకగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక పెసరపప్పు ముద్దను వేయించాలి. అందులో నెయ్యి, కారం, ఉప్పు, చాట్ మసాలా, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పౌడర్ జతచేసి ఇంకాస్త వేగనిచ్చి దించాలి. మైదాపిండిని చిన్న భాగాలుగా విడగొట్టి పూరీల్లా వత్తుకోవాలి. ఒక్కో పూరీ మీద రెండు చెంచాల స్టఫింగ్ను ఉంచి అంచులను దగ్గరగా చేసి.. చేత్తో తట్టి కచోరీ చేయాలి. అన్నీ అయ్యాక కాగుతున్న నూనెలో వేయిస్తే సరి..

## షాహీ టుకడా



**కావలసినవి:** బ్రెడ్ స్లైసులు 8, పంచదార ముప్పావు కప్పు, పాలు 5 కప్పులు, నెయ్యి పావు కప్పు, యాలకుల పొడి అర చెంచా, కుంకుమ పువ్వు కాస్త, పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు అన్నీ కలిపి ముప్పావు కప్పు

**తయారీ:** పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులను నేతిలో వేయించాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పాలు పోసి మధ్యలో కలియ తిప్పుతూ మరిగించాలి. పాలు చిక్కగా అయ్యాక.. యాలకుల పొడి, డ్రైఫ్రూట్స్ పలుకులు, కుంకుమ పువ్వు వేసి, ఇంకో రెండు నిమిషాలు దించేస్తే రబ్రీ తయారైపోతుంది. పంచదార పాకం తయారుచేయాలి. బ్రెడ్సుల అంచులను తీసేసి, ఒక్కో బ్రెడ్న రెండు ముక్కలుగా కట్ చేయాలి. వీటిని పెనం మీద నేతితో బంగారు రంగు వచ్చే వరకూ వేయించి, పంచదార పాకంలో ముంచి తీయాలి. తినేటప్పుడు ఈ స్లైసుల మీద తగినంత రబ్డీ వేసుకుంటే సరి... షాహీ తుకణాలను ఆనందంగా ఆస్వాదించవచ్చు.

## అక్కీ రోటీ

**కావలసినవి:** బియ్యప్పిండి 2 కప్పులు, ఉల్లి, కొత్తిమీర, సోయకూర తరుగు పావు కప్పు చొప్పున, అల్లం అంగుళం ముక్క, పచ్చిమిర్చి 3, జీలకర్ర చెంచా, రుచికి సరిపడా, కరివేపాకు నాలుగు ఉప్పు రెబ్బలు, నూనె తగినంత **తయారీ:** అల్లం, పచ్చిమిర్చిలను కచ్చా పచ్చగా నూరాలి. వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, తగినన్ని నీళ్లు, ఉల్లి, కొత్తిమీర, సోయకూర తరుగు, కరివేపాకు, అల్లం, మిర్చి ముద్ద, ఉప్పు, జీలకర్ర వేసి బాగా కలపాలి. పిండిలో అన్నీ కలిసిపోయి, ఉండలు కట్టకుండా మెత్తగా అయ్యాక.. పన్నెండు భాగాలు చేసుకోవాలి. అరిటాకు లేదా పాలిథిన్ కాగితం మీద నూనె రాసి.. ఒక్కో బాల్ను చేత్తో తడుతూ రొట్టె చేసి కాలుతున్న పెనం మీద రెండు వైపులా బంగారు రంగు వచ్చేదాకా కాల్చుకుంటే సరి.. రుచికరమైన అక్కి రోటీ రెడీ,



# విదేశీ గడ్డపై భారతీయులకు ఉపాధి కల్పిస్తూ..


నందిని


భర్త ఉద్యోగరీత్యా విదేశీగడ్డ మీద అడుగు పెట్టారామె. ఖతర్లో స్థిరపడినా భారత్ మీద అభిమానాన్ని కోల్పోలేదు. కాబట్టే, అక్కడ మనవాళ్లు పడుతున్న కష్టాలను గమనించారు. వారికి ఉపాధి కల్పించడమే కాదు, సాయమూ చేశారు. ఆ సేవలకు గుర్తింపుగానే నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు... అబ్బగౌని నందిని.

మాది మేడ్చల్ జిల్లా మజీద్పూర్. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కి మారాం. నాకు బీబీఏ అయిపోగానే పెళ్లైంది. మావారు శ్రీధర్ ప్రోత్సాహంతో ఎంబీఏనీ పూర్తిచేశా. 2011లో మావారికి ఐతార్లో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆయనతో కలిసి అక్కడి కెళ్లా. మాకు ఇద్దరమ్మాయిలు. వాళ్లని చూసుకుంటూనే ఉద్యోగం చేసేదాన్ని. ఓరోజు ఆఫీసుకి వెళ్తే ఏజెంట్ల చేతిలో మోసపోయిన ముస్లిం యువతి కనిపించింది. ఆమె వేదన నన్ను కదిలించింది. తనను తీసుకుని భారత రాయబార కార్యాలయానికి వెళ్లా. అక్కడి అధికారులతో మాట్లాడి, క్షేమంగా భారత్‌కు వెళ్లేలా చూశారు. ఆ సంఘటన తరవాత వలస కార్మికులుగా వచ్చిన మనవాళ్ల ఇబ్బందులెన్నో కనిపించాయి. వాళ్లకి సాయపడాలి అనిపించింది. అందుకే ఉద్యోగం మాని, వీళ్లకి సాయం చేయడంపైనే పూర్తి దృష్టి పెట్టా. ఓసారి కార్మికవాడకు వెళ్లినప్పుడు 20 మంది భారతీయులు తీవ్ర ఇబ్బందులు పడటం చూశారు. ముందు వాళ్లందరికీ భోజనాలు పెట్టించి, వివరాలు సేకరించారు, తరవాత రాయబార కార్యాలయంతో మాట్లాడితే వారు స్పందించారు, ఆ కార్మికులను స్వదేశానికి పంపారు. గుర్తించే సమయంలో 40 మందిని ప్రత్యేక విమానాల ద్వారా భారత్‌కు పంపించాం. నిత్యం కార్మికులను సందర్శిస్తూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తాను. ఏజెంట్ల వల్ల మోసపోయిన వారికే కాదు, జైళ్లలో మగ్గుతున్న వాళ్లని విడిపించి క్షేమంగా భారత్‌కి పంపడంలో సాయపడుతున్నా. ఇక్కడ ఇళ్లల్లో పనిచేయడానికి తెలుగు రాష్ట్రాల నుంచి మహిళలు వస్తున్నారు వారిని కలిసి మాట్లాడుతుంటారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, చిన్నచిన్న ఉద్యోగాలకు వీలుగా అరబిక్, ఆంగ్లంతోపాటు ఇతర భాషల్లో శిక్షణ ఇస్తున్నాం. ఉద్యోగరీత్యా ఇక్కడ స్థిరపడుతున్న భారతీయ కుటుంబాలు చాలానే. ఈ పిల్లలకు మన దేశం, భాష, సంస్కృతులపై అవగాహన కల్పిస్తున్నా. ఖతార్‌లోని భారతీయ సాంస్కృతిక కేంద్రం (ఐసీసీ)లో బతుకమ్మ, సంక్రాంతి, దసరా, దీపావళి వంటి పండుగలను నిర్వహించడంతోపాటు సంబంధిత పాఠాలూ బోధిస్తున్నాం. పిల్లలు, మహిళల్లో స్ఫూర్తిని కలిగించడానికి తెలుగు రాష్ట్రాల్లో ఐఎస్, ఐపీఎస్‌లు, అధికారులతో జూమ్ సమావేశాలు నిర్వహిస్తాం. మనవాళ్లే కాదు, ఖతార్ మహిళలూ వీటికి హాజరవుతుంటారు. ఐసీసీలో సభ్యురాలిగా చేరిన నేను ప్రస్తుతం సంస్థ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలిగా ఉన్నాను. నాకు మావారి సహకారం ఎప్పుడూ ఉంటుంది. తన సంపాదనలో కొంత భాగాన్నీ సేవాకార్యక్రమాలకు కేటాయిస్తుంటారు.

**పురస్కారం..** భారత రాయబార కార్యాలయం ప్రవాసీ భారతీయ దినోత్సవం సందర్భంగా నన్ను ఖినారీశక్తి పురస్కారానికి ఎంపిక చేసింది. సమర్థ మహిళా నాయకత్వం, సేవాభావం, సమాజాభివృద్ధి, భారతీయ సంస్కృతి పరిరక్షణ. భారత్ ఐతార్ మైత్రిని బలోపేతం చేయడానికి కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు ఇచ్చినట్లు చెప్పినప్పుడు చాలా సంతోషించా. నా సేవలకు దక్కిన గుర్తింపు ఇది. □

# ప్రభువే అనంతజ్ఞాని

'ఆశ్చర్యమైన ఆలోచనశక్తియు అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే' (యెషయా 28:29), 'బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందే గుప్తములైయున్నవి' (కొలొస్సయులకు 2:3). అవును దేవుడే అనంతజ్ఞాని. ఆయన జ్ఞానాన్ని మనం కొలవలేం. ఇంత అని వర్ణించలేం. అనంతజ్ఞాని అయిన దేవుడు తన జ్ఞానం బట్టి అతిశయించే దేవుడు కాదు. ఆయన జ్ఞానంతోనే సమస్త సృష్టిని నిర్మించాడు. మానవుడిని తయారు చేశాడు. నిరంతరం తన జ్ఞానంబట్టే ప్రపంచాన్ని ఏలుతున్నాడు. ఈలోకంలో ఎంతో తెలివితేటలు, జ్ఞానం గలవారు న్నారు. తమ తెలివితేటలతో ప్రతిభను చాటుకుంటూ, ఉన్నత పదవుల్లో ఉంటూ, పేరు, డబ్బును సంపాదించుకుంటున్నారు. అయితే దేవుడు ఇలాంటి వారిని తృణీకరిస్తాడు. జ్ఞానంగల వారిని ఆయన తృణీకరించి, జ్ఞానం లేనివారిని రక్షించుకుంటున్నాడు. 'జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు' (1 కొరింథీ 1:29). లోకంలో ఉన్నవారు తమ జ్ఞానంబట్టి గర్విస్తుంటారు. తమకు కలిగే పేరు, సంపదలను చూసుకుని, ఇతరులపట్ల చిన్నచూపు ఉండవచ్చు. తెలివితేటలు లేనివారిని ఎవరూ గుర్తించరు. వారిని అభిమానించేవారు కూడా ఉండదు. కానీ దేవుడికి ఇలాంటివారే కావాలి. అందుకే బలహీనులను, జ్ఞానంలేనివారిని, బలహీనులను దేవుడు తన 'రక్షణ'తో వారికి నిత్యరాజ్యాన్ని ఇస్తున్నాడు. యేసుక్రీస్తును విశ్వసించడమే అసలైన జ్ఞానం అని బైబిల్ సెలవిస్తున్నది. ప్రభువును ఎవరైతే సేవిస్తున్నారో వారే అసలైన జ్ఞానవంతులు. ఎందుకంటే ఈ జ్ఞానం తమ శక్తితో పొందినది కాదు. అది దేవుడి కృపే. అయితే ఈలోకంలో జయించాలంటే మనకూ జ్ఞానం, తెలివితేటలు అవసరం. అవి దేవుడిని అడిగితే ఆయనే ఇస్తాడు. ఎందుకంటే ఆయనే జ్ఞాని కాబట్టి, మనకు అవసరమైన తెలివితేటలు ఇచ్చి, ఇతరులతో మనల్ని సమానంగా కూర్చుండబెడతాడు. కాబట్టి దేవుడిని విశ్వసించి, ఆయన జ్ఞానంతో లోకంలో విజయపథంలో జీవిద్దాం.



-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# మెరిసే జుట్టుకి గంజి

వాతావరణం మారింది. పొడిగాలకు తేను తగ్గి. జుట్టు నిర్జీవంగా మారుతుంది. మరి వాటికి తగిన పోషణ ఖరీదైన సాంపూలు, కండిషనర్లే వాడక్కర్లేదు. గంజి కూడా మేలు చేస్తుంది. చైనీస్, కొరియన్ బ్యూటీ కేడీ దీనికి ప్రత్యేక ప్రాధాన్యమూ ఉంది. మరి దీన్నెలా వాడాలి? ఆ ప్రయోజనాలేంటో తెలుసుకుందామా!

గంజిలో ఇనోసిటాల్ అనే కార్బోహైడ్రేట్ జుట్టు కుదుళ్లని బలాన్ని ఇస్తుంది. ఒత్తుగా ఎదిగేలా వేస్తుంది. ఇందులో కాస్త నిమ్మరసం కలిపి పెడితే మెరుపు కనిపిస్తుంది. ఉడికించిన అన్నం నీళ్లల్లో విటమిన్ బి, ఇ, సి విటమిన్లుఉంటాయి. ఇవి వెంట్రుకలకు పోషణ అందించి ఆరోగ్యంగా మారుస్తాయి. కండిషనర్గా వాడితే జుట్టు చిట్లడం తగ్గుతుంది. పొడవూ జుట్టు బిరుసుగా మారిందా? అయితే, గోరువెచ్చగా ఉన్నపుడే గంజిని తలకు పట్టించి ఓ పదిహేను నిమిషాలు వదిలేయండి. ఇది కురులను మెత్తగా మారుస్తుంది. ఇందులోని నేచురల్ ప్రొటీన్... జుట్టుకి సహజంగా నిగారింపుని తెస్తుంది. □

# తోబుట్టువులే తోడు నీడగా..



నాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో.. ఒక్కో ఇంట్లో పదిమంది దాకా పిల్లలు కనిపించేవారు. అంతమంది ఉన్నా.. అన్యోన్యంగా కలిసి మెలిసి ఆడుకునేవారు. నేటికాలంలో ఇంట్లో ఇద్దరే ఉన్నా.. చీటికి మాటికి గొడవలు పడుతున్నారు. రాజీకి రాలేకపోతున్నారు.

ఇందుకు పెద్దలపర్యవేక్షణ లేకపోవడం ఒక కారణమైతే.. తల్లిదండ్రుల తీరికలేని జీవనశైలి మరో కారణమని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఇలాగే కొనసాగితే, వయసుతోపాటే వారిమధ్య దూరం కూడా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా జరగకూడదంటే.. చిన్నప్పుడే తోబుట్టువుల మధ్య ప్రేమ, అనురాగాలను పెంచేందుకు తల్లిదండ్రులుచొరవ చూపాలని సూచిస్తున్నారు.

**పక్షపాతం పనికిరాదు.....**పిల్లల విషయంలో పక్షపాతం ఏమాత్రం పనికిరాదు. తోబుట్టువులు అన్నాక.. గొడవలు సాధారణమే! అలాంటి సమయాల్లో ఇద్దరి సమస్యలనూ పూర్తిగా వినాలి. ఒకరివైపే వకాల్తా పుచ్చుకొని.. వారు చెప్పిందే విని తుది నిర్ణయం తీసుకోవద్దు. ఇలా చేయడం వల్ల ఎదుటివారు మానసిక క్షోభకు గురవుతారు. తోటివారిపై విద్వేషం పెంచుకుంటారు. అలాకాకుండా ఉండాలంటే.. ఇద్దర్నీ కూర్చోబెట్టి మాట్లాడాలి. ఇద్దరి వివరణలూ విని.. అన్ని రకాలుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే పిల్లల మధ్య నైతిక సంబంధాలు మెరుగు పడుతాయి. స్నేహపూర్వక వాతావరణం అలవడుతుంది.

**పోలికలతో పోటీనే.....** పిల్లల్ని ఒకరితో మరొకరిని ఎట్టి పరిస్థితుల్లోనూ పోల్చవద్దు.'అక్కను చూసి నేర్చుకో!' అనో.. 'అన్నను చూసి బుద్ధి తెచ్చుకో!' అనో అస్సలు అనొద్దు. అలా పోలిక పెడితే.. వారి మధ్య పోటీ పెడు తున్నట్టే! ఒకరిని పొగడటం.. మరొకరిని తిట్టడం.. పిల్లల మానసిక స్థితిపై ప్రభావం చూపుతుంది. వారిలో ఒకరిపై ఒకరికి తెలియ కుండానే కోపతా పాలు పెరుగు తాయి. దీంతో.. ఇద్దరి మధ్యా తరచుగా తగువులూ అవుతుంటాయి.

**బంధం బలపడేలా.....** పిల్లల మధ్య విద్వేషాలు రగిలితే.. పెద్దయ్యాక కూడా కొనసాగే అవకాశం ఉంటుంది. అందుకే, బాల్యంలోనే వారిలో విద్వేషాలను తొలగిం చాలి. వారి మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి. వారితో ఇద్దరూ కలిసి ఆడే సరదా ఆటలను ఆడించాలి. ఫన్నీ టాస్కులు అప్పగించి.. ఇద్దరూ కలిసి చేసేలా ప్రోత్సహించాలి. దీనివల్ల ఒకరి గురించి మరొకరు పూర్తిగా తెలుసుకుంటారు. ఒకరికొకరు సాయం చేసుకోవడం.. బొమ్మలను పంచుకోవడం, పరస్పరం సంతోషంగా ఉండటం.. □

# తెర

# 'అనగనగా ఒక రాజు' విజయోత్సవం



కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని చెప్పడానికి ఉదాహరణ ఈ ఖిఅనగనగా ఒక రాజుఖి చిత్రం: ప్రముఖ నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుమెగాస్టార్ చిరంజీవి గారు మెచ్చిన హీరో నవీన్ పొలిశెట్టి: ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న చిత్రం 'అనగనగా ఒక రాజు'. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, సంచలన విజయాన్ని అందుకుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించారు. దిల్ రాజు మాట్లాడుతూ.. "అనగనగా ఒక రాజు చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు. నిర్మాత నాగవంశీకి ప్రత్యేక అభినందనలు. ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ.. 'టైమ్ బాగుంటే హీరో అవుతారు అంటుంటారు. కానీ టైమింగ్ బాగుండి హీరో అయినవాడు నవీన్ పొలిశెట్టి. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "మా సినిమాలో ఒక డైలాగ్ ఉంది. రాజు గారి పెళ్లి ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోద్దని. అలాగే ఈ సంక్రాంతి మా అందరికీ ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోతుంది. ధన్యవాదాలు.

మాట్లాడుతూ

# 'స్కై' సినిమా ప్రీ రిలీజ్



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృధ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా "స్కై". పృధ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. "స్కై" సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "స్కై" సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ప్రముఖ దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీ మీద ప్యాషన్ తో చిన్న స్థాయి నుంచి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎదిగాను. అన్నారు.నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఈవెంట్ కు వచ్చే ముందు "స్కై" సినిమా కంటెంట్, సాంగ్స్ చూశాను. ఆ కంటెంట్ చూస్తుంటే ఈ మూవీలో ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీ చూడబోతున్నామని తెలుస్తోంది. ప్రొడ్యూసర్ నాగిరెడ్డి గుంటక మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ ప్రెస్ మీట్ కు వచ్చిన మధుర శ్రీధర్ గారికి థ్యాంక్స్. "స్కై" సినిమాను మేమంతా ఎంతో కష్టపడి ప్రొడ్యూస్ చేశాం. టీమ్ అందరూ ప్యాషనేట్‌గా వర్క్ చేశారు.. అన్నారు.

# 'శ్రీనివాస మంగాపురం'లో

## రవీనా టాండన్ కుమార్తె రాషాథడానీ



'శ్రీ 100', మంగళవారం చిత్రాలలో ప్రశంసలు పొందిన దర్శకుడు అజయ్ భూపతి, ప్రస్తుతం మరో క్రేజీ ప్రాజెక్ట్ 'శ్రీనివాస మంగాపురం' కు దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, జయ కృష్ణ ఘట్టమనేని ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె, ఉయ్ అమ్మ పాటతో గుర్తింపు పొందిన రాషాథడానీ కూడా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. సక్సెస్ ఫుల్ నిర్మాత అశ్విని దత్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తుండగా, చందమామ కథలు బ్యానర్ పై నిర్మాత పి.కిరణ్ దీనిని నిర్మిస్తున్నారు. టైటిల్ రివీల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ రోజు, ఈ చిత్రం నుంచి రాషా థడానీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు, ఇందులో ఆమెను మంగ్త పాత్రలో పరిచయం చేశారు. సాంప్రదాయ దుస్తులలో రాషా అద్భుతంగా కనిపిస్తోంది, హుందాతనం, బలమైన స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. మోషన్ పోస్టర్‌లో ఆమె ఆకట్టుకునే లుక్స్ ఇప్పటికే ప్రేక్షకులు, సినీ వర్గాలని అలరించాయి. ఈ చిత్రం ఇటీవల 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రెండవ షెడ్యూల్‌లోకి ఎంటర్ అయింది. ఉన్నత నిర్మాణ విలువలు, క్రియేటివ్ విజన్‌తో టీం వేగంగా ముందుకు సాగుతోంది.

# '1+1 ఆఫర్' సినిమా ట్రైలర్



నిమ్మల శ్రీరామ్, మోనిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా "1+1 ఆఫర్". ఈ చిత్రంలో రాజేష్ భూపతి, రోహిత్, బాలాజీ, సురేష్ కుమార్ యాదవ్, జీవన్, రామ్ (కేప పాల్ ఫేమ్)ఇతర కీలక పాత్రల్లో నటించారు .ఈ చిత్రాన్ని త్రివేణి పిక్చర్స్ బ్యానర్ పై వి.వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు .ఏఎస్ఆర్ (శ్రీరామ్) దర్శకత్వం వహించారు. సరికొత్త కథా కథనాలతో కంటెంట్ ఓరియెంటెడ్ మూవీగా రూపొందిన "1+1 ఆఫర్" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శుక్రవారం హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో దర్శకుడు వి. సముద్ర, నటుడు 30 ఇయర్స్ పృథ్వీ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలన్ రాజేష్ మాట్లాడుతూ "1+1 ఆఫర్" చిత్ర ట్రైలర్ లాంఛ్ చేసేందుకు వచ్చిన సముద్ర గారికి, పృథ్వీ గారికి థ్యాంక్స్. అన్నారు.హీరోయిన్ మోనిక మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోయిన్ గా నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. అన్నారు.దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ "1+1 ఆఫర్" ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమాతో వన్ ప్లస్ హండ్రెడ్ అనేలా దర్శకుడు శ్రీరామ్ గారు వంద సినిమాలు చేయాలి. . అన్నారు.30 ఇయర్స్ పృథ్వీ మాట్లాడుతూ రాజేష్ మంచి ప్రతిభ గల నటుడు . హీరోగా "1+1 ఆఫర్" సినిమా ఆయనకు గుర్తింపు తీసుకురావాలి అన్నారు.

# 'అమరావతికి ఆహ్వానం' టీజర్



శివ కంఠ మనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా "అమరావతికి ఆహ్వానం". ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ ను ప్రఖ్యాత నిర్మాత నటులు మురళీ మోహన్ గారు రిలీజ్ చేశారు. "అమరావతికి ఆహ్వానం" సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో..నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ నిర్మాత వెంకటేశ్వరరావు గారు మా బావగారు. ఆయన అడగటంతో ఈ సినిమాలో నటించాను. ప్రముఖ నటులు నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ "అమరావతికి ఆహ్వానం" సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది. ఈ నిర్మాతలు గతంలో కూడా చిన్న బడ్జెట్ లో మంచి చిత్రాలు చేశారు. అన్నారు.ప్రొడ్యూసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాకు సినిమా ఇండస్ట్రీతో 30 ఏళ్లకు పైగా అను బంధం ఉంది. సినిమాలు చేయాలంటే డబ్బులు కావాలని రియల్ ఎస్టేట్ మార్గాన్ని ఎంచుకు న్నాం. అన్నారు. హీరోయిన్ ఎస్తేర్ "అమరావతికి ఆహ్వానం" సినిమా టీజర్ చూస్తున్నప్పుడు అందులోని యాక్టర్స్ అంతా నిజంగానే ఒక ఫ్యామిలీ కావొచ్చనే ఫీలింగ్ మీకు ఎలా కలిగిందో షూటింగ్ చేసేప్పుడు మా యూనిట్ అందరం ఒక ఫ్యామిలీ అనే భావన మా అందరిలో కలిగింది. డైరెక్టర్ జీవీకే మాట్లాడుతూ హీరో శివ కంఠమనేని మాట్లాడుతూ 'మేము కలిసి గతంలో 'అక్కడొకడుంటాడు, మధురపూడి గ్రామం అనే నేను, రాఘవరెడ్డి, బిగ్ బ్రదర్' వంటి మూవీస్ చేశాం. ఇప్పుడు "అమరావతికి ఆహ్వానం" చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం అన్నారు.

# 'విత్ లవ్' ట్రైలర్ లాంచ్



అభిషన్ జీవింత్, అనస్వర రాజన్ ప్రధాన పాత్రలలో నటించిన ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'విత్ లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో పాటు నజరత్ పసిలియన్, మహేష్ రాజ్ పసిలియన్ ఎంఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు. ఖివిత్ లవ్‌ఖి చిత్రం ఫిబ్రవరి 6, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సురేష్ ప్రొడక్షన్స్ నిర్వహిస్తోంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. అందరికీ హాయ్. చెప్పలేని ప్రేమ గురించి ఇక్కడ అంతా చాలా బ్యూటిఫుల్ గా మాట్లాడారు. ట్రైలర్ చూసిన అందరూ కూడా చాలా కనెక్ట్ అయ్యారు. . థాంక్యూ. హీరో అభిషన్ జీవింత్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. టూరిస్ట్ ఫ్యామిలీకి మీరందరూ గొప్ప ఆదరణ ఇచ్చారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ట్రైలర్ చూసిన తర్వాత మీరందరూ కరెక్ట్ అవడం చాలా ఆనందంగా ఉంది. ప్రొడ్యూసర్ సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాని తెలుగులోకి తీసుకురావడం నాకు చాలా ఆనందంగా ఉంది. రానా చైల్డ్ వుడ్ ఫ్రెండ్. తనతో నాకు ఎన్నో బాల్య జ్ఞాపకాలు ఉన్నాయి.



## థాయ్‌లాండ్ మాస్టర్స్ ఫైనల్స్‌కు దేవిక

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ మాస్టర్స్-2026లో భారత్ షట్లర్ దేవిక సిహాగ్ దూసుకెళ్లింది. థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300లో నిలిచిన ఏకైక భారతీయురాలు దేవిక సిహాగ్ శనివారం మహిళల సింగిల్స్ ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్స్‌లో దేవిక 22-20, 21-13 తేడాతో చైనీస్ తైపీకి చెందిన ఐదో సీడ్ హువాంగ్ యు హ్సున్ పై కేవలం 38 నిమిషాల్లోనే విజయం సాధించింది. దేవిక తొలి గేమ్‌లో 15-20తో వెనుకబడి ఉంది. అయితే తదుపరి దూకుడుతో 7 పాయింట్లతో తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో సిహాగ్ జోరు పెంచి వరుస గేమ్‌లలో మ్యాచ్‌ను ముగించడంలో ఎటువంటి తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్స్‌లో దేవిక వరల్డ్ 16వ ర్యాంకర్, థాయిలాండ్‌కు చెందిన సుపానిడా కటేథాంగ్‌పై సంచలన విజయం సాధించింది. ప్రపంచ ర్యాంక్‌లో 63వ స్థానంలో ఉన్న దేవిక, టాప్ సీడ్ కటేథాంగ్‌ను 21-19, 21-18 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో మన్నెపల్లి తరుణ్ చైనాకు చెందిన జు జువాన్ చెన్ చేతిలో కేవలం 37 నిమిషాల్లో 11-21, 17-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్ తో గంటా నాలుగు నిమిషాలు జరిగిన ఈ పోటీలో ఇషారాణి బారువా 21-18, 16-21, 13-21 తేడాతో పరాజయం చెందింది.




## మహిళల కబడ్డీ ఛాంపియన్‌గా హర్యానా

**న్యూఢిల్లీ:** 72వ మహిళల సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026లో హర్యానా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో డిపెండింగ్ ఛాంపియన్స్ ఇండియన్ రైల్వేస్‌పై 39-37 తేడాతో విజయం సాధించిన హర్యానా టైటిల్‌ను కైవసం చేసుకుంది. హర్యానా చివరి దశలో విజయం సాధించడానికి ముందంజలో ఉన్నా, రైల్వేస్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకునే ఒత్తిడిలో కూడా అద్భుతమైన ప్రదర్శనను అందించింది. హర్యానా తరఫున నికితా అత్యుత్తమ ప్రదర్శన చేసి 17 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే హర్యానా జట్టులోని రుచి తొమ్మిది పాయింట్లతో బలమైన మద్దతును అందించగా, రాజ్ రాణి దాడులలో హర్యానాను నియంత్రణలో ఉంచడానికి దోహదపడింది. మ్యాచ్ కీలక దశల్లో ఆమె జట్టుకు మద్దతు ఇచ్చింది. ఇండియన్ రైల్వేస్ తరఫున పూజ 11 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. పూజకు సోనాలి షింగేట్ నుండి మరో బలమైన ఆల్ రౌండ్ సహకారం లభించింది. వారు ఒక్కొక్కరు ఆరు పాయింట్లు జోడించారు. ఆలస్యంగా ముందుకు సాగినప్పటికీ నాకౌట్ దశల్లో హర్యానా స్థిరమైన ప్రదర్శనలతో టైటిల్‌ను గెలుచుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌ను అద్భుతంగా ఓడించిన తర్వాత, హర్యానా టోర్నమెంట్‌కు ముందు ఫేవరెట్‌గా ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌ను సెమీఫైనల్‌లో ఓడించింది. మరోవైపు, ఇండియన్ రైల్వేస్ టోర్నమెంట్ అంతటా తమ అనుభవాన్ని ప్రదర్శించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో మహారాష్ట్ర, సెమీ ఫైనల్స్‌లో తమిళనాడుపై ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ పోరులో తృటిలో ఓడిపోయే ముందు కూడా పోటీలో అత్యంత నిలకడగా రైల్వేస్ జట్టు పట్టుదలతో వ్యవహరించింది. ఇక సెమీఫైనలిస్టులుగా ఓడిన హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు జట్లకు కాంస్య పతకాలు లభించాయి.

## ఆస్ట్రేలియా ఓపెన్ విజేతగా రిబకినా

### హోరాహోరీ పోరులో సబలెంకా ఓటమి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా ఓపెన్-2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్తాన్ స్టార్ ఎలెనా రిబకినా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో ప్రపంచ నంబర్ 1 ఆర్యనా సబలెంకాపై 6-4, 4-6, 6-4 తేడాతో విజయం సాధించిన రిబకినా తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో చివరి వరకూ నువ్వానేనా అన్నట్లు సాగింది. తొలి సెట్‌లో నిలకడైన ఆటతో 6-4 తేడాతో రిబకినా గెలుచుకుంది. అనంతరం సబలెంకా తన మార్కు పవర్ హిట్టింగ్‌తో పుంజుకుంది. ఈ సెట్‌లో రిబకినాను 6-4 తేడాతో ఓడించిన సబలెంక మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. ఈ సెట్‌లో కూడా సబలెంకా సత్తా చాటింది. వరుస గేమ్‌లు గెలుస్తూ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే రెండుసార్లు బ్రేక్ చేసిన రిబకినా 6-4 తేడాతో సెట్‌ను సొంతం చేసుకుంది.

## డబ్ల్యుపిఎల్ ఫైనల్‌లో బెంగళూరు

### రెండో ప్లేస్‌లో గుజరాత్.. మూడో స్థానానికి గట్టి పోటీ

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026 చివరి అంకానికి వచ్చేసింది.యూపీ వారియర్జ్ పై విజయం సాధించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లో ఫైనల్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా నిలిచింది. ఈ సీజన్‌లో లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లు (ఎనిమిది) ఆడిన ఆర్‌సీబీ ఆరు విజయాలను సాధించి +1.247 నెట్ రన్ రేటు కలిగి 12 పాయింట్లతో పాయింట్ల పట్టిక లో అగ్రస్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆర్‌సీబీతో పాటు, గుజరాత్ జయింట్స్, ముంబై ఇండియన్స్ 8 మ్యాచ్‌లు ఆడగా, మిగిలిన రెండుజట్లు తలా 7మ్యాచ్‌లు ఆడేశాయి. ఇక లీగ్ దశలో ఏ జట్టు ఆర్‌సీ బీ పాయింట్లను దాటడం కాదు కదా సమం చేసే అవకాశం లేదు. ఈ క్రమంలోనే ఆర్‌సీబీ ఫైనల్‌కు చేరుకుంది. లీగ్ నిబంధనల ప్రకారం టేబుల్ టాపర్ (పాయింట్ల పట్టికలో అగ్రస్థానం) జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడతాయి. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కు చేరుకుంటుంది. ఇప్పటికే





బెంగళూరు ఫైనల్ చేరుకోవడంతో మిగిలిన రెండు స్థానాల కోసం ఏకంగా 2 జట్లు పోటీపడుతున్నాయి. ఈ సీజన్‌లో గుజరాత్ ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించి -0.168 నెట్ రన్ రేట్‌తో 10 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. గుజరాత్ తమ చివరి లీగ్ మ్యాచ్ ముంబైపై విజయం సాధించడంతో ఎలిమినేటర్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. అలాగే ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ముంబై ఇండియన్స్ 8 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో -0.059 నెట్ రన్ రేట్, ఆరు పాయింట్లుతో పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఢిల్లీ క్యాపిటల్స్ ఏడు మ్యాచ్‌లు ఆడింది.

మూడుమ్యాచ్‌ల్లో గెలిచి 6పాయింట్లతో పట్టికలో నాలుగోస్థానంలో కొనసాగుతోంది. తన చివరి మ్యాచ్‌ను యూపీతో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ముంబై వర్సెస్ గుజరాత్ మ్యాచ్‌తో సంబంధం లేకుండా ఎలిమినేటర్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిపోతే మాత్రం ఇతర జట్ల ఫలితాలు, రన్‌రేట్ లెక్కల పై ఆధాపడి ఉంటుంది. యూపీ వారియర్జ్ ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో రెండు మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో నిలిచింది, ఈ జట్టు ఎలిమినేటర్‌కు అర్హత సాధించాలంటే ముందుగా ఢిల్లీ పై భారీ తేడాతో గెలుపొందాలి. అప్పుడు అన్ని జట్ల పాయింట్లు సమమైనా నెట్‌రన్‌రేటు మెరుగ్గా ఉంటే యూపీ ఎలిమినేటర్‌కు అర్హత సాధిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యూపీ ఎలిమినేటర్‌కు చేరుకోవాలంటే ఏదైన అద్భుతం జరగాల్సిందే.




## ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో తేజస్విన్‌కు హైజంప్ టైటిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ కాంస్య మీట్ 2026, డెలాస్ డాడ్స్ ఇన్విటేషనల్‌లో హైజంప్ టైటిల్‌ను తేజస్విన్ శంకర్ కైవసం చేసుకున్నాడు. అమెరికాలోని మాన్‌హట్టన్‌లో శనివారం జరిగిన ఈ పోటీలో పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత షెల్బీ మెక్‌వెన్‌ను ఓడించి సంచలన విజయం సాధించాడు. ఈ టోర్నీలో శంకర్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు, మొదటి ప్రయత్నంలోనే 2.26 మీటర్ల వరకు అన్ని మార్కులను సాధించి హోమ్ ఫేవరెట్ షెల్బీని అధిగమించాడు. అతడు 2.26 మీటర్లతో తన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైన తర్వాత 2.22 మీటర్లతో రెండవ స్థానంలో నిలిచాడు. ఫిబ్రవరి 2023లో బోస్టన్‌లో 2.26 మీటర్ల దూరంతో ఇండోర్ హైజంప్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత శంకర్ చేసిన అత్యుత్తమ ప్రయత్నం ఇది.



## టి 20లో పాక్ గెలుపు

### 90 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఓటమి

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్ కోసం పాకిస్తాన్ అద్భుతంగా సిద్ధ మవుతోంది.మొదటి టీ20 గెలిచిన తర్వాత, పాక్ లాహోర్‌లో శనివా రం జరిగిన రెండవ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 90 పరుగుల తేడాతో ఓడించింది. 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా 15.4 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయింది. అబ్రార్ అహ్మద్, షాదాబ్ ఖాన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అఘా కేవలం 40 బంతుల్లో 76 పరుగులు చేసి పాకిస్తాన్ 198 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ఉస్మాన్ ఖాన్ కూడా 36 బంతుల్లో 53 పరుగులు చేసి అర్ధ సెంచరీ చేశాడు. అయితే, స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ 5 బంతుల్లో కేవలం 2 పరుగులకే అవుట్ అయ్యాడు. ఆస్ట్రేలియా తరపున ఐదుగురు బౌలర్లు ఒక్కొక్కరు వికెట్ తీసుకున్నారు, ఆడమ్ జంపా జట్టులో కీలక ఆటగాడు. ఇక ఆస్ట్రేలియా సిరీస్‌లో 1-0 తేడాతో వెనుకబడి ఉంది.

## టాటా స్టీల్ చెస్‌లో అర్జున్, ప్రజ్ఞాఓటమి

**న్యూఢిల్లీ:** విజ్క్ ఆన్ జీలో జరిగిన 2026 టాటా స్టీల్ చెస్ మాస్టర్స్‌లో రౌండ్ 11 మ్యాచ్‌లలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఎరిగైసి అర్జున్, ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఇద్దరూ ఓడిపోయారు. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తెల్లటి పావులు కలిగిన అర్జున్ 2025 ఫిడే ప్రపంచ కప్ విజేత జావోఖిర్ సిందరోవ్ కంటే వెనుకబడిపోయాడు. టైటిల్ కోసం పోటీ ముమ్మరం కావడంతో ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ లీడర్ నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌తో కలిసి అగ్రస్థానంలో నిలిచే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో, ప్రజ్ఞానంద జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో ఓడిపోయాడు, ఇది టోర్నమెంట్‌లో అతని మూడవ ఓటమిని సూచిస్తుంది. మరోవైపు, ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ తోటి భారతీయుడు అరవింద్ చితంబరంతో జరిగిన మ్యాచ్‌లో తెల్లటి ముక్కలతో డ్రాగా ముగించాడు. కేవలం రెండు రౌండ్ల ఆట మిగిలి ఉండగా, 11 రౌండ్ల తర్వాత 5.5 పాయింట్లతో గుకేష్ ఎనిమిదో స్థానంలో నిలిచి అత్యుత్తమ స్థానంలో నిలిచాడు. టాటా స్టీల్ మాస్టర్స్ ప్రస్తుత ఛాంపియన్ ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో



11వ స్థానంలో ఉన్నాడు. 14 మంది ఆటగాళ్ల ఫీల్డ్‌లో అరవింద్ మరియు అర్జున్ చెరో 4 పాయింట్లతో 12వ మరియు 13వ స్థానంలో ఉన్నారు.

## వెండి, బంగారం ధరల్లో అనూహ్య పతనం!



**న్యూఢిల్లీ,జనవరి 31:** బులియన్ మార్కెట్‌లో దూసుకునిపోయిన బంగారం వెండిధరలు వారాంతంలో ఒక్కసారిగా తగ్గిపోయాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ బంగారం ఒక్కరోజులో 594 డాలర్లు క్షీణించి 4732 డాలర్లు, వెండిధర 36 డాలర్లు క్షీణించి 78 డాలర్లకు పరిమితం అయ్యాయి. ఈప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై చూపించింది. 10 గ్రాముల స్వచ్ఛత బంగారం రూ.21,860కిపైగా తగ్గి రూ.1,57,840కి చేరింది. అలాగే కిలో వెండి ధర కూడా రూ.లక్షకుపైగా పతనం అయి రూ.2.99 లక్షలవద్ద స్థిరపడింది. ముందురోజు ఈ ముగింపుధరలు రూ.1,79,800గాను, రూ.3,99,600గాను కొనసాగిన సంగతి తెలిసిందే. ఇక ఎంసిఎక్స్‌లో జరిగే తులం బంగారం ఏప్రిల్ కాంట్రాక్టుధర రూ.1,80,499వద్దప్రారంభం అయి రూ.1,83,439వద్ద గరిష్టాన్ని తాకింది. ఆతర్వాత మళ్లీ దిగజారి రూ.1,50,849కి చేరుకుంది. 18శాతం క్షీణించినట్లు బులియన్ నిపుణుల అంచనా. అలాగే వెండిధరలు మార్చినెల కిలో కాంట్రాక్టుధరలు రూ.3,83,898వద్దప్రారంభం అయి రూ.3,89,986వద్ద గరిష్టస్థాయికి చేరింది ఆ తర్వాత రూ.2,91,922 వద్దకనిష్టస్థాయికి చేరుకుని అక్కడే ముగిసింది. ఈ కాంట్రాక్టుధరల్లో 27శాతం నష్టంజరిగినట్లు ట్రేడర్లు అంచనావేసారు.

నాణెం

## కేంద్ర బడ్జెట్: ఎక్ఛేంజిల్లో ట్రేడింగ్!



**ముంబయి,జనవరి 31:** కేంద్ర ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో భారత స్టాక్ ఎక్స్ఛేంజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆదివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. దీంతో ఇన్వెస్టర్లు బడ్జెట్ ప్రకటనలకు అనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకునేందుకు వీలు కలుగుతుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు ఉదయం 11 గంటలకు లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు యథావిధిగా ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు పనిచేస్తాయని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఒక సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. నిర్మలా సీతారామన్‌కు ఇది వరుసగా తొమ్మిదో బడ్జెట్ కావడం విశేషం. ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న రెండో పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. ఫిబ్రవరి 1న సెటిల్‌మెంట్ హాలిడే కావడంతో ట్రేడింగ్‌పై కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. జనవరి 30న కొనుగోలు చేసిన షేర్లను బడ్జెట్ రోజున (ఫిబ్రవరి 1) అమ్మడానికి వీలుండదు. అలాగే బడ్జెట్ రోజున కొన్న స్టాక్స్‌ను మరుసటి రోజు విక్రయించడం సాధ్యం కాదు. ప్రభుత్వ రుణ ప్రణాళిక, ద్రవ్య లోటు లక్ష్యాలపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టి సారించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జీడీపీలో 4.1శాతం నుంచి 4.2శాతం మధ్య ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, ఆర్థిక సర్వే 2025 -26ను ఇప్పటికే ఈ నెల 29న పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

## 195 లక్షల టన్నులకు పెరిగిన చక్కెర ఉత్పత్తి



**ముంబయి,జనవరి 31:** చక్కెర ఉత్పత్తి దేశంలో ఒక్క జనవరినెలలోనే 195.03 లక్షల టన్నులకు పెరిగింది. గత సీజన్‌లో ఇదే కాలంలో 164.79 లక్షల టన్నులకు చేరిన ఉత్పత్తి ఈ ఏడాది గణనీయంగాపెరిగిందని భారత చక్కెర ఉత్పత్తిదారుల సంఘం వెల్లడించింది. వార్షిక ప్రాతిపదికన ఉత్పత్తిలో 18.4 శాతం పెరుగుదలను నమోదుచేసింది.ఇస్మా వివరాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 515 చక్కెర ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయి. గత సంవత్సరం ఇదే సమయంలో పనిచేస్తున్న 501 మిల్లుల కంటే కొంచెం ఎక్కువ. చక్కెర క్రషింగ్ సీజన్ సాధారణంగా అక్టోబర్‌లో ప్రారంభమవుతుంది. డేటా ప్రకారం, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక దేశంలోనే అత్యధికంగా చక్కెర ఉత్పత్తి చేసే రాష్ట్రాలు. ఈ మూడు రాష్ట్రాలలో ఈ సంవత్సరం ఉత్పత్తి పెరిగింది. మహారాష్ట్రలో చక్కెర ఉత్పత్తి 7.872 మిలియన్ టన్నులకు చేరుకుంది, గత సీజన్ ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు 42 శాతం ఎక్కువ. రాష్ట్రంలో ప్రస్తుతం 206 ఆపరేషనల్ మిల్లులు ఉన్నాయి, గత సంవత్సరం ఇదే కాలంలో 190 ఉన్నాయి. రెండవ స్థానంలో ఉన్న ఉత్తరప్రదేశ్ జనవరి చివరి నాటికి 5.51 మిలియన్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేసింది. ఇది గత సంవత్సరం కంటే దాదాపు 2.5 మిలియన్ టన్నులు (సుమారు 5 ) ఎక్కువ, దీనికి స్థిరమైన క్రషింగ్ మద్దతు ఉంది. కర్ణాటకలో క్రషింగ్ కూడా మెరుగుపడింది, గత సీజన్‌తో పోలిస్తే ఉత్పత్తి దాదాపు 15 పెరిగింది.కేంద్ర వ్యవసాయ మంత్రిగా శరద్‌పవార్ కొనసాగిన తరుణంలో ఆయన ప్రత్యేకించి ఆర్థికశాఖ, ప్రధానులతో చర్చించి చక్కెర మిల్లులకు ఎగుమతులపై ఆంక్షలు సడలింపులు, ఇథనాల తయారీ వంటి వాటిపై పలు ప్రయోజనాలకోసం కృషిచేసేవారు. ఇపుడు చక్కెర మిగులునిల్వలు క్లియర్‌చేసుకోవాలని ఉత్పత్తిదారులకు ఎగుమతి ఆర్డర్లు ఒక్కటే కీలకం.




## ఎల్టీసిజి, ఎస్టీసిజిలను పునఃసమీక్షించాలి!

### ఆర్థిక మంత్రికి ఇన్వెస్టర్ల సూచనలు

**న్యూఢిల్లీ,జనవరి 31:** కేంద్ర బడ్జెట్‌లోమూడు కీలక ప్రకటనలుచేస్తే స్టాక్ మార్కెట్లు దూసుకుపోతాయని మార్కెట్‌నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంశాలకు జెరోధా సీఈవో నితిన్ కామత్ కూడా మద్దతుతెలిపారు. షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్టీసిజి) పన్నులో ఏడాదికి రూ.1.25 లక్షల వరకు మినహాయింపు ఆ మొత్తాన్ని మించిన లాభాలపై 12.5 శాతం పన్ను అమలులో ఉంది. అయితే ఈ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని ఇన్వెస్టర్లుకోరుతున్నారు. స్వల్పకాలిక మూలధన లాభాల (ఎస్టీసీజీ)పై ప్రస్తుతం 20 శాతం పన్ను ను 10 శాతాకి తగ్గించాలని సూచిస్తున్నారు. రూ.1.5 లక్షల వరకు లాభాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలన్న డిమాండ్ వస్తోంది. డిమాండ్‌గా షేర్ల కొనుగోలు, అమ్మకాలపై విధించే సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ ఎస్టీటీని పూర్తిగా రద్దు చేయాలని లేదా మరింతగా తగ్గించాలని కోరుతున్నారు. ఈక్విటీ డెలివరీపై 0.1 శాతం డెరివేటివ్స్ పై.01 శాతం, ఇంట్రాడే ట్రేడింగ్‌పై 0.025 శాతం ఎస్టీటీవసూలు చేస్తున్నారు. ట్రేడింగ్‌పరిమాణం భారీగా ఉన్నవారికి పెనుభారం అవుతోందని నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026కు ముందు జెరోధా సీఈవో నితిన్ కామత్ ఎస్టీటీపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్టీసీజి పన్ను లేని సమయంలో ఎస్టీటీని అమలు చేశారు. ఇప్పుడు ఎల్టీసీజీ పన్ను తిరిగి వచ్చిన తర్వాత కూడా ఎస్టీటీని కొనసాగించడం వల్ల పెట్టుబడిదారులపై ద్వంద్వ పన్నుల భారం పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. మూడు డిమాండ్లలో కనీసం కొన్నింటినైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటిస్తే, స్టాక్ మార్కెట్‌లో భారీ ర్యాలీ కనిపించే అవకాశం ఉందని రిటైల్ ఇన్వెస్టర్లకు ఇది భారీ ఊరటనిస్తుందని భావిస్తున్నారు.

### ఈక్విటీలపై రాబడికి ఐటిచట్టం

## సెక్షన్ 87-ఎ వర్తించదు!

### డెల్లాయిట్ ఇడి దీపికా మాథుర్



**న్యూఢిల్లీ,జనవరి 31:** వేతన జీవులకు పన్ను భారం తగ్గించే ఉద్దేశంతో ఆదాయ పరిమితిని కేంద్రం రూ.12 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అయితే, ఓ ప్రత్యేక సందర్భంలో మాత్రం ఈ పరిమితికన్న ఆదాయం తక్కువ ఉన్నప్పటికీ పన్ను చెల్లించాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణ ఉద్యోగి ఏడాదికి రూ.12.75 లక్షలు సంపాదిస్తేప్రామాణిక తగ్గింపు రూ.75 వేలు మినహాయింపు తర్వాత రూ.12 లక్షలపై పన్ను రూ.60 వేలు. ఆదాయ పన్ను సెక్షన్ 87ఏ ప్రకారం ఈ మొత్తానికీ మినహాయింపు వర్తిస్తుంది. దీంతో సదరు ఉద్యోగిపై ఎలాంటి పన్ను భారం పడదని డెలాయిట్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికా మాథూర్ తెలిపారు. ఈక్విటీలపై రాబడికి ఈ 87ఏ సెక్షన్ వర్తించదని మాథుర్ వివరించారు. దీర్ఘకాలిక పెట్టుబడుల ద్వారా ఏడాదికి రూ.1.25 లక్షలు ఆర్జిస్తే ఆ మొత్తంపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగి మొత్తం ఆదాయం రూ.12 లక్షల లోపు ఉన్నప్పటికీ అందులో ఈక్విటీల ద్వారా పొందిన ఆదాయం రూ.1.25 లక్షల కంటే ఎక్కువైతే పన్ను భారం తప్పదని చెప్పారు. ఓ ఉద్యోగి మొత్తం ఆదాయం రూ.11 లక్షలు (జీతం రూ.9.75 లక్షలు, ఈక్విటీ రూ.1.25 లక్షలు) ఈక్విటీల ద్వారా వచ్చిన ఆదాయం పరిమితికి లోబడి ఉండడం వల్ల ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ఉద్యోగి ఆదాయం రూ.11 లక్షలు (జీతం రూ.8 లక్షలు, ఈక్విటీ రూ.3 లక్షలు) అయితే మాత్రం ఈక్విటీలో రూ.1.25 లక్షలు పోగా మిగిలిన రూ.1.75 లక్షలపై రూ.12.5 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈక్విటీల ద్వారా పొందిన ఆదాయం పరిమితి (రూ.1.25 లక్షలు) కి మించడమే దీనికి కారణమని మాథూర్ వివరించారు. ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను రేట్లు రెండు పన్ను విధానాల్లోనూ ఒకేలా ఉన్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి రిబేట్ వర్తిస్తుంది, ఈక్విటీ లాభాలకు వర్తించదు. అయినప్పటికీ, రూ.1.25 లక్షలు దాటిన లాభాలపై మాత్రమే 12.5 శాతం ప్రత్యేక రేటుతో పన్ను విధిస్తున్నందున, ఈక్విటీలపై కఠినంగా పన్ను వేస్తున్నారని చెప్పడం సరికాదని మాథుర్ వెల్లడించారు.

## ఆర్బీఐ విదేశీ కరెన్సీ ఖజానా కళకళ



**ముంబయి,జనవరి 31:** భారతదేశ విదేశీ మారక నిల్వలు జీవితకాల గరిష్టాలకు పెరిగాయి. జనవరి 23తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 8.053 బిలియన్ డాలర్లు, పెరిగి రికార్డు స్థాయిలో 709.413బిలియన్‌డాలర్లకు చేరాయి. ఆర్బీఐ ఖజానాలో బంగారం, విదేశీ కరెన్సీ నిల్వలు పెరగడంతో ఈ వృద్ధి కనిపించింది. ప్రత్యేకించి గత కొన్ని వారాల వ్యవధిలోనే భారత ఖజానాలోని విదేశీ కరెన్సీ నిల్వలు (డాలర్, యూరో, పౌండ్, యెన్, రూబుల్ వంటివి) భారీగా పెరిగాయని ఆర్‌బీఐ నివేదికలో ప్రస్తావించింది. జనవరి 23తో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ నిల్వలు 2.367 బిలియన్ డాలరు మేర 562.885 బిలియన్ డాలర్లకు చేరాయి. ముందు వారంతో పోలిస్తే, జనవరి 23తో ముగిసిన వారంలో భారత ఖజానాలోని బంగారం నిల్వలు సైతం 5.635 బిలియన్ డాలర్లు మేర పెరిగి 123.088 బిలియన్ డాలర్లకు చేరాయి. భారతదేశ విదేశీ మారక నిల్వలు చివరిసారిగా 2024 సెప్టెంబరులో 704.89 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయికి చేరాయి.16 నెలల తర్వాత మళ్లీ ఈ వారంలోనే భారత ఫారెక్స్ నిల్వలు రూ.65 లక్షల కోట్ల స్థాయిని చేరాయి. 2022లో భారత్ విదేశీ మారక నిల్వలు ఏకంగా 71 బిలియన్ డాలర్లు తగ్గిపోయాయి. కానీ 2023 నుంచి తీరుమారింది. భారత్ విదేశీ మారక నిల్వలు 2023లో 58 బిలియన్ డాలర్లు, 2024లో 20 బిలియన్ డాలర్లు, 2025లో 56 బిలియన్ డాలర్లు చొప్పున పెరిగాయి. 11 నెలల పాటు విదేశీ వాణిజ్యం చేసేందుకు సరిపడా విదేశీ కరెన్సీ నిల్వలు భారత్ వద్ద సిద్ధంగా ఉన్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. విదేశీ వాణిజ్యం, అంతర్జాతీయ లావాదేవీలు, విదేశీ పెట్టుబడులు, రుణాలు, విదేశీ మారక నిల్వల విషయంలో భారత్ బలంగా ఉందని స్పష్టం చేసింది. విదేశాల కరెన్సీ నిల్వలను ఆర్థిక పరిభాషలో ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏ) అంటారు. విదేశీ మారక నిల్వల్లో సింహభాగం విదేశాల కరెన్సీ నిల్వలు బంగారం నిల్వలు ఉంటాయి. మూడో స్థానంలో స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) ఉంటాయి. 2026 జనవరి 23 నాటికి భారతదేశం చేతిలో 18.737 బిలియన్ డాలర్లు విలువైన ఎస్‌డీఆర్‌లు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.